Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఫిబ్రవరి 7, 2025 | సంపుటి - 20 | సంచిక 132 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.



ఈ సంవత్సరం చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న అక్షయ తృతీయ పండుగ నాడు ప్రారంభమవుతుంది. గంగోత్రి, యమునోత్రి ధామ్ తలుపులు తెరవడంతో యాత్ర ప్రారంభం అవుతుంది. బద్రీనాథ్ ఆలయ తలుపులు మే 4న తెరుచు కుంటాయి. కేదార్‌నాథ్ ధామ్ తెరిచే తేదీని మహాశివరాత్రి పండుగనాడు నిర్ణయిస్తారు. ఈ మేరకు గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన యాత్ర నిర్వహణ కమిటీ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

## ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

### భక్తుల రిజిస్ట్రేషన్‌పై అధికారుల సమీక్ష

న్యూఢిల్లీ : ఏప్రిల్‌లో ఉత్తరాఖండ్‌లో ప్రారంభమయ్యే చార్‌ధామ్ యాత్ర సందర్భంగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, ఇంటర్నెట్‌ను ఉపయోగించలేని యాత్రికులు ఎటు వంటి సమస్యను ఎదుర్కో కుండా ఉండటానికి ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా చేయబడుతుంది. 2లో

## తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

### రూ. 176.5 కోట్ల విడుదలకు ఆమోదం



2

హైదరాబాద్ : జాతీయ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ "రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక పెట్టుబడి పథకం "కింద తెలంగాణకు రూ. 176.5 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద నిర్దేశించిన మైలురాయిని సాధించినందుకు రాష్ట్రాలు ప్రోత్సాహక మొత్తాన్ని పొందేందుకు అర్హులు. తెలంగాణ రాష్ట్రానికి జాతీయ రోడ్డు రవాణా శాఖ అదనపు ప్రోత్సాహక సహాయం అందించింది.



2

## 12 నుంచి మినీ మేడారం జాతర

### 4 రోజులపాటు జాతర సంబురాలు
### పటిష్ట ఏర్పాటు చేసిన అధికారులు

హైదరాబాద్ : ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ మినీ జాతరకు సమయం ఆసన్నమైంది. మహాజాతర ముగిసిన ఏడాదికి అదే మాదిరిగా మినీ మేడారం జాతర జరుగుతున్న సంగతి తెలిసిందే.



## స్థానికఎన్నికల్లోవిజయమేలక్ష్యంగా
# దూసుకెళ్లాలి

### బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణలపై ప్రజలకు వివరించాలి
### విపక్షాల విమర్శలను ధీటుగా తిప్పికొట్టాల్సిందే
### స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలపై దృష్టిసారించండి
### సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పుకోండి
### సిఎల్పి భేటీలో ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్త, పాత నేతలు సమన్వయంతో సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల్లో కొత్త పాత నేతలు సమన్వయంతో సాగితేనే స్థానిక సంస్థల్లో పాగా వేయగలమని సూచించారు. కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా బీసీ కులగణన చేపట్టామని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతా చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఉత్తర తెలంగాణలో భారీ బహిరంగ సభకు ప్లాన్ చేద్దామని సూచించారు.



హైదరాబాద్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రాభవాన్ని నిలబెట్టు కోవాలని, ప్రతీ స్థాయిలో విజయాన్ని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేలకు స్పష్టమైన దిశా నిర్దేశం ఇచ్చారు. అలాగే సమస్యలపై ఎమ్మెల్యేలు నేరుగా తనను కలుసుకోవచ్చని అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎంసీ హెచ్‌ఆర్డీలో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని 2లో

## అంబేడ్కర్‌ను ఏనాడూ గౌరవించని కాంగ్రెస్

### ఓట్ల కోసం జైభీమ్ నినాదాలు చేస్తోంది
### అంబేద్కర్‌ను ఓడించేందుకు అనేక కుట్రలుచేసింది
### రాజ్యసభలో మరోమారు కాంగ్రెస్‌ను దునుమాడిన మోదీ



న్యూఢిల్లీ : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కాంగ్రెస్‌కు ఏనాడూ గౌరవం లేదని ప్రధాని మోడీ అన్నారు. ఓట్ల రాజకీయంకోసం ఇప్పుడు ఆయన పేరును వాడుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని మారోసారి టార్గెట్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పినదంతా.. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించేదని అన్నారు.. బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని ఆరోపించారు, సామాజిక సంస్కర్త పట్ల ఆ పార్టీ దారుణంగా ప్రవర్తించిందన్నారు.. అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించలేదు.. అంబేద్కర్‌ను ఓడించేందుకు కుట్రలు చేసిందని విమర్శించారు.. కానీ, ఇప్పుడు ఓట్ల కోసం జై భీమ్ నినాదాలు చేస్తోంది.. కాంగ్రెస్ రంగులు మార్చే పార్టీ అని దుయ్యబట్టారు.. ఎస్సీ, ఎస్టీల ఆర్థిక వెనుకబాటు తనాన్ని అంబేద్కర్ తొలగించాలని అన్నారు.. కానీ, కాంగ్రెస్ ఆ పని చేయలేకపోయిందన్నారు.. కాంగ్రెస్ బీఆర్ అంబేద్కర్‌తో దారుణంగా వ్యవహరించింది వారు ఆయనను వ్యతిరేకించారు.. 2లో

## యూజిసి నిబంధనలు
# దేశ సంస్కృతిపై దాడి

### ఆర్ఎస్ఎస్ భావజాల జొప్పించే ప్రయత్నం
### డిఎంకె ఆందోళనలో రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ : యూజీసీ ముసాయిదా విద్యాపరమైన చర్య మాత్రమే కాదని, ఇది మన చరిత్ర, సంప్రదాయం, సంస్కృతి, భాషలపై దాడి చేసేందుకు ఆరెస్సెస్ చేస్తున్న ప్రయత్నం అని కాంగ్రెస్ ఎంపి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఇదే విషయాన్ని తాను కొంతకాలంగా చెబుతున్నానని అన్నారు. ఈ దేశంలో ఒకే చరిత్ర, ఒకే సంప్రదాయం, ఒకే భాష విధించాలనే ఆలోచనతోనే వారు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని అన్నారు. వివిధ రాష్ట్రాల విద్యా వ్యవస్థపై వారు చేస్తున్న ఈ ప్రయత్నం తమ ఎంజెడాను ముందుకుతీసుకెళ్లేందుకే అని రాహుల్ విమర్శించారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రవేశపెట్టిన నూతన ముసాయిదా నిబంధనలు భాజపాయేతర రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ముసాయిదాకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం గురువారం దిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనలకు దిగింది.

మిగతా 2లో

## డ్రాఫ్ట్ యుజిసి రెగ్యులేషన్స్ 2025ను వ్యతిరేకిస్తూ ఆరు రాష్ట్రాల తీర్మానం

### - బెంగళూరు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

న్యూఢిల్లీ : విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారాలకు గండికొడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డ్రాఫ్ట్ యుజిసి రెగ్యులేషన్స్-2025 ను నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నట్టు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. బుధవారం నాడు బెంగళూరులో జరిగిన ఆరు (బిజెపీయేతర) రాష్ట్రాల విద్యామంత్రుల సమావేశానికి రాష్ట్ర విద్యాశాఖను

2



## విసిల నియామకంలో
# యూజిసి పెత్తనం సరికాదు

### విద్యార్థుల ప్రయోజనాలకు ఇది విఘాతం
### కేంద్రమంత్రికి కెటిఆర్ వినతి పత్రం అందచేత
### ఎన్‌హెచ్ 365 పొడిగించాలని గడ్కరీకి కెటిఆర్ వినతి



న్యూఢిల్లీ : యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియాతో మాట్లాడారు. తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొంది ంచారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసు కొచ్చారని పేర్కొన్నారు. 'నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాల నుకుంటు న్నారు. యూజీసీ నిబం ధనల అభ్యంత రాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. 2లో

## కులగణనపై విపక్షాల
# విమర్శలు తిప్పికొట్టాలి


### పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నాం
### పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం
### ఈ నెలలోనే రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం
### పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి



హైదరాబాద్ : కులగణనపై విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని వాటిని తిప్పి కొట్టాలని కాంగ్రెస్ నిర్ణయించిందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలకు సూచించామని అన్నారు. పీసీసీ కార్యవర్గం రూపకల్పనపై సలహాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీ నిర్మాణం, పథకాల అమలుపై పరిపూర్ణంగా చర్చించాం. రాష్ట్ర ఆదాయం, అప్పులు, వ్యయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాం. మిగతా 2లో

## వలసదారులను తిప్పి పంపడం కొత్తేమీకాదు

### ఏళ్లుగా అక్రమ వసలదారులను పంపిచేస్తున్నఅ మెరికా
### ఇది మన దేశానికే కాదు..అన్ని దేశాలకు వర్తిస్తుంది
### రాజ్యసభలో విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటన
### వలసదారులకు బేడీలు వేశారని విపక్ష ఎంపిల ఆందోళన



2

# ఏప్రిల్ 30న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

చార్‌ధామ్ యాత్ర మార్గాల్లోని అన్ని పనులు ఏప్రిల్ 15 నాటికి పూర్తయ్యేలా చూడాలని పాండే ప్రజా పనుల శాఖను ఆదేశించారు. ఈసారి యాత్ర మార్గంలో ప్రతి పది కిలోమీటర్లకు చీతా పోలీస్ లేదా హిల్ పెట్రోలింగ్ యూనిట్ బృందాన్ని మోహరించాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గర్వాల్ డివిజన్ రాజీవ్ స్వరూప్ కూడా సమావేశానికి హాజరయ్యారు. చార్‌ధామ్ యాత్ర కోసం దాదాపు రెండు వేల బస్సులను సిద్ధం చేశారు. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు యాత్ర ట్రస్ట్ గొప్ప శుభవార్త ప్రకటించింది. చార్‌ధామ్ యాత్రకు సంబంధించి యాత్ర ట్రాన్సిట్ క్యాంప్ ప్రాంగణంలో గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే అధ్యక్షతన జరిగిన సమావేశంలో యాత్ర పరిపాలన గత తప్పుల నుండి నేర్చుకుని, ఈసారి ప్రయాణీకుల నమోదు విధానాన్ని మార్చాలని నిర్ణయించిందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే భక్తులు ఈ ఇబ్బంది నుండి ఉపశమనం పొందేలా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు 40 శాతం ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఇబ్బంది పడకుండా ఉండటానికి 40 శాతం రిజిస్ట్రేషన్లు ఆఫ్‌లైన్‌లో జరుగుతాయని పాండే చెప్పారు. గతసారి, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ ఎంపిక అందుబాటులో లేకపోవడం వల్ల యాత్రికులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులు చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. హిమాలయ దేవాలయాలకు సాంప్రదాయ ప్రయాణ క్రమాన్ని రిజిస్ట్రేషన్ తర్వాత యాత్రికులకు ఇచ్చిన స్లాట్‌లలో జాగ్రత్తగా చూసుకోవాలని కూడా సమావేశంలో నిర్ణయించారు.

# విసిల నియామకంలో యూజిసి పెత్తనం సరికాదు

మరోవైపు ఎన్‌హెచ్-365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామని కేటీఆర్ తెలిపారు. కెటిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నేతల బృందం ఢిల్లీలో కేంద్రమంత్రులను కలిసింది. యూజీసీ ముసాయిదా నిబంధనలపై కేంద్రానికి బీఆర్ఎస్ నేతలు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆ తర్వాత 365బీ జాతీయ రహదారిని సూర్యాపేట-సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు విస్తరించాలంటూ నితిన్ గడ్కరీని కోరింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. యూజీసీ నిబంధనల పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. మా అభిప్రాయాలు తెలియజేసేందుకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల బాధ్యతను రాష్ట్ర గవర్నర్ల ద్వారా కేంద్రం నియంత్రించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సెర్చ్ కమిటీల బాధ్యతలను గవర్నర్‌కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తూ.. కొత్త నిబంధనలు రూపొందించారని.. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం తమ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకుంటుందని ఆరోపించారు. నూతన నిబంధనలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. యూజీసీ నిబంధనలపై అభ్యంతరాలను ఆరు పేజీలతో నివేదిక కేంద్రమంత్రికి ఇచ్చినట్లు వివరించారు. నిబంధనలను సవరించాలని మంత్రిని కోరామన్నారు. ఇలా సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని చెప్పామన్నారు. అలాగే, జాతీయ రహదారి 365బీని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరామన్నారు. ఇక పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు పడాల్సిందేనన్నారు. అనర్హత వేటు పిటిషన్లపై న్యాయవాదులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

# వలసదారులను తిప్పి పంపడం కొత్తేమీకాదు

న్యూఢిల్లీ : అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్నిదేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో 2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత' అని జైశంకర్ వివరించారు. తాజాగా అమెరికా 104 మంది భారతీయులను స్వదేశానికి పంపించడంపై ఈ మేరకు కేంద్రమంత్రి రాజ్యసభలో ప్రకటన చేశారు. వలసదారులకు సంకెళ్లు వేసి పంపిస్తున్నారని విపక్షాలు చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. డీపోర్టేషన్ సమయంలో వలసదారుల పట్ల దురుసుగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. అమెరికా నుంచి అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించే ప్రక్రియను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. వలసదారులను ఎయిర్‌క్రాఫ్ట్‌లో తరలించే విధానాన్ని 2012 నుంచి అమలు చేస్తుండగా.. నిబంధనల ప్రకారం వారిని నిర్బంధిస్తారు. టాయిలెట్‌కు వెళ్లే సమయంలో అవసరమైతే వాటిని తొలగిస్తారు. సైనిక ఎయిర్‌క్రాఫ్ట్, చార్టర్డ్ విమానాలకూ ఇది వర్తిస్తుంది. ఇందులో ఎటువంటి మార్పు లేదు. అయితే, మహిళలు, చిన్నారులను నిర్బంధించలేదని ఐసీఈ అధికారులు మాకు సమాచారం ఇచ్చారని ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో వారికి అవసరమైన ఆహారం, అత్యవసర వైద్య సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు. భారతీయులను అమెరికా వెనక్కి పంపించిన విధానాన్ని లేవనెత్తిన విపక్షాలు పార్లమెంటులో నిరసనలు చేపట్టాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేశాయి. అమెరికా ప్రభుత్వ యంత్రాంగంతో తీసుకుంటున్న దౌత్యచర్యల గురించి వివరించాలని కోరాయి. దీనిపై లోక్‌సభ స్పీకర్ స్పందిస్తూ.. ఈ అంశం విదేశాంగ మంత్రిత్వశాఖకు సంబంధించినదని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించిందన్నారు. ఇలా ఉభయసభలకు అంతరాయం కలుగుతోన్న క్రమంలోనే రాజ్యసభలో కేంద్ర మంత్రి దీనిపై ప్రకటన చేశారు. దీనికి ముందు జైశంకర్ ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మరోవైపు, వలసదారుల భద్రత కోసం కేంద్రం కొత్త చట్టం తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులు బుధవారం అమృత్‌సర్‌లో దిగారు. వారిని అమానవీయ పరిస్థితుల్లో తరలించారంటూ విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధానితో విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇక ప్రతిపక్ష ఎంపీల నిరసనలతో ఉభయ సభల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దిగువసభ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా పడింది. ఈ అంశంపై మంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేయనున్నారు. అలాగే విదేశాల్లో ఉన్న భారత విద్యార్థుల సంక్షేమాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రస్తుతం వలసదారులు వెనక్కి రావడంతో కేంద్రం వారి భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకువచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. విదేశాల్లో ఉపాధి కోసం సురక్షితమైన, క్రమబద్ధమైన వలసలను ప్రోత్సహించేలా ఈ కొత్త చట్టంలో విధివిధానాలు ఉండనున్నట్లు సమాచారం. 'గతంలోనూ భారత వలసదారులను స్వదేశానికి తరలించారు. కానీ ఈవిధంగా మాత్రం జరగలేదని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ అన్నారు. మన పౌరుల చేతికి బేడీలు వేయడం అవమానకరం' అని థరూర్ విమర్శలు చేశారు. భారత వలసదారులచేతులకు సంకెళ్లు.. కాళ్లకు గొలుసులు వేసి స్వదేశానికి పంపించినట్లు కొన్ని దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో ఇదికాస్తా రాజకీయ వివాదానికి దారితీసింది. ఈనేపథ్యంలో కేంద్రం దీనిపై స్పందించింది. ఆ ఫొటోల్లో ఉన్నది భారతీయులు కారని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ డిపార్ట్‌మెంట్ ఆ ఫొటోలపై నిజ నిర్ధరణ ప్రక్రియ చేపట్టింది. అందులో అవి 'ఫేక్' అని తేలినట్లు పీఐబీ వెల్లడించింది.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకెళ్లాలి

ఇందుకోసం ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో కాంగ్రెస్ బలాన్ని పెంపొంది ంచేందుకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఏకగ్రీవ విజయం సాధించే బాధ్యత ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు నిదర్శనంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, వివిధ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, నిధుల కేటాయింపు కోసం తక్షణమే సంబంధిత మంత్రులను కలవాలని సూచించారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ఇది పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండేలా, బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. బీసీ నాయకత్వాన్ని ముందుకు తేవడానికి, వారికి అధికారంలో మద్దతుగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల విజయమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో మరింత దృఢంగా నిలిచేలా చేస్తుందని, అందుకే ప్రతి నియోజకవర్గం స్థాయిలో సమర్థవంతమైన ఎన్నికల ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ ప్రభుత్వ పథకాలను గట్టిగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యేలకు సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ విజయానికి శ్రమించాలని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటిం చారు. బీసీ కులగణను శాస్త్రీయంగా చేపట్టామని, దీనిపై ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని, ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాల స్థాయిలోనే కౌంటర్ అటాక్ చేయాలని సూచించారు. అదే విధంగా ఎస్సీ వర్గకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, చెప్పామని, దానిని అమలు చేసి చూపామని అన్నారు. ఎస్సీ వర్గీకరణను వివరించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఈ మేరకు సమావేశంలో నిర్ణయించారని సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరి ంచాల్సిన వ్యూహంపైనా చర్చ జరిగింది. ఎమ్మెల్యేలు ఏమైనా సమస్యలుంటే తన వద్దకు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చని సీఎం చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను, గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై ప్రతిపక్షాలు లేని పోని అపోహలు సృష్టిస్తున్నా యని, అదే స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కౌంటర్ ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. ఇదలావుంటే ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సీఎల్పీ సమావేశానికి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నారు. దానం నాగేం దర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, సంజయ కుమార్, కృష్ణమోహన్ రెడ్డి, అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరు కాలేదు. అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేయడం, కేసు సుప్రీంకోర్టులో ఉండటం.. టెక్నికల్ గా ఏ సమస్యా రాకుండా ముందు జాగ్రత్త చర్యలగా వీరు గైర్హాజరైనట్టు సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దాదాపు ఐదున్నర గంటల పాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

తెలంగాణ ఈ పథకం ద్వారా మైల్ స్టోన్ 1లో రూ.51.5 కోట్లు , మైల్ స్టోన్ 2లో రూ.125 కోట్లకు అర్హత పొందింది. అంతే కాకుండా.. మోటార్ వెహికల్ ట్యాక్స్ కన్సెషన్ పథకం కింద తెలంగాణ రూ.50 కోట్లు అర్హత సాధించింది. మైల్ స్టోన్ -2 కింద రాష్ట్ర ప్రభుత్వం 15 సంవత్సరాలు పైబడిన రవాణా వాహనాలను తొలగించేందుకు స్క్రాపింగ్ ప్రణాళికను పంపించింది. ఈ స్క్రాపింగ్ పథకంతో మరో రూ.75 కోట్లు అర్హత సాధించింది. రాష్ట్రంలోని మొత్తం జిల్లాలలో 21 జిల్లాలు ప్రాధాన్యతగా తీసుకుని పని చేయడం ద్వారా తెలంగాణ రూ.31.5 కోట్లు అర్హత పొందింది. ప్రాధాన్యత లేని జిల్లాలకు రూ.20 కోట్లు పొందేందుకు అర్హత పొందింది. ఈ మైలురాయి కింద మొత్తం అర్హత కలిగిన ప్రోత్సాహకం రూ.51.5 కోట్లు. ఈ ఆర్థిక సాయం రాష్ట్రంలో రవాణా రంగం అభివృద్ధికి ఉపయోగపడనుంది. ఇంతలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రానికి అనుసంధానించే లింక్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానితో అనుసంధానించే రోడ్లు, ప్రస్తుత రహదారి మౌలిక సదుపాయాల అప్ గ్రేడ్ అనే మూడు విభాగాలుగా వర్గీకరించబడిన పనులను చేపట్టడంలో నియమాలను పాటించాలని మంత్రి అధికారులను కోరారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లను గుర్తించాలని ఆదేశించారు. అధ్వాన్నంగా ఉన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టిన రోడ్ల పురోగతిని సమీక్షించడానికి సీనియర్ ఆర్ అండ్ బీ అధికారులతో సమావేశమైన మంత్రి.. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# అంబేడ్కర్‌ను ఏనాడూ గౌరవించని కాంగ్రెస్

బాబాసాహెబ్ చెప్పినదంతా కాంగ్రెస్‌ను వ్యతిరేకించేది అని ప్రధాని మోడీ అన్నారు. ప్రతిదానికీ డాక్యుమెంట్స్ ఎవిడెన్స్ ఉన్నాయి.. వాటిని ధృవీకరించవచ్చన్న ఆయన.. ఎన్నికల్లో బాబాసాహెబ్ ఓడిపోయేలా కాంగ్రెస్ ఎటువంటి రాయిని వదిలిపెట్టలేదన్నారు.. ఎందుకంటే వారు ఆయనను సహించలేక పోయారు. భారతరత్నకు ఆయన అర్హుడని భావించలేదు అంటూ ఫైర్ అయ్యారు.. సబ్ కా సాత్ కాంగ్రెస్‌కు సాధ్యం కాదు అని స్పష్టం చేశారు.. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనేది కాంగ్రెస్ పార్టీకి అర్థం కాని విషయం అని పేర్కొన్నారు.. కాంగ్రెస్ విషయానికొస్తే? వారు సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ ఆశించడం పెద్ద తప్పు? అది వారి ఆలోచనలకు అతీతమైనది.. వారి రోడ్ మ్యాప్ కు కూడా సరిపోదు.. ఎందుకంటే అది ఒక పెద్ద పార్టీ.. ఒక రాజవంశానికి అంకితం చేయబడింది కాబట్టి.. వారికి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సాధ్యం కాదు అని విమర్శించారు..మేం స్కిల్ డెవలప్‌మెంట్‌తో వెనుకబడి వర్గాల జీవితాలను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నాం.. విశ్వకర్మ యోజనతో చేతివృత్తులవారి అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం అన్నారు మోడీ.. కాంగ్రెస్ పాలనలో నిర్లక్ష్యం చేసిన పేదలను మేం గౌరవిస్తున్నాం.. పేదల అభివృద్ధే మా ప్రథమ ప్రాధాన్యం అని స్పష్టం చేశారు.. కేవలం అర్హులకే లబ్ధి చేకూరేలా పథకాలను రూపొందించి అమలు చేస్తున్నాం.. పదేళ్లలో సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ మార్పును గమనిస్తున్నాం.. ఎస్సీ, ఎస్టీలను బలోపేతం చేస్తున్నాం.. ఓబీసీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇవ్వలేదు.. మేం వచ్చాక ఓబీసీల డిమాండ్‌ను నెరవేర్చాం.. దేశంలో దివ్యాంగుల గురించి మిషన్ మోడ్‌లో పనిచేస్తున్నాం.. దివ్యాంగుల కోసం ఎన్నో రకాల పథకాలు చేపట్టాం.. ట్రాన్స్‌జండర్స్ గౌరవంతో బతికేలా చర్యలు తీసుకున్నాం అని ప్రధాని మోడీ వెల్లడించారు..

# కులగణనపై విపక్షాల విమర్శలు తిప్పికొట్టాలి

ఫిబ్రవరిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం. బహిరంగ సభలకు అధిష్ఠానం నేతలను ఆహ్వానించేందుకే ఢిల్లీ వెళు తున్నాం. ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశాలు నిర్వహించుకోవటం తప్పేమీ కాదని కూడా అన్నారు. సీఎల్పీ సమావేశం ముగిసిన అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చించామని తెలిపారు. 'స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించాం. సమావేశంలో ఎమ్మెల్యేలు కూడా వారి అభిప్రాయాలు చెప్పారు. పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. సుమారు మూడు గంటలకు పైగా సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించామని అన్నారు. ఈ క్రమంలో సమావేశంలో చర్చించిన అంశాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. .స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా కులగణన చేపట్టామని... రాహుల్ గాంధీ ఆశయం మేరకు పరిపూర్ణంగా సర్వే చేసి ఎవరు ఎంత సంఖ్యలో ఉన్నారో తేల్చామని అన్నారు. వాస్తవాలు తెలియక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ బీసీ సంఘాలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. చాలా అంశాలపై సీఎల్పీ సమావేశం జరిగిందని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సూర్యాపేటలో కులగణన జరిగిన తీరుపై బహిరంగ సభ నిర్వహించ నున్నామని.. ఈ సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను ఆహ్వానించటానికి ఢిల్లీ వెళ్తున్నామని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఎమ్మెల్యేలకు ఉన్న అనుమానాలు నివృత్తి చేశామని అన్నారు. బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకే కేటిఆర్ ఢిల్లీ వెళ్లారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో ఆకర్శితులవుతున్నారు

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. బిసి కులగణనపై బిఆర్ఎస్ విమర్శలను అధికార పార్టీ నేతలు తిప్పికొడుతున్నారు. ఈ క్రమంలోనే మంత్రి సీతక్క తాజాగా బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేయడం అనవసరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులై, పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఆమె పేర్కొన్నారు. గాంధీ భవన్లో జరిగిన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 'సంక్షేమ కార్యక్రమాలు, కులగణన, ఎూఅ వర్గీకరణ వంటి అంశాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయన్నారు. ఈ కారణంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఆమె తెలిపారు. దీంతోపాటు ఉచిత బస్ సేవ, రేషన్ కార్డు, కులగణన, ఎూఅ వర్గీకరణ సహా అనేక కార్యక్రమాలు చేపట్టినందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రతి దానికి ఉల్టా ప్రచారం చేస్తోందని సీతక్క విమర్శించారు. అసలు దేశంలో ఏ రాష్ట్రం కులగణన చేయలేదన్నారు. కానీ మన రాష్ట్రంలో కులగణన చేసి, దాని ఫలితాలను ప్రజలకు చూపించాం. బీఆర్ఎస్ చేయని పనులు మేము చేసినందున, వారు మాపై విమర్శలు చేయడం అనవసరమని వ్యాఖ్యానించారు. ఇంటి ఇంటికి తిరిగి సిబ్బంది పకడ్బందీగా సర్వే చేశారు. ఈ సర్వేలో కొన్ని అంశాలు తక్కువగా ఉన్నాయని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ కామెంట్స్ చేస్తున్నాయి. కానీ బీఆర్ఎస్ పార్టీ గతంలో సర్వే చేసి వివరాలు పూర్తిగా బయట పెట్టలేదని మంత్రి అన్నారు. ప్రజల సంక్షేమం కోసం మేము చేస్తున్న పనులు, కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సీతక్క తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం మేము చేస్తున్న కార్యక్రమాలు, బీఆర్ఎస్ పార్టీకి ఇబ్బందిగా మారుతున్నాయని, అందుకే ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని సీతక్క అన్నారు.

# 12 నుంచి మినీ మేడారం జాతర

ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు 4 రోజుల పాటు మినీ మేడార జాతర జరగనుంది. బుధవారం మినీ మేడారం జాతరకు అంకురార్పణ జరిగింది. అంటే జాతర ప్రారంభానికి సరిగ్గా వారం రోజుల ముందు గుడి మెలిగె, మండ మెలిగె పండుగను నిర్వహిస్తుంటారు. ఈ నెల 12న జాతర ప్రారంభం కానుండటంతో పూజారులు బుధవారం గుడి మెలిగె పండుగకు శ్రీకారం చుట్టారు. బుధవారం మేడారంలో గల సమక్క ఆలయంలో సిద్ధబోయిన వంశస్థులు, కన్నెపల్లలోని సారలమ్మ ఆలయంలో కాక వంశీయులు గుడి మెలిగె పండుగను నిర్వహించారు. ఈ గుడి మెలిగె పండుగలో భాగంగా పూజారులు గుడిని శుద్ధి చేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి డోలు వాయిద్యాలతో అటవీప్రాంతంలోకి వెళ్లి గుట్టగడ్డిని తీసుకువచ్చారు. గడ్డికి పసుపు, కుంకుమలతో పూజలు చేసిన అనంతరం పూజామందిరాన్ని అలంకరించారు. ఈ మండమెలిగె, గుడి మెలిగె పండుగతో మినీ మేడారం జాతర ప్రారంభమైనట్లేనని పూజారులు వెల్లడించారు. ఇప్పటి నుంచి మినీ జాతర ముగిసే వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పూజలతో పాటు రాత్రివేళల్లో డోలీలతో కొలుపును నిర్వహిస్తారు. అదే విధంగా కొండాయిలో గోవిందరాజులు, నాగులమ్మ జాతరను పురస్కరించుకుని మండమెలిగె పండుగను నిర్వహించారు. అలాగే పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారంలోని మినీ మేడారం జాతరకు రూ.32 కోట్లతో ఏర్పాట్లు చేస్తోంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ జాతరకు దాదాపు 20 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులను కూడా మోహరించనున్నారు.

# యూజిసి నిబంధనలు దేశ సంస్కృతిపై దాడి

ఈ నిరసనలో డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధితో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. యూజీసీ ప్రవేశపెట్టిన ముసాయిదాను తాము వ్యతిరేకిస్తున్నట్లు అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఈ నూతన విధానం యూనివర్శిటీలను పారిశ్రామికవేత్తలకు అప్పగించే కుట్రగా ఆయన పేర్కొన్నారు. ఈ విధానానికి తాము ఎప్పటికీ మద్దతు ఇవ్వబోమన్నారు. వర్శిటీలు, కళాశాలల్లో అధ్యాపకులు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025 పేరిట యూజీసీ ఇటీవల ఓ ముసాయిదాను విడుదల చేసింది. అందులోని పలు అంశాలు బాగా వివాదాస్పదమవుతున్నాయి. ఇప్పటివరకు విశ్వవిద్యాలయాల అధిపతులైన ఉపకులపతుల నియామకం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో ఉంది. నూతన ముసాయిదా ప్రకారం ఆ అధికారం ఛాన్సలర్లుగా ఉన్న గవర్నర్ల చేతుల్లోకి వెళ్తుంది. ఈ మార్పును భాజపాయేతర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. తమిళనాడు, కేరళ వంటివి ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ చట్టసభల్లో తీర్మానం కూడా చేశాయి.

## హాస్టళ్లలో రాత్రి బసతో వెన్నుతట్టిన కలెక్టర్

యాదాద్రి భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వసతి గృహాల్లో బస, విద్యార్థుల ఇంటి తలుపు తట్టే కార్యక్రమాలను చేపట్టారు. సంస్థాన్ నారాయణపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో రాత్రి బస చేసిన కలెక్టర్.. తెల్లవారుజామున 5 గంటలకే కంకణాలగూడెం వెళ్లి పదో తరగతి విద్యార్థి ఇంటి తలుపు తట్టారు. జిల్లాలోని 86 గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆదేశంతో ఇదే రోజున ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అ గ్రేడ్‌లో ఉన్న 800 మంది విద్యార్థుల ఇంటి తలుపు తట్టి వారిలో ప్రేరణ కలిగించే కార్యక్రమం చేపట్టారు

# డ్రాఫ్ట్ యుజిసి రెగ్యులేషన్స్ 2025ను వ్యతిరేకిస్తూ ఆరు రాష్ట్రాల తీర్మానం

నిర్వహిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి బదులుగా ఆయన హాజరయ్యారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణా, జార?ండ్, హిమాచల్ ప్రదేశ్ ల విద్యామంత్రులు, ప్రతినిధులు పాల్గొన్న ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను ఆయన వెల్లడించారు. "ఇప్పటిదాకా విశ్వవిద్యాయాల ఉపకులపతుల నియామకాన్ని చీఫ్ సెక్రటరీ సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ చేపట్టేది. అసలు రాష్ట్రానికి సంబంధమే లేకుండా విసిల నియామకం చేపట్టేలా డ్రాఫ్ట్ రూపొందించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఉన్నత విద్యకు తెలంగాణా ఏటా రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. అవసరమైన చోట కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తోంది. ఉన్నత విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు అండగా నిలుస్తోంది" దీన్ని ప్రోత్సహించాల్సిందిపోయి ఆటంకాలు కల్పించడమేమిటని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు. ఉప కులపతులుగా పరిశ్రమల అధిపతులను, బ్యూరోక్రాట్లను, బయటి వ్యక్తులను నియమించే అవకాశాన్ని కల్పించాలన్న డ్రాఫ్ట్ రెగ్యులేషన్ లోని ప్రతిపాదన పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేసారు. ఉన్నత విద్యా సంస్థల్లో మూడు వేల మంది విద్యార్థులుంటేనే గ్రేడింగులు ఇస్తామని, ఉన్నత గ్రేడ్లు వస్తేనే కేంద్ర ప్రోత్సాహకాలు అందుతాయన్న ప్రతిపాదనను కూడా శ్రీధర్ బాబు వ్యతిరేకించారు. ఇది ప్రైవేటు యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలకు మేలు కలిగించే చర్య అని ఆరోపించారు. బిఏ, బికాం, బిఎస్సీ, బిబిసి లాంటి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలనడం పేదలను ఉన్నత విద్యకు దూరం చేసే ఆలోచనగా ఆయన అభివర్ణించారు. దేశ సరాసరి 'గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో' కేవలం 28 శాతం మాత్రమే ఉంది. అంటే ఉన్నత విద్య చదవాల్సిన వయసులో ఉన్న యువతలో నూటికి 28 మంది మాత్రమే కళాశాలల్లో చేరుతున్నారు. ఈ రేషియోను పెంచాలంటే ఎంట్రన్సులలాంటి ఆలోచనలు ఆటంకాలు సృష్టిస్తాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇప్పటిదాకా వైస్ ఛాన్సలర్ల పదవీకాలం 3 సంవత్సరాలు ఉండగా యుజిసి రెగ్యులేషన్స్ లో 5 ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. "జాతీయ విద్యా విధానం (%బీజూ%)-2020 ను రాష్ట్రాలు అమలు చేయాలని పేర్కొనడం చాలా సమస్యలను తీసుకొస్తుంది. డిగ్రీ కోర్సులకు ఏడాదిలో రెండు సార్లు అడ్మిషన్లు నిర్వహించాలంటే సిబ్బంది కొరత, మౌలిక సమస్యలు ఉంటాయి. ఒకే విద్యార్థి ఏక కాలంలో రెండు కోర్సులు చదవొచ్చన్న ప్రతిపాదన అమలు విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుని మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు కేంద్రం ప్రోత్సాహకాలు అందజేయాలి. గ్రేడింగులకు అర్హత పొందకున్నా, జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయకున్నా యుజిసి నిధులను విడుదల చేయమని పేర్కొనడం బెదిరింపు చర్యగా భావించాల్సివస్తోందని, ఆన్లైన్, కరెస్పాండెన్స్ కోర్సులకు అనుమతులివ్వమని చెప్పడం విద్యార్థులకు నష్టం కలిగిస్తుందని" అని శ్రీధర్ బాబు తెలిపారు. డ్రాఫ్ట్ యూజిసి రెగ్యులేషన్లు రాష్ట్రానికి అమోదయోగ్యంగా లేవని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు ఇప్పటికే అధికారికంగా లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. విద్యకు సంబంధించిన ఏ ప్రతిపాదనలైనా రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే రెగ్యులేషన్లు రూపొందించాలని శ్రీధర్ బాబు డిమాండ్ చేసారు. యుజిసి రెగ్యులేషన్స్ -2025 లోని 15 అంశాలను వ్యతిరేకిస్తూ, అమలును నిలిపివేయాలని రాష్ట్రాల విద్యామంత్రులు, ప్రతినిధుల సమావేశం ధర్మేంద్ర ప్రధాన్ ను కోరుతూ తీర్మానం చేసింది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలక్రిష్ణారెడ్డిలు హాజరయ్యారు.

## కెపిహెచ్బిలో ప్రభుత్వ 100 పడకల

# ఆసుపత్రిని వెంటనే నిర్మించాలి

### • జనసేన పార్టీ నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్




**కూకట్ పల్లి ఫిబ్రవరి 06 (ది క్రైమ్ న్యూస్):** కెపిహెచ్బి కాలనీ 5వ పేస్‌లో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన 1.72 ఎకరాల స్థలంలో వెంటనే వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలని కూకట్ పల్లి జనసేన పార్టీ నేత, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ జన శ్రేణులతో కలిసి ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించిన స్థలం వద్దకు ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన తెలియజేస్తూ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి నివసిస్తూ సుమారు 4, 5 లక్షల జనాభాకు రోగాలు వస్తే ఆదుకోవడానికి ఆసియాలోనే పెద్ద కాలనీ అని గొప్పగా చెప్పుకునే కెపిహెచ్బి కాలనీలో ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం చాలా బాధాకరమైన విషయమని, పేద, మధ్యతరగతుల ప్రజలకు రోగాలు వస్తే ప్రభుత్వ ఆసుపత్రి లేనందున ప్రవేట్ ఆసుపత్రి చికిత్స కై వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, కూకట్ పల్లి నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు, వాచ్ మెన్ లు, చిరు వ్యాపారస్తులు, చిన్న చిన్న ప్రైవేటు సంస్థలలో పనిచేసుకునేవారు, రిక్షా కార్మికులు, జిహెచ్ఎంసి కార్మికులు, ఇండ్లలో పని చేసుకునేవారు ఉన్నారని వారిని ఆరోగ్యపరంగా ఆదుకోవడం ప్రభుత్వం యొక్క బాధ్యతని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం 2023 లో శిలాఫలకంతో శంకుస్థాపన చేసి 9 నెలలలో ఆసుపత్రిని నిర్మిస్తామని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి హరీష్ రావు ప్రజలను మభ్యపరిచారన్నారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని, ఆసుపత్రి స్థలం కబ్జాకి గురి అవుతుందని అన్నారు. పేదలకు కేటాయించిన ఆసుపత్రి స్థలాన్ని కబ్జా చేసినా, ప్రభుత్వం అమ్ముకుంటామన్నా జనసేన పార్టీ ఊరుకోదని, ప్రజల తరఫున తాము పోరాడుతామని, అవసరం అయితే నిరాహార దీక్ష చేస్తామని, ఈ సమస్యను తాను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దృష్టికి




తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్లు డివిజన్, ప్రెసిడెంట్లు జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో కులగణన చేసిన తీరు సరిగ్గా లెదు

### • బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గినట్లు చూపారు - ఓసిల జనాభా పెరుగుదల ఎలా సాధ్యపడింది?

### • రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి? - బి ఆర్ ఎస్ నాయకురాలు దాసరి ఉష

**పెద్దపల్లి బ్యూరో, ఫిబ్రవరి 6, ( ది క్రైమ్ న్యూస్):** మన దేశంలో జనాభా లెక్కలను ప్రతి పది సంవత్సరాలకి ఒకసారి చేస్తారని జనాభా ప్రాతిపదికన లెక్కించిన ప్రతీ సారి జనాభా శాతం పెరుగుతుంటుంది, కాని మన తెలంగాణలో కులగణన చేసినప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గి కేవలం ఓసి ల జనాభా మాత్రం పెరిగే విధంగా కులగణన చేయడం జరిగిందని బి ఆర్ ఎస్ నాయకురాలు దాసరి ఉష గారు అన్నారు. ఈ విధమైన కులగణన సరియైనదా కాదా అనే అనుమాలున్నాయని తెలిపారు. ఇది సరియైనది కానప్పుడు ఎటువంటి చర్యలు తీసుకుంటారనేది ఈ ప్రభుత్వం జవాబు చెప్పవలసిన అవసరం ఉందని తెలిపారు. అదేవిధంగా బీసీలు ఎందరున్నా ఎలక్షన్ మానిఫెస్టో లో కేవలం 42% మాత్రమే రిజర్వేషన్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అన్నారని మరీ 56.3% జనాభా కి 42% ఇవ్వడం సరికాదని, మేం ఎంతో మాకంత రావాలిసిందేనని మండిపడ్డారు. అదేవిధంగా ఓబీసీ లకి విద్య, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో మా జనాభా అనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. మరీ దాని గురుంచి మాట్లాడిందే లేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో చేసిన డేటాను చెప్పడమే నా? కార్యాచరణ చేయడానికి తావు ఉందా లేదా? అని ప్రశ్నించారు.



# క్యాన్సర్ కారక సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తాం

### - ప్లాస్టిక్ రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దుదాం - మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలో క్యాన్సర్ కారక సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించి ప్లాస్టిక్ రహిత పెద్దపల్లిగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ అన్నారు. గురువారం పెద్దపల్లి పట్టణ వర్తక వ్యాపార సంఘాల వారితో మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్యాన్సర్ రూపంలో ఎంతో మంది ప్రాణాలను బలిగొంటున్న (సింగిల్ యూజ్ ప్లాస్టిక్) ప్లాస్టిక్ మహమ్మరిని పెద్దపల్లి పట్టణంలో పూర్తిగా నిషేధించడం జరుగుతుందని, దీనికి పెద్దపల్లి పట్టణ ప్రజలు, పట్టణ వర్తక వ్యాపార సంఘాల వారు సహకరించాలని కోరారు. పట్టణంలో పలు వార్డుల్లో నివసించే ప్రజలు తమ ఇంట్లో నుండి నిత్యావసర సరుకులకు వచ్చేటప్పుడు వారి వెంట బట్ట సంచులు తీసుకురావాలని అన్నారు. దుకాణ యజమానులు ప్రతిఒక్కరు మీయొక్క దుకాణల ట్రేడ్ లైసెన్స్ పొంది




ఉండాలని ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్నటువంటి వారు మరియు ఇప్పటి వరకు ట్రేడ్ లైసెన్స్ తీసుకొని వారు (15) రోజుల్లో తీసుకోగలరని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో (ట్రేడ్ లైసెన్స్ మేల కౌంటర్లు) కూడ ఏర్పాటు చేయడం జరిగిందిని ఏమైనా సందేహాలు ఉంటే మున్సిపల్ హెల్ప్ లైన్ నంబర్ 63031 27484 కు కాల్ చేయవచ్చని అన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, వార్డు ఆఫీసర్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దపల్లి అధ్యక్షులు కమల్ కిషోర్, జనరల్ సెక్రటరీ సయ్యద్ మస్రత్, కోశాధికారి జయప్రకాష్, కిరాణం అసోసియేషన్ సతీష్, దీపరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా రాణించేందుకు ప్రోత్సాహం

### - డీఆర్డీవో కలిందిని





**ముత్తారం.ఫిబ్రవరి.06.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారంలో మహిళా సంఘాల మహిళలు రూ.14 లక్షల పెట్టుబడి తో మిర్చి పౌడర్,సాస్ తయారికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని డిఆర్డిఓ పిడి కలిందిని అన్నారు. నాబార్డ్ పార్మ్ సెక్టర్ ప్రమోషన్ ఫండ్ కింద జిల్లాలో మహిళ రైతులచే మిరుప విలువ గొలుసును అభివృద్ధి చేయడంలో భాగంగా ముత్తారంలో ఏర్పాటు చేస్తున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో స్వశక్తి మహిళలను గుర్తించి వారితో వరికి బదులుగా మిర్చి పంటను సాగు చేసేలా ప్రోత్సహించాలని డీఆర్డీవో తెలిపారు. మహిళ సంఘాల సభ్యులచే మిర్చి ఫుడ్ ప్రాసెసింగ్ చేస్తూ, ఉత్పత్తులను మార్కెటింగ్ చేసి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, తిరుపతి, ప్రకాష్, ఫుడ్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల పోస్టర్ ఆవిష్కరణ



**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** ఫిబ్రవరి నెల 22, 23 తేదీలలో మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు సంబంధించిన పోస్టర్ను గురువారం రోజున గోదావరిఖనిలోని నారాయణ పాఠశాలలో ఏజీఎం చైతన్య రావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డి హెడ్ అనిల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏజీఎం చైతన్య రావు మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటుకరాటే ఇతర క్రీడలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుత సమాజంలోవిద్యార్థులు క్రీడలను ఆడటం వలన వారిలో మానసికంగా శారీరకంగాదృఢంగాఉండడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వం తో పాటు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కరాటే శిక్షణ తప్పనిసరి చేయడం జరిగింది. అలాగే మా నారాయణ పాఠశాలలో కూడా విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వడంవలన వారు ఆకతాయిలనుంచితమకుతామురక్షించుకునే శక్తిపెరుగుతుందనిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం చైతన్య రావు తో పాటుగా ఆర్ అండ్ డి హెడ్ అనిల్, ఆర్ ఐ సత్యం రావు, ప్రిన్సిపల్ లు రజిని, కవిత అకాడమిక్ డీన్ ఆంజనేయులు ఏవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సిలింగ్



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** స్థానిక సీ ఈ.ఆర్.క్లబ్ లో గురువారం సింగరేణి రామగుండం రెండవ ఏరియా యాజమాన్యం క్వార్టర్లు లేని ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించింది. ఉదయం ఏరియా, ఓసీపీ.1 ప్రాజెక్టు, 11వ గని లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించింది. ఈ కౌన్సిలింగ్ లో ఖాళీగా ఉన్న 310 క్వార్టర్లకు గాను 30 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 10 మంది ఉద్యోగులు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరై క్వార్టర్లు తీసుకున్నారు. ఇక ఈ కౌన్సెలింగ్‌లో ఏఐటియుసి నాయకుడు శాంసన్, ఏరియా డీజీఎం పర్సనల్, అధికార ప్రతినిధి ఎస్. అనిల్ కుమార్, సివిల్ అధికారి రాజు, డివైపిఎం వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవు దూడ గుర్తు పై ఓటు వేసి గెలిపించండి

### - అధ్యక్ష అభ్యర్థి చంద్ర రెడ్డి విజ్ఞప్తి

**కూకట్ పల్లి ఫిబ్రవరి 06 (ది క్రైమ్ న్యూస్):** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీలో నేడు జరిగే సంక్షేమ సంఘం ఎన్నికల్లో బస్తీకి చెందిన ఇంటి యజమానులందరూ ఆవు దూడ గుర్తు పై ఓటు వేసి అధ్యక్షుడిగా మరోమారు గెలిపించాలని ఊట్ల చంద్రారెడ్డి బస్తీ వాసులకు విజ్ఞప్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని ప్రతి ఒక్కరు తమ విలువైన ఓటు హక్కును వినియోగిం చుకోవాలని తెలిపారు. బస్తీలోని రోడ్ నెంబర్ 9 లో గల శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో పోలింగ్ జరుగుతుందన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఇచ్చిన ఐడి కార్డుతో పాటుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఆధార్ , డ్రైవింగ్ లైసెన్స్ ,ఓటర్ ఐడి )ఏదైనా ఒకటి వెంట తీసుకుని వచ్చి ఓటును వినియోగించుకోవాలని చంద్రారెడ్డి సూచించారు. ఆవు దూడ గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో అధ్యక్షుడిగా మరోమారు గెలిపించాలని బస్తి వాసులకు చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.





## సమస్యలు అడిగి తెలుసుకున్న ఐఎన్టియుసి



**యైటింక్లయిన్ కాలనీ. (క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ ఏరియా ఐఎన్టీయూసి ఉపాధ్యక్షులుగా నూతనంగా నియమితులైన బి. శంకర్ నాయక్ గురువారం ఏరియాలోని ఓసీపీ.3 స్టోర్స్‌ను సందర్శించారు. ఉదయం స్టోర్స్ కు వచ్చిన ఆయన ఉద్యోగులను కలుసుకుని స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక ఇక్కడికి వచ్చిన శంకర్ నాయక్‌ను ప్రాజెక్ట్ పిట్ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా తనను ఏరియా ఉపాధ్యక్షులుగా నియమించిన ఐఎన్టియూసి సెక్రటరీ జనరల్ తెలంగాణ మినిమం వేజెస్ అడ్వైజరి బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ కు, ఎందుకు సహకరించిన రాష్ట్ర మంత్రి డి. శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ లకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఐఎన్టియూసి అనునిత్యం ఉద్యోగుల శ్రేయస్సు కొరకే యోచిస్తుందన్నారు. ఇక ఆయన వెంట యూనియన్ నాయకులు ఎన్. దశరథం గౌడ్, పోలు భాస్కర్, కొంగర రవీందర్, అఫ్జల్ పాషా, రమేష్ రెడ్డి, యూసుఫ్, రాజయ్య, రాజేందర్, తిరుపతి, యాకూబ్, దీప్తి, సువర్ణ, మమత, వినీత, నందిని, పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజకీయాల్లో కూడా మాదిగలకు రిజర్వేషన్లు దక్కాలి !

ఎస్సీ వర్గీకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశానికి, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఇదో చారిత్రక నిర్ణయంగానే చూడాలి. అయితే కేవలం ఉద్యోగాల్లో మాత్రమే గాకుండా ప్రథమంగా రాజకీయ రిజర్వేషన్లు దక్కాలి. అది కూడా ఎల్లకాలం ఒకే కుటుంబానికి ఎస్సీ రిజర్వేషన్లు దక్కరాదు. అంతేగాకుండా ఒకే కుటుంబం రిజర్వేషన్లు తన్నుకుపోవడం కూడా సరికాదు. నిజానికి నిజమైన ఉద్యమం ఇక్కడే మొదలు కావాలి. మందకృష్ణ వీలయితే రాజకీయ ఉద్యమం మొదలు పెట్టాలి. రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు రావాలన్న నినాదం ఎత్తుకోవాలి. తెలంగాణలో తీసుకుంటే కాకాగా పేరున్న వెంకటస్వామి కుటుంబమే మూడు రాజకీయ పదవులు పొందింది. ఇదో రకంగా రిజర్వేషన్లను అపహాస్యంచేయడమే. ఇది ఒకక ఎస్సీల్లోనే కాదు..అన్ని స్థానాల్లో కుటుంబానికి ఒక్కటే సీటు అన్న నినాదం రావాలి. నినాదం కాస్తా రాజ్యాంగ నిర్ణయం కావాలి. కేంద్రంలోసోనియా కుటుంబంలో మూడు పదవులు అంటే ముగ్గురు ఎంపిలుగా ఉన్నారు. తెలంగాణలోనే కెసిఆర్ కుటుంలో నలుగురై దుగురు, చంద్రబాబు కుటుంబంలో నలుగురైదుగురు ఉంటున్నారు. ఓవైసీ కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల్లో ఇద్దరికిద్దరు జీవితాంతం ఎంపిగా, ఎమ్మెల్యేగా ఉంటున్నారు. ఇలాంటి వాటిపై ఆంక్షలు ఉండాలి. ఒకే కుటుంబ మూలాలు ఉన్న వారికి ఒక్కటే సీటు అన్న రాజ్యాంగ నిర్ణయం రావాలి. ఒక్కరు రెండు పర్యాయాలకు మించి రాజకీయ పదువులు పొందకుండా చూడాలి. ఎస్సీవర్గీకరణ నేపథ్యంలో ప్రజలంతా ఇలాంటి పోరాటాలు చేయాలి. వేల ఏళ్లుగా షెడ్యూల్డ్ కులాలు అట్టడుగు స్థాయిలో ఉంటున్నారు. వీరంతా వేల సంవత్సరాలనుంచి సామాజిక హక్కులు దక్కకుండా అస్పృశ్యత, అంటరాని తనాన్ని అనుభవించారు.వారికి రాజకీయంగా కూడా పదవులు గట్టిగా దక్కడం లేదు. దక్కినా బిచ్చం మాదిరిగా వేస్తున్నారు. రిజర్వేషన్లు ఉండబట్టి వీరంతా అక్కడక్కడా కొంత ప్రాతినిధ్యం పొందుతున్నారు. రాజ్యాంగంలో15 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే ఈ రిజజర్వేషన్లు కూడా కొందరికే దక్కుతు న్నాయి. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ కారణంగా కొంత మెరుగు పడవచ్చు. మాదిగ ఉపకులాల్లో మరీ అధ్వాన్నంగా ఉన్న వారెందరో ఉన్నారు. షెడ్యూల్డ్ కులాల్లో (ఎస్సి)59 ఉపకులాలు ఉన్నాయని లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులో ప్రధానంగా ఉన్న కులాలు మాదిగ, మాలలు. ఇందులోనూ మాలలే ఎక్కువ శాతం రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. జనాభాపరంగా అత్యధికంగా ఉన్నప్పటికీ సామాజికంగా బాగా వెనుకబడ్డ కులం మాదిగ వర్గం మాత్రమే. మాదిగ కులంలోనూ ఇంకా అట్టడుగు స్థాయికి చెందిన డక్కలి వంటి వారు ఉన్నారు. మెజారిటీ జనాభా గల మాదిగ కులానికి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లలో తగిన వాటా దక్కకపోవడమే కారణంగానే మందకృష్ణ ఉద్యమించాల్సి వచ్చింది. కానీ రాజకీయాలు పెత్తందార్లు, ఉన్నత వర్గాల చేతుల్లో ఉన్న కారణంగా మాదిగల రిజర్వేషన్ పోరాటం మూడు దశాబ్దాలుగా కొనసాగింది. వీరి మధ్య అసమానతల నేపథ్యంలో మాల, మాదిగల మధ్య వైరుధ్యం పెరిగింది. అందుకే తమజాతికి న్యాయం జరగాలన్న పట్టుదలతో మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 1994న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమం మొదలైంది. దీంతో అనాటి ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1996లో వర్గీకరణ అంశంపై జస్టిస్ పి.రామచంద్ర రాజు కమిషన్ నియమించారు. ఈ కమిషన్ షెడ్యూల్డ్ కులాల్ని వెనకబాటుతనం ఆధారంగా ఎ, బి, సి, డిలుగా వర్గీకరణ చేయాలనీ సిఫార్సు చేసింది. ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణను విద్య, ఉద్యోగాల్లో వర్తింప చేయాలని సూచించింది. ఈ కమిషన్ నివేదిక మేరకు 2000 నుంచి అమలు పరిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సి ఉప వర్గీకరణను సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో 2004లో కొట్టివేశారు. దీంతో మాదిగ ఉప కులాలు నిరసన వ్యక్తం చేసి, వర్గీకరణ చట్టబద్ధతకై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం 2007లో ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించినది. ఈ కమిషన్ కూడా రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని నొక్కి చెప్పింది. కానీ ప్రభుత్వాలు ఓట్ల రాజకీయం కోసం ఇన్నాళ్లు దాటవేశారు. అయినా చివరకు పోరాటానికి గుర్తింపు దక్కింది. సుప్రీంకోర్టు కూడా ఈ విషయంలో వాస్తవాలు గుర్తించి వర్గీకరణకు ఆమోదం ఇచ్చింది. సుప్రీం కోర్టు తీర్పులో ఎస్సి కులాల్లో ఎక్కువ, తక్కువలున్నాయని దేశం గుర్తించింది. సామాజిక, ఆర్థిక స్థితిగతుల గణాంకాలు సేకరించి, వాటి ఆధారంగా ఉపవర్గీకరణ చేయాలనీ స్పష్టం చేసింది. మాదిగలు కన్నా తక్కువ సంఖ్యా బలం ఉన్న మాలల ఇంతకాలం రిజర్వేషన్‌లను అనుభవించారు. ఎస్సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అధ్యయనం చేసిన తెలంగాణ ప్రభుత్వం , తీర్పును అమలు చేసేందుకు అసెంబ్లీ వేదికగా చర్చించి ఆమోదించడం శు భపరిణామం. ఈ క్రమంలో వీరికి రాజకీయంగా కూడా రిజర్వేషన్లు దక్కాల్సి ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సి ఉంది. కేంద్రం కూడా రాజకీయ రిజర్వేషన్లలో వీరి వాటాను గుర్తించి రాజ్యాంగ సవరణలు చేస్తే మరీమంచిది. పనిలో పనిగా రాజకీయ రిజర్వేషన్లలో మార్పులు తీసుకుని రావాల్సిన ఆగత్యం గుర్తించాలి. ఎస్సి రిజర్వేషన్ వర్గీకరణతోనే దళితుల్లో సామాజిక న్యాయం సాధ్యం కాదు. దీన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలి. అన్ని రంగాలలో వీరిని ముందుకు తీసుకువెళ్లాలి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన ఎస్సి వర్గీకరణను విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లో కూడా వీరికి ప్రాధాన్యం దక్కేలా చేయాలి. ప్రభుత్వ పథకాలలో,కార్పొరేషన్ లోన్లలో కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. జనాభా దామాషా, వెనుకబాటు ఆధారంగా జరుగుతున్న ఈ ఎస్సి వర్గీకరణను రాజకీయాల్లో కూడా దక్కినప్పుడే సంపూర్ణంగా న్యాయం చేకూరగలదు.

# ప్రతీకారేచ్ఛలో మావోయిస్టులు

### సామాన్య గిరిజనులపై దాడులు

### ఇన్‌ఫార్మర్ నెపంతో వరుసగా హత్యలు



రాయపూర్ : గత కొన్ని నెలలుగా తగులుతున్న ఎదురు దెబ్బలకు మావోయిస్టులు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారా అన్న అనుమానం కలుగుతోంది. తమ అనుపానాలు పోలీసులకు ఎలా చేరుతున్నాయన్న కక్షలో అనుమానం ఉన్న వారిని మట్టుపెడుతున్నారు. ఇది వారిలో ఫ్రస్టేషన్‌కు కారణంగా చెప్పుకోవాలి. ఒక విధంగా చెప్పాలంటే ఏం చేయాలో అర్థంకాని స్థితిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా సామాన్యులపై కసి తీర్చుకుంటున్నారు. వరుస ఎన్ కౌంటర్లలో మావోయిస్టులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. దీనికి దళాల సమాచారం పోలీస్‌లకు లీక్ కావడమే కారణమని మావోయిస్టులు భావిస్తున్నారు. అందుకే ఇలా ఊళ్లపై పడి హత్యలకు పాల్పడుతున్నారు. ఈ భయంతోనైనా ప్రజలు తమ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వకుండా ఉంటారని అనుకుంటున్నారు. మావోయిస్టుల ఇన్‌ఫర్మేషన్ పోలీసులకు అందిస్తున్నారని అనుమానిస్తున్నారు. అందుకే అనుమానం ఉన్న వారందర్నీ కాల్చి చంపుతు న్నారు. తాజాగా మావోయిస్టులు మరోసారి ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. తమ వారిని చంపేందుకు వీళ్లు సహకరిస్తున్నారని మావోయిస్టులు ఈ హత్యలకు తెగపడ్డారు. తలాబ్ పారా బుడ్డి ప్రాంతంలో నివాసముండే కరమ్ రాజు (32), మద్వి మున్నా (27) అనే ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. వీళ్లే తమ పార్టీకి చెందిన నేతలు ఉండే ప్రాంతాల సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారనే నెపంతో ఈ దురాఘతానికి పాల్పడ్డారు. మద్వి మున్నా, కరమ్ రాజు ఇళ్లలోకి అర్ధరాత్రి చొరబడి మావోయిస్టులు పదునైన ఆయుద్దాలతో అతి కిరతకంగా గొంతు కోసి హత్య చేశారు. కుటుంబం సభ్యుల ముందే మావోయిస్టులు ఈ దారుణానికి పాల్పడ్డారు. తమ వారికి ఏ పాపం తెలియదు వదిలి పెట్టాలని వేడుకున్నా విడిచిపెట్టలేదు. వారు కాళ్లావేళ్ల పడినా కనికరించలేదు. రెండు హత్యలు చేసిన తర్వాత మావోయిస్టులు స్పాట్‌లో లేఖలు విడిచి పెట్టి వెళ్లారు. ఈ ఘటనతో బీజాపూర్ ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజనుల హత్యను పోలీసులు కూడా ధృవీకరించారు. ఘటనపై టార్రెమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే మావోయిస్టులు పోలీస్ ఇన్ ఫార్మర్ నెపంతో ముగ్గురిని హత్య చేశారు. ఆదివారం తెల్లవారు జామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా బహదూర్ ఘాట్ తాలుకలో మాజీ ఎంపిటీసీ మాడవ్వి (45) ని ఇలానే దారుణంగా హత్య చేశారు మావోయిస్టులు. పోలీస్ ఇన్ ఫార్మర్‌గా మారి దళాల సమాచారాన్ని పోలీస్‌కు అందిస్తున్నారని నెపంతో మాడవ్వి చితకబాది హత్య చేశారు. వరుస ఘటనలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర దండకారణ్యంలో గిరిజన గూడేలు భయంతో వణికి పోతున్నాయి.

# కల్లలవుతున్న యువత డాలర్ కలలు

### ఉపాధి, ఉద్యోగాల వేటలో మోసపోతున్న నేటితరం

### కేంద్రం అసమర్థ విధానాలే దీనికి కారణం

న్యూఢిల్లీ : యువత డాలర్ కలలు కల్లలవుతున్నాయి. అమెరికా వెళ్లి నాలుగు రాళ్లు సంపాదించుకోవాలనుకున్న వారి ఆశలు గల్లంతవుతున్నాయి. దేశంలో ఉద్యోగాలు దొరక్క, ఉపాధి దక్కక విధిలేని పరిస్థితుల్లో లక్షలాది మంది ఉద్యోగాలు, ఉపాధి వెతుక్కుంటూ అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయ్, గల్ఫ్ దేశాలకు వెళు తున్నారు. కొందరు ఏజెంట్ల చేతిలో మోసపోతున్నారు. అమెరికా లాంటి దేశాల్లో ట్రంప్ లాంటి వారు రావడంతో తట్టుబుట్టా సర్దుకోకుండానే తిరుగు టపా కట్టాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలు కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశంలో వనరులు ఉన్నా, చేసుకునేందుకు పనివున్నా, అవకాశాలు కల్పించకపోవడం వల్లనే ఈ దర్గతిఏర్పడుతోంది. దీనిపై పార్లమెంటు చర్చించాలి. తాజాగా మరోమారు అమెరికా కలలు కంటూ.. తమ కుటుంబాలకు మంచి జీవితం ఇద్దామనుకొని అక్కడికి వెళ్లిన వారి ఆశలు అడియాశలు లయ్యాయి. భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోయింది. ఈక్రమంలో వారి దీనగాథలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అగ్రరాజ్యం ప్రత్యేక విమానంలో వెనక్కి పంపించింది. మొత్తంగా 104 మంది ఆ విమానంలో స్వదేశానికి చేరుకున్నారు. అక్రమమార్గంలో విదేశాలకు వెళ్లొద్దని కోరుతున్నా ఆవేదన వ్యక్తంచేశారు. భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం అమృత్‌సర్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇందులో అమెరికా వెనక్కి పంపిన వారిలో 33 మంది చొప్పున హరియాణా, గుజరాత్‌ల నుంచి, 30 మంది పంజాబ్ నుంచి, ముగ్గురేసి చొప్పున మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్‌ల నుంచి, ఇద్దరు చండీగఢ్ నుంచి ఉన్నారు. అమృత్‌సర్‌కు తీసుకొచ్చిన వారిలో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు ఉన్నారు. అమృత్‌సర్‌కు చేరుకున్న అక్రమ వలసదారులను పోలీసులు తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించాక ఇళ్లకు పంపారు .దీంతో అమెరికాలో వర్క్ వీసా ఇప్పిస్తానని నమ్మబలికిన ఏజెంట్‌కు రూ.42 లక్షలు ఇచ్చి హర్వీందర్ సింగ్ దారుణంగా మోసపోయాడు. ఆయనది పంజాబ్‌లోని హోషియాపుర్‌కు చెందిన తహ్లీ గ్రామం. తర్వాత వీసా రాలేదని చెప్పడంతో దిల్లీ నుంచి ఖతర్.. అక్కడి నుంచి బ్రెజిల్ వెళ్లి నానాయాతన పడుతూ అమెరికా వెళ్లాడు. ఇప్పుడు ట్రంప్ ఎఫెక్ట్‌తో ఉన్న డబ్బు పోయి, ఎక్కడ మొదలు పెట్టాడో అక్కడికే వచ్చి నిల్చున్నారు. దారాపుర్ గ్రామానికి చెందిన సుఖ్‌పాల్ సింగ్ కూడా ఇలాంటి దుస్థితినే ఎదుర్కొన్నారు. 15 గంటల పాటు సముద్ర ప్రయాణం చేసి, దాదాపు 45 కి.మీ. పర్వతమార్గంలో ముందుకెళ్లారు. 'ఎవరైనా గాయపడితే.. వారి పరిస్థితి అంతే. మిగిలేది మరణమే. దారివెంట ఎన్నో మృతదేహాలను చూశాం. ఇక కొద్దిసేపట్లో మెక్సికో సరిహద్దు దాటి అమెరికాలో అడుగుపెడతామనగా జలంధర్‌కు చెందిన ఓ వ్యక్తి అరెస్టు కావడంతో మా ప్రయణం అంతా వృథా అయింది. దాంతో మమ్మల్ని 14 రోజులపాటు చీకటి గదుల్లో బంధించారు. సూర్యుడు జాడే లేకుండా పోయింది. అక్కడ వేలాది మంది పంజాబీ కుటుంబాలకు చెందిన యువకులు, పిల్లలు కనిపించారు. అందరిదీ ఒక్కటే దుస్థితి. ఇలాంటి దుస్తితి ఎందుకన్నదే ప్రశ్న. మనదేశంలోనే మనం పనిచేసుకునే అవకాశాలు పెరగాలి. అప్పుడే దేశ ఆర్థిక పరిస్థితి కూడా పెరగగలదని ప్రభుత్వం గుర్తించాలి.

# ప్రభుత్వ స్థలాలు కబ్జా

### స్థానికుల ఫిర్యాదుతో అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు


హైదరాబాద్ : నగరంలో భూములకు బాగా డిమాండ్ ఉండటంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలా కబ్జాదారులు అక్కడ వాలిపోయి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే సుమారు రూ. 300 కోట్ల విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది ప్రభుత్వ సూచిక బోర్డు ఉన్నా దానిని తొలగించి ఆ స్థలంలో షెడ్లు, టెంట్లు వేసి ప్రైవేట్ సైన్యాన్ని కాపలాపెట్టారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 తట్టిఖానాలో జలమండలి కార్యాలయం పక్కనే ప్రభుత్వానికి చెందిన మూడెకరాల స్థలం ఉంది. గత ఏడాది డిసెంబర్‌లో కొంతమంది ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంది. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కొన్నిరోజులు స్తబ్దుగా ఉన్న కబ్జాదారులు మళ్లీ స్థలంలో షెడ్లు, రెండు టెంట్లు వేసి ప్రైవేటు సైన్యాన్ని కాపలాగా పెట్టారు. ప్రభుత్వ సూచిక బోర్డులను తొలగించారు. సమాచారం అందుకున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో వెళ్లి షెడ్లను, టెంట్లను తొలగించి ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు.

# టెట్ పరీక్షల్లో 83,711 మంది అభ్యర్థులు అర్హత

హైదరాబాద్ : రాష్ట్రంలో జనవరి 2 నుంచి జనవరి 20 వరకు 20 సెషన్స్‌లో టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,75,753 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. పరీక్షలకు 2,05,278 మంది హాజరయ్యారు. వీరిలో రెండు పేపర్లు కలిపి 83,711 (40.78 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇందులో పేపర్-1లో 69,476 మంది అభ్యర్థులకుగాను 41,327 (59.48 %) మంది క్వాలిఫై అయ్యారు. ఇక పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌లో 69,390 మంది పరీక్షకు హాజరుకాగా.. 23,755 (34.24 %) మంది అభ్యర్థులు అర్హత సాధించారు. సోషల్ స్టడీస్ పేపర్‌లో 66,412 మందికిగాను.. 18,629 (28.205 %) మంది అర్హత సాధించారు. మొత్తానికి పేపర్-1, పేపర్-2 రెండూ కలిపి 2,05,278 మంది పరీక్షలకు హాజరుకాగా.. 83,711 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణలో టెట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలతోపాటు ఫైనల్ ఆన్సర్ కీని విద్యాశాఖ విడుదల చేసింది. పేపర్లు, సబ్జెక్టులవారీగా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్సర్ కీని అందుబాటులో ఉంచింది. ఆన్సర్ కీతోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు అందుబాటులో ఉన్నాయి. టెట్ పరీక్షలకు సంబంధించిన ప్రిలిమినరీ ఆన్సర్ కీని పాఠశాల విద్యాశాఖ జనవరి 24న విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థుల నుంచి జనవరి 25 నుంచి 27న సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించింది. టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను ఓసీలకు 90గా, బీసీలకు 75గా, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 60గా నిర్ణయించారు. తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్, పీజీ ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకు సంబంధించిన పరీక్ష తేదీలు ఖరారయ్యాయి. త్వరలోనే దరఖాస్తు చేసుకోవడానికి రిజిస్ట్రేషన్ ఫీజు ఇతర వివరాలతో కూడిన వివరణాత్మక నోటిఫికేషన్లను సంబంధిత సెట్ కన్వీనర్లు ప్రకటించనున్నారు. టీజీ ఎప్‌సెట్-2025 ఫిబ్రవరి 20న, పీజీఈసెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల కానుంది.

# ఖర్జూర వృక్షం ఆదర్శం

పరిశుద్ధ వాక్కును అల్లాహ్ ఓ చెట్టుతో పోల్చాడు అని చెబుతున్నది ఖురాన్. ఖర్జూర చెట్టు వేరు భూమిలోనికి లోతుగా నాటుకొని ఉంటుంది. కొమ్మలు ఆకాశాన్ని అంటుతాయి. ప్రభువు ఆదేశానుసారం అది విశేషంగా పండ్లను ఇస్తుందని ఖర్జూర చెట్టు గురించి ఖురాన్‌లో పేర్కొనడం విశేషం. ఒకసారి ప్రవక్త (స అసమ్) తన దగ్గరికి వచ్చిన ఇబ్నె ఉమర్(రజి)తో మాట్లాడుతూ 'ముస్లిం మాదిరిగా ఎల్లకాలం ఫలాలనిచ్చే వృక్షం ఏదో నాకు చెప్పండి' అని ప్రశ్నించాడు. ఉమర్ (రజి)కి 'ఖర్జూర చెట్టు' అయి ఉంటుందన్న ఆలోచన తట్టింది. కానీ, ఆ సమయంలో అక్కడ అబూబక్(ర్రజి), ఉమర్(రజి) వంటి ఉద్దండులు ఉపవిష్టులై ఉండటంతో సమాధానం చెప్పలేకపోయారు. పెద్దల ముందు మాట్లాడటం సబబు కాదని ఊరుకున్నాడు. వారెవరూ సమాధానం ఇవ్వకపోవడంతో ప్రవక్త (స) 'అది ఖర్జూర చెట్టు' అని చెప్పారు. సగటు ముస్లిమ్ (విశ్వాసి) ఖర్జూరపు చెట్టులాంటి వాడని ఎందుకన్నారంటే.. ఖర్జూరపు చెట్టు అన్ని కాలాల్లోనూ ఫలాలను ఇస్తుంది. అలాగే దైవ విశ్వాసి నిత్యం అందరి శ్రేయాన్ని కోరుకుంటాడని అర్థం. ఖర్జూరపు చెట్టు మొదలు నుంచి చివరి దాకా అన్నీ ఉపయోగపడేవే! ఖర్జూరపు కాయలు, పండ్లు, చెట్టు ఆకులు, దాని కలప, విత్తనాలు ఇలా అన్నీ పనికొచ్చేవే. ఖర్జూరపు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఎన్నో రోగాలకు ఔషధంగా పనిచేస్తాయి. ఖర్జూరం విత్తనాలు కూడా ఎన్నో రుగ్మతలకు విరుగుడుగా ఉపయోగపడతాయి. అలాగే దైవ విశ్వాసి తన జీవితాన్ని సమాజానికి, కుటుంబానికి అంకితం చేయాలని ప్రభువు యోచన. అందుకే, దైవ విశ్వాసిని ఖర్జూరంతో పోల్చారు ప్రవక్త (స).



ఆధ్యాత్మికం

# మంథని మహనీయుల చరిత్రను చాటుదాం

- చారిత్రక నేపథ్యం కలిగిన మంథని పట్టణం
- ఎందరో మహనీయులను ప్రజలకు అందించిన చరిత్ర
- విగ్రహాలు,వీధులకు పేర్లు, స్వాగత అర్చీలు పెట్టి గౌరవిద్దాం
- ఇనుముల సత్యనారాయణ, న్యాయవాది, మంథని మాజీ ఉపసర్పంచ్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 06:-** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలో ప్రజా ప్రతినిధులుగా, స్వాతంత్ర సమర యోధులుగా, నిజాం నవాబు పాలనపై పోరాటం చేసిన వీరులుగా తెలంగాణ ఉద్యమ కారులుగా ఉండి మంథని ప్రాంతానికి సేవ చేసి, మంథని కీర్తిని విశ్వవ్యాప్తం చేసి అమరులైన వారిని పార్టీలకు అతీతంగా పలువురు మహనీయులకు విగ్రహాలు, వారి పేర్లపై పట్టణంలోని పలు వీధులకు, రోడ్లకు నామ పలక బోర్డులు ఏర్పాటు చేసి, వారిని నిత్యం స్మరించే విధంగా మంథని మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరుతూ మంథని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, అడిషనల్ కలెక్టర్, స్థానిక సంస్థల మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి కి మంథని మాజీ ఉపసర్పంచ్, న్యాయవాది ఇనుముల సత్యనారాయణ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ మేరకు చారిత్రక నేపథ్యం కలిగిన మంథని పట్టణం ఎందరో మహనీయులను ప్రజలకు అందించిన చరిత్ర ఉంది. కాగా గత పాలకులు,స్థానిక సంస్థల పాలకులు ఈ ప్రాంతానికి సంభందం లేనివారిని, మంథని పట్టణానికి సేవలు చేయని వారిని, ఏనాడు ఇక్కడ ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కాని వారి విగ్రహాలు, పలు వీధులకు వారి పేర్లను పెట్టి ఇదే చరిత్ర అని మంథని ప్రజలపై రుద్ది అసలైన మంథని మహనీయుల చరిత్రను మరుగున పడేసిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. కాగా ప్రస్తుతం మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జననేత,రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధతో మంథని పట్టణ అభివృద్ధి కోసం,సుందరీకరణ కోసం మంజూరు చేసిన కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని పలు రోడ్లకు, వీధులకు, పలు కూడళ్ళలో మంథనికి సేవ చేసి, పట్టణ చరిత్రను విశ్వ



వ్యాప్తం చేసి అమరులైన మహనీయుల చరిత్రను గుర్తు చేసుకొనే విధంగా వారి విగ్రహాలు, వారి పేర్లపై మున్సిపల్ రికార్థులలో నమోదు చేసి, మున్సిపాలిటీ నిధుల ఖర్చుతో స్వాగత ఆర్చీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని మెజారిటీ ప్రజల వినతి. అందుకు గాను మొదటగా మంథని ప్రాంతానికి అనేక ఏండ్లు ప్రాతినిధ్యం వహించి, ప్రజలు మరవని ప్రజానేతగా, అజాత శత్రువుగా పేరుగాంచిన స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు చరిత్రను భావితరాలకు తెలిసే విధంగానే కాకుండా మంథని నియోజకవర్గం ప్రధాన మండలాలకు, కాళేశ్వరం, మహారాష్ట్ర, ఛత్తిస్ ఘడ్ వంటి రాష్టాలకు వెళ్లే వారికి ప్రధాన రహదారిగా ఉన్న మంథని పాత పెట్రోల్ బంక్ కూడలిలో ప్రజానేత చరిత్రను అందరూ తెలుసుకొనే విధంగా,ప్రస్తుతం నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్లతో కూడిన పనులు జరుగుతున్న అట్టి కూడలిని అభివృద్ధి చేసి, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి, అసెంబ్లీ ఎదురుగా ఉన్న జాతిపిత గాంధీ విగ్రహం మాదిరిగా మహనీయుడు స్వర్గీయ శ్రీపాద రావు పెద్ద విగ్రహాన్ని పాత పెట్రోల్ బంక్ కూడలిలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా మంథని మున్సిపల్ పరిధిలో ఉండి ఎమ్మెల్యేగా ఎన్నికయిన స్వర్గీయ గడిపెల్లి రాములు, సి.ఎన్. రెడ్డి, ఎమ్మెల్సీ గా ఎన్నికైన స్వర్గీయ గీట్ల జనార్ధన్ రెడ్డి, స్వాతంత్ర సమర యోధులుగా ఉండి, నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేసిన మహనీయులు స్వర్గీయ గులుకోట శ్రీరాములు, పనకంటి కిషన్ రావు, సువర్ణ ప్రభాకర్, చొప్పకట్ల చంటయ్య , రఘునాథ్ కాచే, మురలీధర్ కాచే, తమ్మనబట్ల దామోదర్, రాంపెల్లి కిష్టయ్య ,మోతేరామ్, రాజేశ్వర్ రావు, సంజీవ్ రావు,ఎలిశెట్టి సీతారామ్ , అవధానుల కిష్టయ్య , దేవళ్ళ రాజేశ్వర్ రావు , ఎం. గణపతి , సి. గణపతి రావు ,గట్టు రామన్న, ఎస్. నరసింహులు, వెంకట రాజన్న,నరహరి ల వంటి మహనీయులను గౌరవించుకోవాలి. అదేవిధంగా మంథని పట్టణంలో ప్రజా ప్రతినిధులు గా ఎన్నికయిన బయ్యగారి విఠల్ , ముక్కా వీర రాఘవులు , కొమురవెల్లి మహాదేవ్ , దొంతుల రాజలింగయ్య ,అంబేద్కర్ నగర్ కు చెందిన వేల్పుల రాజయ్య , విశ్వ బ్రాహ్మణ వీధికి చెందిన జంబోజు రాజయ్య, పట్టాణానికి చెందిన గొబ్బూరి సత్యం రాజ్, మాదాసి రాములు, సిలివేరి రాజయ్య , కవి తాటికొండ రాజయ్య గౌడ్ , తాటి వెంకటి, వొడ్నాల సమ్మయ్య, బోయిని శంకరయ్య , నక్క బలరామ్, తెలంగాణ అమరుడు గుండా నాగరాజు,మంథని మాజీ వార్డుసభ్యులు వినోద్ కుమార్ జావర్ (లడ్డు బాయ్ ), ఉప్పట్ల సత్యం,సామాజికవేత్తలు అశోక్ కుమార్ నాయుడు ,బాపు గౌడ్ ల వంటి వారి చరిత్రలు మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని మంథని కి సేవ చేసిన మహనీయుల పేర్లను మర్చిపోతే క్షమించి, ఇంకా ఎవరైనా పేర్లు ఉంటే తెలుపగలరని మంథని మాజీ ఉపసర్పంచ్, న్యాయవాది ఇనుముల సత్యనారాయణ కోరారు. కావున మంథని పట్టణ మహనీయుల చరిత్రను మనం మననం చేసుకొనే విధంగా, భావి తరాలకు అందించే విధంగా చర్యలు తీసుకొని అమరులైన వారిని నిత్యం స్మరించే విధంగా పలు వీధులకు, కొత్తగా నిర్మాణం అవుతున్న రోడ్లకు వారి పేర్లు పెట్టే విధంగా మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేయాలని, అదేవిధంగా మున్సిపాలిటీ నిధులతో అవసరం ఉన్న చోట, పరిస్థితి బట్టి మంథని మహనీయుల చరిత్ర పేరిట వారు పుట్టి,పెరిగిన చోట విగ్రహాలు, వీధుల్లో, రోడ్లకు మహనీయుల పేరిట బోర్డులు, స్వాగత అర్చీలు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని మంథని మహనీయుల గౌరవం పేరిట మంథని మెజారిటీ ప్రజల మనోభావాలను గౌరవించి పైన పేర్కొన్న పనులు చేపట్టాలని ఆయొక్క వినతిపత్రంలో మంథని మాజీ ఉపసర్పంచ్, న్యాయవాది ఇనుముల సత్యనారాయణ అధికారులను కోరడం జరిగిందని అన్నారు.

# నగరంలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలి

- కాలువలో నీటి ప్రవాహకానికి ఆటంకంగా ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలి
- నైట్ షెల్టర్‌లో సీసీ కెమెరాను వెంటనే ఏర్పాటు చేయాలి
- రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నగర కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తెలిపారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్లలో పర్యటించి అక్కడి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. 23వ డివిజన్ భీమునిపట్నం కాలువల్లో ఉన్న వ్యర్థాలను యంత్రాలతో శుభ్రం చేయించాలని అదనపు కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. టీచర్స్ కాలనీ పార్క్, కాలనీలోని గుంతల్లో మురుగు నీటి వ్యర్థాలను వెంటనే తొలగించాలని అన్నారు. బస్ స్టాండ్ ఆవరణలోని నైట్ షెల్టర్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా ఉండాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కావటి సతీష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 06:** మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన కావటి సతీష్ కుమార్ కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ రేట్ లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్య కిషన్ రావు పర్యవేక్షణలో ఒగ్గు మందెచ్చు కళారూపాల సాహిత్యం సమ పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నాడు. సతీష్ ప్రాథమిక విద్యాభ్యాసం మంథనిలో పూర్తిచేసి పీజీ ఎంఏ తెలుగు ఎంట్రన్స్ లో ఐదవ ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసి పిహెచ్ డి కూడా సాధించాడు. 10 జాతీయ సెమినార్లు ఐదు అంతర్జాతీయ సెమినార్ లలో పత్ర సమర్పణ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఓయూ జేఏసీ అధ్యక్షుడిగా పోరాటం చేసి తెలంగాణ సాధనకు ఎంతో



కృషి చేసి పోలీస్ కేసులను కూడా ఎదుర్కొన్నారు. గ్రామీణ ప్రాంత నిరుపేద ఒగ్గు కళాకారుల కుటుంబానికి చెందిన స్వర్గీయ కావటి మల్లయ్య రాజమ్మ దంపతులకు ఆరుగురు సంతానంలో సతీష్ ఐదవ సంతానం. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించాడు ఒగ్గు



కథకుల కుటుంబంలో జన్మించి ఒగ్గు కథలోనే పీహెచ్డీ చేసిన మొట్టమొదటి వ్యక్తిగా గుర్తింపు సాధించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చదువుకు సహకరించిన తన తల్లిదండ్రులు, అక్క బావ లకు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రొఫెసర్లు ఆచార్య కిషన్ రావు, సాగే కమలాకర్ శర్మ, కాసిం, సూర్య ధనుంజయ్, రఘు, విజయలక్ష్మి, వైస్ ఛాన్సులర్ నిత్యానందరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. కావటి సతీష్ కు డాక్టరేట్ రావడం పట్ల ఓయూ జేఏసీ నేతలు స్నేహితులు బంధువులు, ఒగ్గు కళాకారులు, కన్నాల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# బీసీ సామాజిక వర్గ రిజర్వేషన్ హర్షనీయం

**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 06:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుల గణన బిల్లులో భాగంగా బీసీ సామాజిక వర్గానికి 42% రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమని పెద్దపెల్లి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్దాల సుదీర్ఘ పోరాటం తర్వాత మాదిగ ఉపకులాల వర్గీకరణ మంత్రి మండలి ఆమోదించడం, బీసీలకు రిజర్వేషన్ కల్పించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. బీసీ, మాదిగ ఉపకులాలకు అండగ నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.



# వార్త రీజనల్ మేనేజర్ జాగు వెంకట రత్నం జన్మదిన వేడుకలు



**రామగిరి(ది క్రైమ్ న్యూస్)ఫిబ్రవరి 06:** రామగిరి మండలం సెంటినరీ కాలనీలో వార్త దినపత్రిక రీజనల్ మేనేజర్ జాగు వెంకట రత్నం జన్మదిన వేడుకలు నిర్వహించారు. రామగిరి మండల వార్త రిపోర్టర్ నేరెళ్ల ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జన్మదిన వేడుకల్లో రామగిరి మండల పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జాగు వెంకటరత్నం కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ పాత్రికేయులు బుర్ర తిరుపతి, పివి రావు, కోండ్ర సుకుమార్, చిందం రమేష్,జీకే రాజు, పోలు మధుకర్, సిద్ధం సన్నీ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

- అయ్యప్పకు ప్రత్యేక పూజలు
- 108 కళాశాలతో ఘటాభిషేకం
- ఆలయంలో అన్నదానం
- దివ్య పడిపూజ మహోత్సవానికి హాజరైన భక్తులు



**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఆలయ పూజారి ఇందుర్తి జానకి రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఉదయం గణపతి హోమం, అష్టోత్తర పూజలు, 108 కళాశాలతో ఘటాభిషేకం నిర్వహించి అయ్యప్పకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదానం నిర్వహించగా, సాయంత్రం దివ్య పడిపూజ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేదమంత్రోత్సవంల నడుమ అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి పడిపూజ మహోత్సవాన్ని కొనసాగించారు. పలు రకాల అభిషేకాలు నిర్వహించి అయ్యప్పను పూజించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో భోజనాలు చేసి స్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ధర్మశాస్త్ర సేవాసమితి ఆలయ కమిటీ ఛైర్మన్ నేరెళ్ల అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తవుటం కరుణాకర్, మౌటం కుమారస్వామి, భూపతి శివశంకర్, విద్యాసాగర్, జక్కు కృష్ణమూర్తి, సదాచారి, సమ్మయ్య గౌడ్, సుధాకర్, నంగునూరు సాగర్, చీరాల సాంబయ్య, నాగేందర్, రాజేశం, హరి, నరేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



# సింగిల్ విండో డైరెక్టర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రాజాపూర్ కు చెందిన సింగిల్ విండో డైరెక్టర్ బుచ్చు మల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించిగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ మల్లారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, జిల్లా కార్యదర్శి బండారి తిరుపతి కాంగ్రెస్ మండల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట పరామర్శలో పాల్గొన్నారు.

# ఉప్పల్‌ను మండలం చేయాలని ధర్నా

- మండల సాధనలో రెండవ రోజు మహాధర్నా రాస్తారోకో
- ప్రధాన రహదారిపై ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు
- అన్ని రకాలుగా సౌలభ్యం ఉన్న మండల ఏర్పాటు చెయ్యదలేదని ఆవేదన వ్యక్తం చేసిన మండల సాధన జేపీసీ
- మండలాన్ని ప్రకటించకుంటే ఉద్యమం ఉధృతం అవుతుందంటున్న ప్రజలు









**కమలాపూర్ (ది క్రైమ్ న్యూస్ ):** హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని ఉప్పల్ మేజర్ గ్రామపంచాయతీ ను మండలం చేయాలని మండల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఆదాయపరంగా, వనరులపరంగా, అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ కూడా ఉప్పల్ ను మండలంగా ఎందుకు ప్రకటిస్తలేరు అని మండల జేఏసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామాన్ని మండలంగా ప్రకటించే వరకు కూడా విశ్రమించేది లేదని , పోరాటాలు తమ గ్రామానికి కొత్త కాదని, రోజురోజుకు మండల సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. అనంతరం కమలాపూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ పోలీసు బృందంతో విచ్చేసి, ఆందోళన చేస్తున్న వారిని శాంతింపచేసి, ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. మండలం గా ప్రకటించబోతే ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధం –రాబోయే ఎన్నికలను సైతం బహిష్కరిస్తాం –ఎర్రబెల్లి సంపత్ రావు, మండల సాధన జేఏసీ సభ్యుడు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా అన్ని రకాలుగా సదుపాయాలున్న ఉప్పల్ గ్రామాన్ని మండలంగా ప్రకటించటంలేదని, ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని, పార్టీలకతీతంగా ప్రజలందరూ ఏక తాటిపైకి వచ్చి, మండలాన్ని కోరుకుంటున్నారని మండల సాధన జేఏసీ సభ్యుడు ఎర్రబెల్లి సంపత్ రావు అన్నారు. ప్రజలందరి అభీష్టం మేరకు చుట్టుపక్కల 9 గ్రామాలను కలుపుకుంటూ మండలాన్ని ప్రకటించాలని లేనిచో ఆమరణ నిరాహారదీక్షకైనా సిద్ధపడతామని , రాబోయే ఎన్నికలను బహిష్కరిస్తామని ఆయన విలేకరుల సమావేశంలో అన్నారు. సోర్స్, రిసోర్స్ పరంగా ఉప్పల్‌ను మండలం చేయాలి –ఎర్రబెల్లి దేవేందర్ రావు, మండల సాధన జేఏసీ సభ్యుడు. చుట్టుపక్కల గ్రామాలను కలుపుకుంటూ మెరుగైన రవాణా సదుపాయాలు ఉన్నాయని, విద్య, వైద్యం,వ్యవసాయానికి సంబంధించి, అంతేకాకుండా మండలం ఏర్పాటైన తర్వాత కూడా ప్రభుత్వ ఆఫీసులను నెలకొల్పటానికి సరిపోను ఐదు ఎకరాల భూమి ఉందని కచ్చితంగా మండల కేంద్రంను ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రిని, సంబంధిత మంత్రులను కోరుతున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు మండలాన్ని ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని, ప్రస్తుతం అదే పార్టీలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మండల ఏర్పాటుకి స్పందిస్తున్నాడని, ఆయన తరుపున మండల ఏర్పాటు చేయమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారని అన్నారు. మండలాన్ని వెంటనే ప్రకటించాలి. – రాణా ప్రతాప్, స్టూడెంట్ జేఏసీ సభ్యుడు ఉప్పల్ గ్రామంలో అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు,ఉన్నాయని, కేవలం పోలీస్ స్టేషన్ , ఎమ్మార్వో ఆఫీస్ తప్ప మిగిలిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉప్పల్లో ఉన్నాయని, వెంటనే ఉప్పల్ గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమంలో భాగంగా నిర్వహించిన రైలురోకోను మళ్లీ నిర్వహించడానికి కూడా వెనుకాడబోమని మండల సాధన స్టూడెంట్ జేఏసి సభ్యుడు రానా ప్రతాప్ అన్నారు. కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు ఎర్రబెల్లి సంపత్ రావు, ఎర్రబెల్లి దేవేందర్ రావు, ముజీబ్ హుస్సేన్, ఖాజ హుస్సొద్దీన్, రాజమౌళి,మాజీ సర్పంచ్ ర్యాకం మొండయ్య,తోట సురేష్, తూర్పాటి క్రాంతి, కొనుపుల రామచందర్, మహారాజు స్వామి, శ్రీధర్ రావు, శ్రీనివాస్ రావు, రాజమౌళి, రాణా ప్రతాప్, మేడిపల్లి రాజు, తూర్పాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




**గోదావరిఖని (ది క్రైమ్ న్యూస్):** గోదావరిఖని జనరల్ ఆసుపత్రి ఫ్లోరింగ్ రెన్నోవేషన్ పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేశారు. గోదావరిఖని జనరల్ ఆస్పత్రిలో ప్రసవ విభాగం, పేయింగ్ రూమ్స్, రిసెప్షన్ కౌంటర్, హెల్ప్ డెస్క్, అవుట్ పేషెంట్ విభాగాలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో చేపట్టే ఫ్లోరింగ్ రేనోవేషన్ పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న విభాగాలోని రోగులను, వైద్య పరికరాలను ఆసుపత్రిలో ఇతర భవనాలకు షిఫ్ట్ చేసి ఫ్లోరింగ్ రీనోవేషన్ పనులు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో ఫ్లోరింగ్ రిన్నోవేషన్ కోసం సంబంధిత ఏజెన్సీలకు ముందు కొంత విభాగాన్ని అప్పగించాలని, అక్కడ ఫ్లోరింగ్ ముగిసిన వెంటనే మరో విభాగాన్ని అప్పగించి ప్రణాళిక ప్రకారం పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. రోగులను షిఫ్ట్ చేసే చోట వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉండే విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, శస్త్ర చికిత్సలు, ఔట్ పేషంట్ వివరాలు తెలుసుకున్న కలెక్టర్ మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, డాక్టర్ రాజు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులు పురుగుల నిర్మూలన అవగాహన సదస్సు




**జమ్మికుంట ఫిబ్రవరి 6 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మండల వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమము పై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకి మరియు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల అధ్యాపకులకి మరియు గ్రామీన, పట్టణ ఐ సి డి యస్ అంగన్వాడీ టీచర్స్ కి ఆరోగ్య అవగహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ ఆరోగ్య అవగహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు , మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ హేమలత, ఎంపీఓ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చందు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నులి పురుగుల వలన కలిగే ఇబ్బందులు గురించి నులి పురుగుల వలన పిల్లల్లో పోషకాహార లోపం రక్తహీనత, తరచూ కడుపు నొప్పితో బాధ పడడం వంటి వివరిస్తూ వాటికి సంబంధించి తగు జాగ్రత్తలు నిల్వ చేసిన ఆహార పదార్థాలు తినకూడదని బయట చేసే తినుబండారాలు కలుషిత ఆహార పదార్థాలు తినకూడదని సరైన పద్ధతిలో హ్యాండ్ వాష్ టెక్నిక్ చేయాలని అని వివరించడం జరిగింది. 1 నుండి 19 సంవత్సర పిల్లలందరికి ఆల్బెన్ డా జోల్ మాత్రలు ఫిబ్రవరి 10 సోమవారం రోజున తప్పకుండా పిల్లలందరి వేహించాలని సూచించారు. 1నుండి 2సంవత్సరంల పిల్లలకి సగం మాత్ర మరియు 3నుండి 19 సంవత్సరంల పిల్లలకి పూర్తి 400 యం జి మాత్ర వేయాలని అన్నారు. తప్పిపోయిన పిల్లలకి ఈ నెల 17వ తారీఖున మల్లి వేయడం జరుగుతుంది. అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్ని డిపార్ట్మెంట్ వారిని కోరడం జరిగినది. ఈ కార్యక్రమం లో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు గారు, ఎంఇఓ హేమలత, డాక్టర్స్ రాజేష్, చందన, హెల్త్ ఎడ్యుకేటర్స్ ప్రతాప్, మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ అరుణ, రత్నకుమారి, కుసుమకుమారి అన్ని పాఠశాలల, కళాశాలల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ బదులుగా వైట్‌రైస్ తింటున్నారా.? ఇది తప్పక తెలుసుకోండి.!



ఈ ఉరుకుల పరుగుల జీవితంలో పొద్దున్న లేచిన మొదలు.. నైట్ నిద్రపోయేవరకు ఎవరు ఏమి చేస్తున్నారో..? ఏ టైంకి ఏది తింటున్నారో.? ఎవ్వరికీ అర్థం కావట్లేదు. సాధారణంగా అందరూ మార్నింగ్ 10 గంటలలోపు టిఫిన్ తింటుంటే.. ఈకాలం యువత దాదాపుగా 11 గంటలకు తమ బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తి చేస్తున్నారు. సరే ఇదంతా పక్కనపెట్టండి.. ఇప్పుడంటే టిఫిన్స్ అవి ఉన్నాయ్ గానీ.. కొన్ని సంవత్సరాల క్రితం మన పూర్వీకులు టిఫిన్ చేయకుండా ఉదయాన్నే వైట్ రైస్ తిని కూలీ పనులకు వెళ్తుండేవారట. ఆసమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇన్‌ఫ్యాక్ట్ మన కంటే..వారి శారీరిక బలమే ఎక్కువ అని చెప్పొచ్చు. అయితే ఇప్పటి జనరేషన్ టిఫిన్ బదులుగా అన్నం తింటే.. అధిక బరువు పెరుగుతారని.. అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతుంటారు. మరి ఇంతకీ ఉదయాన్నే అన్నం తినడం మంచిదా.? కాదా.? ఉదయాన్నే అన్నం తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. కానీ వైట్ రైస్ మోతాదు తక్కువ ఉండేలా చూసుకోవాలి. మనం పొద్దునే లేచిన వెంటనే శరీరానికి చురుకుదనం కావాలి. అలాగే శక్తి కూడా చాలా అవసరం. ఈసమయంలో బరువును కంట్రోల్ చేసుకోవాలనుకునే వారు.. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉదయం పూట అన్నం తింటే.. రక్తంలోని చక్కెర స్థాయి కంట్రోల్‌లో ఉంటుంది. అయితే ఆ మార్నింగ్ సమయంలో అన్నం మోతాదు కూడా తక్కువ ఉండేలా చూసుకోవాలి. ఉదయం పూట అన్నం మోతాదు ఎక్కువగా ఉంటే.. లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా ఆహార పదార్థం ఏదైనా.. తక్కువ మోతాదులో తినడం వల్ల ఆరోగ్యానికి మంచిది. ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఏ ఆహారమైనా.. మోతాదుకు మించి తింటే.. లేనిపోనీ ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి..పైవార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.

## వార్నీ వెల్లుల్లి తొక్కలకు ఇంతుందా..? తెలిస్తే.. ఇకపై భద్రంగా దాచుకోవాల్సిందే..!



వెల్లుల్లి పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లలు సమృద్ధిగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాని తొలగించిడంలో ఎంతో మేలు చేస్తాయి. ఇవన్నీ చర్మానికి ఎంతో మేలు చేకూరుస్తాయి. ఈ పొట్టును పేస్ట్‌లా తయారు చేసి దాంట్లో కాస్త నీళ్లు కలిసి వాడుకోవాలి. దీనిని దురద, పింపుల్స్ ఉన్నచోట రాసుకుంటే మంచి ఫలితం లభిస్తుంది. అలాగే అనారోగ్య సమస్యల బారిన పడకుండా రక్షిస్తుంది. ఇతర దీర్ఘకాలిక వ్యాధులను కూడా తొలగిస్తుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టండి. తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టండి. తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. జుట్టు రాలడం లేదా తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతుంటే, వెల్లుల్లి తొక్క నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టి, ఆపై ఈ నీటితో మీ జుట్టును కడగాలి. లేదా స్ప్రే బాటిల్‌లో పోసుకుని జుట్టుకు, మాడుకు బాగా స్ప్రే చేసుకోవాలి. చుండ్రు, పేండ్లు వంటి సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లి పేస్ట్‌లో కొంచెం నీళు కలిపి తలకు బాగా పట్టించాలి. మరొక పద్ధతి కూడా ఉంది. వెల్లుల్లి తొక్కను వేయించి పొడి చేసి కొబ్బరినూనెలో కలిపి జుట్టుకు రాసుకుంటే తెల్లజుట్టు వేరు నుండే నల్లగా మారడం ప్రారంభమవుతుంది. పాదాల వాపును తగ్గించడానికి మార్కెట్లో వివిధ రకాల నూనెలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీరు వెల్లుల్లి తొక్కను ఉపయోగించడం ద్వారా ఈ నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. ఉదయం సాయంత్రం వెల్లుల్లి పొట్టులో తేనె వేసుకుని తీసుకుంటే ఆస్తమా నుంచి బయటపడొచ్చు. అలాగే కాళ్ల వాపుల నుండి కూడా వెల్లుల్లి పొట్టు రక్షిస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టాలి. బాగా మరిగిన నీరు గోరు వెచ్చగా ఉన్నప్పుడు మీ పాదాలను ఆ నీటిలో ఉంచండి. క్రమంగా, పాదాల వాపు, నొప్పి నుండి ఉపశమనం పొందుతారు.

## షుగర్ లెవల్స్ రోజరోజుకూ పెరిగిపోతున్నాయా.. ఇలాచేస్తే కంట్రోల్ అవ్వడం ఖాయం!

ప్రస్తుత కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువై పోతున్నాయి. కొత్త కొత్త సమస్యలు కూడా వస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఎక్కువగా అందరూ ఇబ్బంది పడే సమస్యల్లో డయాబెటీస్ కూడా ఒకటి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. డయాబెటీస్ ఉన్నవారు ఖచ్చితంగా కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఈ వ్యాధి రోజురోజుకూ ముదిరి.. ప్రాణాల మీదకు తీసుకొస్తుంది. డయాబెటీస్‌కు ఇంకా సరైన మెడిసిన్ రాలేదు. కేవలం కొన్ని రకాల జాగ్రత్తలతో మాత్రమే నియంత్రణ చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను మీ డైట్‌లో చేర్చుకుంటే.. డయాబెటీస్‌ను కంట్రోల్ చేసుకోవచ్చు. మధుమేహాన్ని కంట్రోల్ చేసే ఆహారాల్లో పెరుగు కూడా ఒకటి. పెరుగు అనేది ఎంతో ఆరోగ్యకరమైనది. సరిగ్గా వాడుకుంటే పెరుగుతో ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెట్టొచ్చని పలు అధ్యయనాల్లో తేలింది. పెరుగులో ఎన్నో పోషక విలువలు దాగి ఉన్నాయి. మరి ఇంత ఆరోగ్యకరమైన పెరుగుతో డయాబెటీస్‌ను ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెరుగుతో షుగర్ కంట్రోల్.. పెరుగు శరీరానికి రక్షణ కవచంలా పని చేస్తుంది. చాలా మంది పెరుగును అన్నంతో కలిపి తింటారు. అలా కాకుండా.. డయాబెటీస్‌తో ఉన్నవారైనా, లేనివారైనా.. ప్రతిరోజూ ఒక కప్పు పెరుగును తినడం వల్ల డయాబెటీస్ బారిన పడకుండా ఉంటారు. ఉన్నవారు కూడా నెల రోజుల్లో తగ్గించుకోవచ్చని నిపుణులు వెల్లడించారు. ఇటీవల చేసిన కొన్ని అధ్యయనాల్లో ఈ విషయం బయట పడింది. కాబట్టి మీరు కూడా షుగర్ వ్యాధితో బాధ పడేవారు అయితే పైన చెప్పిన విధంగా ఫాలో అయి.. డయాబెటీస్‌ను కంట్రోల్ చేసుకోండి. పెరుగు తినడం వల్ల ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా చాలా ఉన్నాయి. పెరుగుతో ఇతర బెనిఫిట్స్: 1. పెరుగును తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్య ఛాయలు, ముడతలు, మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా తయారవుతుంది. అలాగే జుట్టు కూడా బలంగా, దృఢంగా ఉంటుంది. 2. నిత్యం పెరుగును తీసుకుంటే రక్తపోటు కంట్రోల్ అవుతుంది. అలాగే గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. 3. పెరుగును తీసుకోవడం వల్ల అన్ని రకాల పొట్ట సమస్యలు దూరం అవుతాయి. దీంతో మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది. 4. నిత్యం పెరుగు తీసుకోవడం వల్ల వెయిట్ లాస్ అవుతారు. పెరుగులో ఫైబర్ కారణంగా.. కొద్దిగా తిన్నా కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. కాబట్టి ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. 5. అదే విధంగా శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. పెరుగు తింటే తక్షణమే శక్తి అంది.. అలసట, నీరసం దూరం అవుతాయి.

# తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

**• రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ • కుమారులు పట్టించుకోవడం లేదని సిపికి ఫిర్యాదు**

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** తల్లిదండ్రులను వృధ్యాప్యంలో పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా పార్లమెంటు ఓ చట్టాన్ని రూపొందించింది అని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గుజ్జుల సాయిలు చిలకమ్మా అనే ఇద్దరు తమను తమ కుమారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రామగుండం కమిషనరేట్‌లో సిపి ఎం.శ్రీనివాస్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. తమకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు రామగుండం పోలీస్ కమీషనర్ కార్యాలయానికి ఉన్నారని, అందులో పెద్దకొడుకు మల్లికార్జున్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడని, ఇతనిపై 2 ఎకరాల పొలం, చిన్న కొడుకు రమేష్ విద్యుత్ శాఖలో ల్కెన్ మెన్‌గా పని చేస్తున్నాడని, ఇతని పేరుపై ఒకటిన్నర ఎకరాల భూమిని తాము రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, ఆ పొలం కొనడానికి 10 లక్షల రూపాయలు అప్పు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు తాము అప్పు కట్టే పరిస్థితిలో లేమని, తమ కుమారులు తమ గురించి పట్టించుకోవడం లేదని, కనీసం నిత్య అవసరాల నిమిత్తం



ఖర్చులు కూడా చూసుకోవడం లేదని సిపికి వివరించారు. దీంతో వారి సమస్య తెలుసుకున్న సిపి వారి కుమారులని పిలిపించి, సమస్య చట్ట ప్రకారంగా పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ వృధ్యాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే వారిపై వృద్ధ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, మెయింటెనన్స్ యాక్ట్ 2007 పేరుతో పార్లమెంట్‌లో చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చారని, కేంద్రం రూపొందించిన ఈ చట్టానికి అనుగుణంగా వివిధ రాష్ట్రాల్లో నిబంధనలు రూపొందించారని అన్నారు. ఎవరైనా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# న్యాయవాదులపై పోలిసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

**- బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్**

**లక్షెట్టిపేట, జనవరి 07(క్రైమ్ న్యూస్):** న్యాయవాదులపై పోలిసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గడికొప్పుల కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని స్థానిక న్యాయస్థానం ముందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ హనుమకొండ లో న్యాయవాది గంధం శివతో అమర్యాదగా, అనుచితంగా ప్రవర్తించి చేయి చేసుకున్న ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి బృందం తీరుపై మండిపడ్డారు. స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు వెల్లడించారు. పోలీసులు న్యాయవాదుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని, ఈ చర్యను తీవ్రంగా



ఖండిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఈ చర్యకు పాల్పడిన సంబంధిత పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. నిరసనలో న్యాయవాదులు రాజేశ్వర్ రావు, కొమిరెడ్డి సత్తన్న, భూమా రెడ్డి, నరేందుల సురేందర్, కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, ప్రదీప్, నేరెళ్ల రాజేశ్వర్, లక్ష్మీ రాజం, ఉమా రాణి, సంధ్య రాణి, కూడేల్లి అశోక్, తాజోద్దీన్, రెడ్డిమల్ల ప్రకాశం, గణేష్ పాల్గొన్నారు.

# సుమారు రూ.10 కోట్లతో చెక్కేసిన బులియన్ వ్యాపారి

**- లబోదిబోమంటున్న బాధితులు - షాపు ముందు బైఠాయించి ఆందోళన - గోదావరిఖనిలో చర్చనీయాంశం**

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** కోట్ల రూపాయలతో ఓ బులియన్ వ్యాపారి చెక్కేసిన ఘటన గోదావరిఖనిలో వెలుగులోకి వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా తనకున్న జువెల్లరీ షాపును అమ్మకానికి పెట్టి సుమారు 10 కోట్ల రూపాయలతో ఆ బులియన్ వ్యాపారి ఎస్కేప్ అయినట్లు తెలిసింది. దీంతో ఆ బంగారం వ్యాపారికి అప్పులు ఇచ్చిన, షాపులో శుభకార్యాలకు నగలు చేయించుకునేందుకు డబ్బులు ఇచ్చిన బాధితులో లబోదిబో మంటున్నారు. ఇతర ప్రాంతం నుంచి బతుకు దెరువు కోసమని గోదావరిఖనికి వచ్చి గత 40 సంవత్సరాలుగా బులియన్ వ్యాపారిగా కొనసాగుతున్న శ్రీనాథ్ జువెల్లరీస్ నిర్వహకుడు ఆభరణాలకు తరుగు తక్కువ, కూలీ లేదు, పుస్తెల తాడు చేస్తే గుండ్లు ఫ్రీ, తులం బంగారం ఆర్డర్ ఇస్తే వెయ్యి రూపాయలు తక్కువ, కస్టమర్‌ను తీసుకొస్తే కమిషన్ ఇస్తా ఇలా అనేక మాయ మాటలు చెప్పి అమాయక ప్రజల వద్ద వ్యాపారం పేరుతో అందిన కాడికి దోచుకొని సుమారు 10కోట్లతో ఉడాయించడంతో గోదావరిఖనిలో సంచలనంగా మారింది. అయితే ఈ బులియన్ వ్యాపారి గత నాలుగైదు రోజుల క్రితమే పరారైనట్లు విషయం బయటకు పొక్కడం, ఆ నోట ఈ నోట అతనికి అప్పులు ఇచ్చిన, శుభకార్యాలకు నగలు చేసేందుకు




డబ్బులు ఇచ్చిన బాధితుల చెవులకు చేరడంతో బాధితులందరూ గురువారం గోదావరిఖని లక్ష్మినగర్‌లోని శ్రీనాథ్ జువెల్లర్స్‌కు చేరుకున్నారు. మేం అప్పులు ఇచ్చామని కొందరు... మేం నగలు చేసేందుకు డబ్బులు ఇచ్చామని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తూ బాధితులు షాపు ముందు బైఠాయించారు. అయితే షాపు ముందు బాధితులు బైఠాయించి ఆందోళన చెపడుతున్న విషయం తెలుసుకున్న గోదావరిఖని పోలీసులు అక్కడికి చేరుకొని విషయంపై ఆరా తీశారు. దీంతో కంట తడి పెట్టుకుంటూ బాధితులు విషయాన్ని తెలిపారు. తమకు న్యాయం చేసేలా చూడాలని వేడుకున్నారు. సుమారు 10 కోట్ల రూపాయలతో ఓ బులియన్ వ్యాపారి ఉడాయించడంతో గోదావరిఖనిలో ఈ ఉధంతంపై చర్చనీయాంశం అయ్యింది.

# సోషల్ మీడియాను దుర్వినియోగం చేయకూడదు

**- డి.సీ.పి.యు చైల్డ్ లైన్ నిర్మల, కో ఆర్డినేటర్ ఉమాదేవి**

**ధర్మారం, ఫిబ్రవరి,6 (ది క్రైమ్ న్యూస్):** సోషల్ మీడియాను విద్యార్థులు దుర్వినియోగం చేయకుండా సక్రమ దిశలో ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ మెంబర్ ఐతగాని నిర్మల, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఉమాదేవి అన్నారు. ధర్మారం మండలంలోని నంది మేడారం బాలికల గురుకుల పాఠశాలలో గురువారం రోజున నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశనుండే మంచి అలవాట్లు చేసుకొని జీవితంలో ఉన్నత స్థానం ఎదగాలని ఇట్టి ప్రయాణంలో పిల్లల హక్కులకు ఏవరైనా ఆటంకం కలిగిస్తే 1098 కి కాల్ చేసి మీ హక్కులను పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో తల్లిదండ్రులు లేని పిల్లలు, చదువుకు దూరమై తీవ్ర ఇబ్బందులు పడుతున్న పిల్లలు మీ దృష్టిలోకి వస్తే తమకు తెలియజేయాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణ కొరకు తాము నిరంతరం అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. బాల్య వివాహలు, బాల కార్మికులు, బిక్షాటన చేసే పిల్లలు తమ తమ హక్కులను కోల్పోతున్నారని అలాంటి పిల్లలకు చేయూతను అందివ్వటమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ టీం మెంబర్ కల్పన, బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ యుగేంద్ర లక్ష్మి, మరియు విద్యార్థులు, భోధనా సిబ్బంది పాల్గొన్నారు.



# చిరుతల రామాయణం మాస్టారు ఆకస్మిక మృతి

**హుజురాబాద్ ఫిబ్రవరి 6 (ది క్రైమ్ న్యూస్):** గత పాతికేళ్ల క్రితం చిరుతల రామాయణం అంటే గ్రామీణ ప్రాంతాలలో ఎంతో క్రేజీ ఉండేది. అలాంటి చిరుతల రామాయణం గ్రామీణ ప్రజలకు అలవోకగా నేర్పి ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీపాద చంద్రయ్య చిరుతల రామాయణం గురువు గుండెపోటుతో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. ఆ విషయం తెలియగానే చిరుతల రామాయణం నేర్చుకున్న అతనికి శిష్యులు అతని అభిమానులు ఆయన అంత్యక్రియలో పాల్గొనడం కాక ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.



చంద్రయ్య చిరుతల రామాయణాన్ని కళ్ళకు కట్టినట్టుగా నాటి రామాయణాన్ని ప్రజలకు ప్రదర్శించి భక్తి పారవశ్యంలో మునిగి పోయేలా చేసేవారు అనడంలో అతిశయోక్తి లేదు. ఆయన పౌరాణిక నాటక కళారంగాన్ని అతని వారసత్వంగా పెద్ద కుమారుడైన రమేష్ కలలను నేర్చుకున్నాడు. అంతేగాక డోలక్ వాయించడంలో ఎంతో నేర్పరి. ఆయన అనేకచోట్ల భజన పోటీలకు వెళ్లి తన డెవలప్ విన్యాసాన్ని ప్రదర్శించి జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకున్నారు. రమేష్ తండ్రి చంద్రయ్య మృతి చెందడన్న విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మేకల తిరుపతి, బిజెపి సీనియర్ నాయకుడు మోతి తిరుపతి, సీనియర్ జర్నలిస్టు మండల యాదగిరి, ఆ గ్రామం మాజీ సర్పంచ్ లు, వివిధ పార్టీల నాయకులు, సీనియర్ కళాకారులు, జర్నలిస్టులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

# ఏజీబీవీ పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్..



**హుజురాబాద్ ఫిబ్రవరి 6 (ది క్రైమ్ న్యూస్):** ఫిబ్రవరి 28 జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి గారు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీయుటకు టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని, అనంతరం మంచి ప్రతిభ కనబరిచిన మొదటి నలుగురు విద్యార్థులకు బహుమతులను స్పెషల్ ఆఫీసర్ అనిత దేవి గారి చేతుల మీదుగా ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) బహుమతులు అందజేశారు. బహుమతులు వి కీర్తన, ఈ శ్వేత బిందు, బి హనీ, ఎం అలేఖ్య లకు శంకర్ నారాయణ డిక్షనరీలు మరియు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయినీలు అందరూ పాల్గొన్నారు.

# కెసిఆర్ పాలనలోని రైతుల కండ్లల్ల వెలుగులు ఏడాదిలో మటమాయం

**- మీసరగండ్ల అనిల్ కుమార్**


**ఇల్లంతకుంట (ది క్రైమ్ న్యూస్):** భూమిని నమ్ముకుని ప్రపంచానికి బువ్వనందించే రైతన్నలు పిడికిలెత్తి నిరసనలు తెలిపే రోజులు వస్తున్నాయని సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన బిఆర్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మీసరగండ్ల అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గుండె నిండా ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేసిన రైతు కాంగ్రెస్ ఏడాది పాలనలో గుండె దిగులుతో కాలం వెల్లదీస్తున్నాడని మండిపడ్డారు. దశాబ్ద క్రితం కాంగ్రెస్ పాలనలో దగాపడ్డ రైతన్నలు



కేసీఆర్ పాలనలో వెలుగులు నింపుకోగా ఏడాదిలో మటుమాయమై రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, కరంటు, యూరియా, సాగునీరు, పంటల కొనుగోలు కోసం ఏడాదికాలంగా ఎదురుచూస్తూ విసుగెత్తిన అన్నదాతలు రోడ్లపైకి వచ్చే కాలం మొదలైందని సూచించారు. తాను అధికారంలోకి వచ్చాక రైతు భరోసా 15,000 ఇస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేడు మాట తప్పడం రైతులను అయోమయానికి గురిచేస్తోందని పేర్కొన్నారు. 5000 బిచ్చం వేస్తున్నావా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎకరానికి 7500 ఇస్తానని మోసపూరిత హామీలిచ్చి ప్రజల నుండి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ఇప్పుడు 6000 మాత్రమే ఇస్తాననని రైతులపై మళ్ళీ మళ్ళీ మోసాలకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటనను జారీ చేశారు.

## పొరండ్ల సొసైటీ సి.ఓ చొక్కా రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**తిమ్మాపూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొరండ్లలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సి.ఓ కే.చొక్కా రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారికి సొసైటీ డైరెక్టర్ నాంపల్లి ఆంజనేయులు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. సి.ఓ కె.చొక్కారెడ్డి సంఘ పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవలే చేపట్టిన నిర్మాణాలలో అవకతవకలకు పాల్పడుతూ సొంత నిర్ణయాలతో వ్యవసాయ రుణాలు ఇవ్వడానికి పాసుబుక్కులు లేకున్నా రుణాలు మంజూరు చేయడమే కాక కొంతమంది రైతుల పాసుబుక్కులను పోగొట్టి తిరిగి రైతులనే బెదిరిస్తున్నాడని, సంఘం ద్వారా నూతన ఇండ్ల నిర్మాణాలకు ఇవ్వాల్సిన రుణాలను పాత ఇండ్లకు ఇస్తూ కమిషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. మన్నెంపెల్లిలో గోదాం నిర్మాణానికి తీసుకున్న భూమికి 20 ఫీట్ల దారి ఉండగా అమ్మకదారులతో కుమ్మక్కై 12 ఫీట్లు దారిని చూపించి సంఘం డబ్బులను దుర్వినియోగం చేశాడని, సంఘ పరిధిలో ఉన్న పెట్రోల్ బంకు, రైస్ మిల్లులలో కూడా అవకతవకలకు పాల్పడుతూ సంఘ లావాదేవీల్లో డబ్బును దుర్వినియోగం చేస్తూ సంఘాన్ని నష్టపరుస్తున్న సీ.వో కే.చొక్కా రెడ్డిపై తగిన చర్యలు తీసుకొని సంఘానికి న్యాయం చేయాల్సిందిగా నాంపల్లి ఆంజనేయులు వినతి పత్రంలో పేర్కొన్నారు.



# ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చింది, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందీ కాంగ్రెస్ పార్టీయే

## • కృతజ్ఞతా ర్యాలీలో శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ





**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి6(ది క్రైమ్ న్యూస్):** ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణను కాంగ్రెస్ పార్టీ తీసుకు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాశాఖ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు కాంగ్రెస్ ప్రజా పాలన ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో అంబేద్కర్ చౌరస్తా నుండి జగ్జీవన్ రామ్ చౌరస్తా వరకు నిర్వహించిన కృతజ్ఞతా ర్యాలీలో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తోపాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం, జిల్లా నగర కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి అరుణ్, లింగంపల్లి బాబు తదితరులు డప్పు వాయిద్యాలతో ర్యాలీగా వచ్చి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చింది, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందీ కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. అంతే కాకుండా తాజా కాంగ్రెస్ వల్ల ఎస్సీ వర్గీకరణ సాధ్యపడిందన్నారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు ఎదురు చూస్తున్న వర్గీకరణ కలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేయగలిగిందన్నారు. ఏళ్ల నాటి వర్గీకరణ పోరాటానికి తెరదించుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి అన్నిపక్షాలు మద్దతు తెలపడం సంతోషకరమన్నారు. సుదీర్ఘకాలంగా సాగుతున్న వర్గీకరణ పోరాటంలో ఎంతోమంది అసువులు బాసారని, వర్గీకరణ వల్ల ఎవరి వాటా ఎంతో తేల్చుతామని చేవెళ్ల ఎన్నికల మేనిఫెస్టోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున కర్గే లు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు కవ్వంపల్లి ధన్యవాదాలు తెలిపారు. వర్గీకరణకు మందకృష్ణ మాదిగ కాషాయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగంగానే ఆయన కాషాయం పార్టీ వైపు అడుగులేయడం కొంత ఆందోళన కలగించిందని, అయితే ఈ క్రమంలోనే వర్గీకరణకు ఇరు సభల ఆమోదం పొందాయన్నారు. 1994 నుంచి మాదిగల వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాన్ని గుర్తించడమే కాకుండా గౌరవిస్తామని, ఆయన పోరాటాలకు కవ్వంపల్లి కృతజ్ఞతలు తెలిపారు. మాదిగల జనాభా దామాషా ప్రకారం 11 శాతం వరకు రిజర్వేషన్ కొంతమంది కోరుతున్నారని, 2026 లో జనాభా లెక్కల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఆమోదించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, సబ్ కమిటీలో సభ్యులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబులతోపాటు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు, యావత్ దళిత జాతిపక్షాన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. దళితుడిని జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మాట తప్పిన పార్టీ బి ఆర్ ఎస్ అని ఆయన విమర్శించారు. 30 ఏళ్ల పోరాటం తర్వాత మాదిగల మాదిగ ఉపకులాల పోరాటం ఫలించిందని, ఇక అన్ని దళిత జెండాలు కాంగ్రెస్ పార్టీ గొడుగు కిందనే పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ నాయక్, కల్వల రామచందర్, సముద్రాల అజయ్, జీడి రమేష్, పోతారపు సురేందర్, దీకొండ శేఖర్ ,హస్తపురం రమేష్, మారంపల్లి లక్ష్మీనారాయణ, గాలి అనిల్ కుమార్, హస్త పురం తిరుమల, కాంపల్లి కీర్తి కుమార్, అహమ్మద్ అలీ, గజ్జల ఆనంద్, కుర్ర పోచయ్య, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ,పులి ఆంజనేయులు గౌడ్ ,విక్టర్, రాచకొండ ప్రభాకర్, సలీముద్దీన్, పులి కృష్ణ, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, సిరిపురం నాగప్రసాద్, షబానా మహమ్మద్, హనీఫ్, జ్యోతి రెడ్డి, పెద్ది గారి తిరుపతి ,బోనాల మురళి, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మైనార్టీ మోర్చ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, బండి సంజయ్ చిత్రపటాలకు పాలభిషేకం

**- మైనారిటీ సంక్షేమం కోసం 3350 కోట్లు కేటాయించడం సంతోషకరం బిజెపి మైనార్టీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్**



**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి6(ది క్రైమ్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బిజెపి మైనార్టీ మోర్చా జిల్లా శాఖ అధ్యక్షులు ఎండి . సమీపర్వెజ్ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, బండి సంజయ్ కుమార్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని, వికసి త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు గొప్ప శుభవార్త లాంటిదని, ముఖ్యంగా వేతన జీవులకు గొప్ప వరం లాంటిదన్నారు. అలాగే క్యాన్సర్ వంటి ఇతర తీవ్రమైన వ్యాధులకు సంబంధించిన 36 రకాల మందులను ప్రాథమిక కస్టం డ్యూటీ నుంచి మినహా యించడంతోపాటు ఆరు లైఫ్ సేవింగ్ మెడిసిన్స్ పై కస్టం డ్యూటీ ని ఐదు శాతానికి తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయడం అందుకు అవసరమైన మందులు చౌకగా ఉంటాయని మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటన చేయడం సంతోషకరమైన విషయమన్నారు. మొత్తం మీద మందుల జాబితాలో 36 రకాల ప్రాణాలు రక్షించే మందులు ఉండడం హెల్త్ సెక్టార్ ప్రజలకు ఊరటనిచ్చే విషయమన్నారు. బడ్జెట్లో రైతుల శ్రేయస్సు అభివృద్ధి కోసం ప్రయోజనం కలిగే కేటాయింపులు జరిగాయన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితి మూడు లక్షల నుండి 5 లక్షల వరకు పెంపు, పప్పు ధాన్యాల ఉత్పత్తికి సమృద్ధి పథకం, పండ్లు కూరగాయల ఉత్పత్తికి కొత్త పథకం ప్రారంభం చేయడం , పీఎం దన్ ధాన్య కృషి యోజన పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించడం లాంటివి రైతాంగానికి ఎంతో తోడ్పాటు లభించేలా ఉన్నాయన్నారు. మొత్తం మీద బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాలను పేద మధ్యతరగతి ప్రజలను సంతృప్తిపరిచే విధంగా ఉన్నాయని, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే, ముఖ్యంగా మైనారిటీ సంక్షేమం అభివృద్ధి కోసం 3350 కోట్లు కేటాయించడం సంతోషకరమని, చారిత్రకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ , ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బలబీర్ సింగ్, పార్లమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ బషీరుద్దీన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ తాజుద్దీన్, మొహమ్మద్ సిద్ధిక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సైజాద్, మొహమ్మద్ సమీ, సాబీర్,ఫసి, సైద్, బిజెపి రూరల్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అఫ్రోజ్, రవీందర్ పాల్ సింగ్, రాజ్ పాల్ సింగ్, ఇందర్ జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు..

# మానకొండూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలికా సాధికారత క్లబ్




**మానకొండూర్ (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకంలో భాగంగా పాఠశాలల్లోని విద్యార్థినిలకు కౌమారదశలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారిలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాలికా సాధికారత క్లబ్ సమావేశాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సమాజంలో కౌమార బాలికలకు ఎదురయ్యే పరిస్థితులు బాలికలపై శారీరకంగా, లైంగికంగా జరుగుతున్న దాడుల నుంచి రక్షణ, జీవన నైపుణ్యాలు, ఆర్థిక సాధికారత అంశాలపై చర్చించి, మహిళల ఆపదలో షీటీమ్స్ పనితీరు, ఆరోగ్య సూత్రాలను విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ బి. నళిని, స్థానిక మహిళా పోలీసులు, వైద్యాధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఏసిపి విచారణ



**ముత్తారం.ఫిబ్రవరి.06.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని ఓడేడ్ గ్రామంలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేస్ పై గోదావరిఖని ఏసిపి మడత రమేష్,ముత్తారం ఎస్ఐ గోపతి నరేష్‌తో కలిసిగురువారంవిచారణ చేపట్టారు. ఈనెల 4వ తేదీన ఓడేడు గ్రామానికి చెందిన దాసరి అఖిల్ సాయి దాసరి పురుషోత్తం తో గొడవ పడుతుండగా.అదే గ్రామానికి చెందిన భీముని నగేష్ గొడవజరిగేసమయంలోగొడవ వద్దంటూ ఇరువురిని విడదీశాడు. బుధవారం భీముని నగేష్ తన ఇంటి వద్ద ఉన్న సమయంలో దాసరి అఖిల్ సాయి ఫోన్ ద్వారా నగేష్ కు ఫోన్ చేసి మేము గొడవ పడుతున్న సమయంలో ఎందుకు గొడవ ఆపావు అంటూ కులం పేరుతో నగేష్ ను దూషించాడు. అనంతరం నగేష్ అఖిల్ సాయి ఇంటి వద్దకు వెళ్లి నన్ను ఎందుకు కులం పేరుతో దూషించావని అడగగా అఖిల్ సాయి కళ్ళు గీసే కత్తితో దాడికి దిగాడు. నగేష్ కు స్వల్పంగా గాయాలు కాగా నగేష్ భార్య భీముని కవిత దగ్గరలోని ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించింది. నగేష్ భార్య భీముని కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ గోపతి నరేష్ తెలిపారు.

## ఐదు సార్లు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్‌కి ఘన సన్మానం



**టేకుమట్ల, ఫిబ్రవరి 5:(ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ గోల్కొండ బిక్షపతి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకోని కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చే జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును అందుకోవటం జరిగింది. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు సంగి రవి ఆధ్వర్యంలో టీజీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ చిట్యాల ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తు రెండుసార్లు బేస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న గోల్కొండ బిక్షపతిని సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. దాదాపు 28 సంవత్సరాల సుదీర్ఘకాలంలో జగిత్యాల జిల్లా పెంబట్ల గురుకుల పాఠశాలలో టీజీటీగా 1994లో, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గురుకుల పాఠశాలలో పిజిటిగా 2004 లో, ములుగు జిల్లా జాకారం గురుకుల కళాశాల జూనియర్ లెక్చరర్ గా 2015లో, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల చిట్యాల ప్రిన్సిపాల్ గా 2020, 2025 సం,లలో రెండుసార్లు, మొత్తం ఐదు సార్లు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు తీసుకోవటం హర్షించదగినదని, మా పిల్లలకు ఇలాంటి ఉత్తమ ఉపాధ్యాయుడు దొరకడం గర్వకారణమని పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు సంగి రవి కొనియాడారు.ఎందరో విద్యార్థుల భావితరాలకు బాటలు వేసి తీర్చిదిద్ది అనునిత్యం పాఠశాల, కళాశాల అభివృద్ధికి కృషి చేస్తూ, పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ఉత్తమ ఫలితాలు తీసుకురావడానికి, పిల్లల ఉన్నత శిఖరాల అవరోధానికి దోహదపడుతున్న ప్రిన్సిపాల్ గోల్కొండ బిక్షపతికి పేరెంట్స్ కమిటీ మెంబర్స్ 'మీకు రుణపడి ఉంటామంటూ' కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ మెంబర్స్ మారపల్లి మల్లేష్, కన్నూరి రమేష్, కొలుగురీ సదానందం, సుంకరపల్లి భాస్కర్, దండ్రే రమేష్, సుంకరపల్లి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ముంజంపల్లిలో మాదిగ సోదరులకు డప్పులు అందించిన నందగిరి రవీంద్ర చారి



**మానకొండూర్(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి మాదిగ సంక్షేమంలో బాగంగా గ్రామంలోని మాదిగసోదరులకుతనవంతుసహకారంఅందించేందుకు గురువారం డప్పులను అందజేశారు.ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు మాట్లాడుతూ నిన్నటి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకై ఆమోదం తెలపి అండగా నిలవగా కాంగ్రెస్ నాయకుడైన నందగిరి రవీంద్ర చారి డప్పులు ఇచ్చి తమకు సహకారాన్ని అందించడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ బిడ్డలపై చూపిస్తున్న అభిమానానికి హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే కవ్వంపల్లికి, మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీకి మాదిగ బిడ్డల సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎస్సీ సెల్ నాయకులు అంబేద్కర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు తరపున మొదటి నామినేషన్ సెట్ దాఖలు




**కరీంనగర్,(ది క్రైమ్ న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు తరపున మొదటి నామినేషన్ సెట్ దాఖలు చేసిన కరీంనగర్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు పచ్చునూరి సురేందర్, ఎర్రం రాజిరెడ్డి, ముకుంద రెడ్డి, విజయ్, కేతన్ రావులు దాఖలు చేశారు. సురేందర్ గారు మాట్లాడుతూ పది తారీఖున భారిర్యాలీతో యాదగిరి శేఖర్ రావు నామినేషన్ దాఖలు చేస్తారని ఈ కార్యక్రమానికి ఉమ్మడి నాలుగు జిల్లాల పట్టభద్రులు ట్రస్మాబాధ్యులు సన్నిహితులు బంధువులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయ వలసిందిగా కోరారు.

# వేసవిలో త్రాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

## • త్రాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలను జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష త్రాగు నీటి సరఫరా పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా త్రాగు నీటి సరఫరా లో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, ఇబ్బందులు తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాబోయే వేసవి కాలంలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పై నివేదిక ముందుగానే అందించాలని కలెక్టర్ తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా వేసవి కాలంలో ప్రతి జన ఆవాసానికి పూర్తి స్థాయిలో త్రాగునీటి సరఫరా జరగాలని, దీనికి అనుబంధంగా ఎక్కడ ఇబ్బందులు రాకుండా ముందుగానే చెక్ చేసి పెట్టుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇంట్రాలో లీకేజీ, మరమ్మత్తు వంటి పనులు ఏవైనా ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఏదైనా ఆవాసాలకు గ్రిడ్ వాటర్ అందడం లేదా వంటి వివరాలను మండలాల వారీగా కలెక్టర్ తెలుసుకున్నారు. నీటిపారుదల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ నీటి వనరుల ప్రాజెక్టు లలో త్రాగు నీరు సరఫరాకు వీలుగా వాటర్ లెవల్స్ మెయింటైన్ చేయాలని, దీనికి సంబంధించి సమాచారం ఎప్పటికప్పుడు తనకు అప్డేట్ చేస్తూ ఉండాలని అన్నారు. త్రాగు నీటి సరఫరా సంబంధించి లీకేజిలు, పంప్ మరమ్మత్తు ఏవైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మిషన్ భగీరథ నిర్వహణకు సంబంధించి ఏవైనా పనులు చేపట్టాల్సి ఉంటే వెంటనే ప్రతిపాదించి ఈనెల 12 తారీఖు లోపు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో త్రాగునీటి సరఫరా ఏ ఆవాసాలకు ఇబ్బంది అవుతుంది వివరాలు తెలుసుకొని, అక్కడ చేపట్టాల్సిన చర్యల పై నివేదిక అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో త్రాగునీటి సరఫరా లీకేజీ లను ఎప్పటికప్పుడు అరి కట్టేలా చర్యలు తీసుకోవాలని, నీటి వృధాను నివారించాలని అన్నారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో సుల్తానాబాద్ మున్సిపాలిటీ పై సమీక్షిస్తూ పట్టణంలో పురోగతి లో ఉన్న 3 ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి నీళ్ళు తీసుకునేలా పనులను పూర్తి చేసి ఫిబ్రవరి 28 నాటికి వాటి నుంచి త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఈ ఈ ఇంట్రా గంగాధర శ్రీనివాస్ , ఈ ఈ గ్రిడ్ పూర్ణచందర్ , డి. ఈ లు , ఏ. ఈ .లు ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జల్సాలకై వృత్తిగా పెట్టుకొని దొంగతనాలకు పాల్పడ్డ దొంగ అరెస్ట్



**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** జల్సాలకై వృత్తిగా పెట్టుకొని దొంగతనాలకు పాల్పడ్డ దొంగను అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని ఎసిపి మడత రమేష్ తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఎసిపి మడత రమేష్ అరెస్ట్ వివరాలను వెల్లడిరచారు. పలు దొంగతనాల కేసుల్లో స్థానిక రమేష్ నగర్‌కు చెందిన ఐత వెంకటేష్ అనే దొంగను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి సంట్రో రెడ్ కలర్ కారు, రెండు మొబైల్ ఫోన్స్, 20వేల రూపాయల నగదు, 130 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంకటేష్ గత కొంతకాలంగా గోదావరిఖనిలోని తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్‌గా పెట్టుకొని మధ్యాహ్న సమయంలో తాళం వేసిన ఇండ్ల పరిసర ప్రాంతాలలో రెక్కి నిర్వహించి, రాత్రి సమయాల్లో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొంగతనాలు చేయడం వృత్తిగా పెట్టుకున్నాడని తెలిపారు. దొంగిలించిన సొమ్మును సరదాల కోసం విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో తిరుగుతూ డబ్బులను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ ఉంటాడని తెలిపారు. ఈ మధ్యకాలంలో దొంగతనాలు ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో మూడు క్రైమ్ టీమ్లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించే దొంగతనాలకు పాల్పడ్డ ఐత వెంకటేష్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. గత వారం రోజుల క్రితం మార్కండేయ కాలనీకి చెందిన రమేష్ అను వ్యక్తి తన బంధువులు చనిపోతే కుటుంబ సభ్యులతో ఇంటికి తాళం వేసి వెళ్లడంతో ఆ ఇంటి తాళం పగలగొట్టి అదే రాత్రి దొంగతనం చేసి 3 లక్షల 42 వేల రూపాయలు దొంగిలించాడని, ఆ డబ్బులతో హైదరాబాద్‌లో కారుకొని కారును రిపేరు చేయించుకొని జల్సాలు చేస్తున్నాడని, రెండు మొబైల్స్ కూడా కొన్నాడని, తన స్నేహితునికి అప్పుగా 20వేల రూపాయలు కూడా ఇచ్చాడని, కారును, రెండు మొబైల్స్‌ను తన స్నేహితునికి అప్పుగా ఇచ్చిన 20 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గత 15 రోజుల క్రితం అశోక్ నగర్ చెందిన పులిపాక స్వరూప ఇంట్లో దొంగతనం చేసి ఒక గ్యాస్ సిలిండర్, డబ్బులు దొంగిలించి జలసాలకు ఉపయోగించాడని,, ఇదే విధంగా గత ఏడు నెలల క్రితం మార్కండేయ కాలనీకి చెందిన తాళం వేసిన ఒక ఇంట్లో దొంగతనం చేసి బంగారు వెండి వస్తువులు దొంగిలించాడని, గత సుమారు 11 నెలల క్రితం ప్రశాంతి నగర్‌కు చెందిన ఒక తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం చేసి నాలుగున్నర తులాల బంగారం, 16 తులాల వెండి వస్తువులను దొంగతనం చేసి వాటిని అమ్ముకొని, వచ్చిన డబ్బులను జల్సాలకు వాడుకున్నాడని, ఇతన్ని టెక్నాలజీ సహాయంతో పట్టుకొని తాను దొంగిలించిన వస్తువులను కొంతవరకు రికవరీ చేయడం జరిగిందని, దీంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గతంలో కూడా 11



దొంగతనం కేసులలో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ఇంటికి తాళం వేసి ఎక్కెనా వెళు ్న సందర్భంలో మీ విలువైన వస్తువులను మీ వెంట గాని, బ్యాంకు లాకర్లో కానీ పెట్టుకోవాలని, అదేవిధంగా మీ ఇంటి పక్క వారికి, పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రజలు ఇండ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యమైన కూడళ్ల వద్ద, గల్లీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం కోసం తమ వంతు సహకారాన్ని అందించాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. నేరస్తుని చాకచక్యంగా టెక్నాలజీని ఉపయోగించి పట్టుకోవడంలో కృషి చేసిన సిఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, మధుసూదన్‌లకు ఎసిపి నగదు రివార్డులను అందజేసి అభినందించారు.

# నామినేషన్ వేసిన బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య...

## • ఉద్యోగ , ఉపాధ్యాయల వ్యతిరేక ప్రభుత్వాలుగా బి ఆర్ ఎస్, కాంగ్రెస్‌లు

## • జీతాలు తప్ప ఏ సౌకర్యాలు పొందలేని స్థితిలో ఉద్యోగ ఉపాధ్యా యులు

## • ఎమ్మెల్సీ బి ఆర్ ఎస్, కాంగ్రెస్ లకు అవకాశం ఇచ్చారు, ఒక్కసారి బీజేపీ కి అవకాశం ఇవ్వండి




**కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి6(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్, ఆదిలాబాద్ , నిజామాబాద్, మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీబిజెపి అభ్యర్థి మల్క కొంరయ్య కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేల సత్పతికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొంరయ్య మాట్లాడుతూ గత బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలుగా మారాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రెండు ఎకరాల ప్రభుత్వాలు ఘోరంగా విఫలమ య్యాయన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు కేవలం జీతాలు పొందుతున్నారే తప్ప ఏ సౌకర్యాలు పొందడం లేదన్నారు. ముఖ్యంగా ఉద్యోగ విరమణ చెందుతున్న ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యూటి, జిపిఎఫ్, సరెండర్ లీవ్ డబ్బులు, పిఆర్ సి ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. బి ఆర్ఎస్ , కాంగ్రెస్ ఎమ్మెల్సీలు ఏనాడు కూడా ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల కోసం కొట్లాడింది లేదు, శాసనమండలిలో మాట్లాడింది లేదన్నారు. ఆ రెండు పార్టీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇచ్చినందున జరగబోయే ఎన్నికల్లోబిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుక నవుతానన్నారు. అనంతరం కరీంనగర్లోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కరీంనగర్ బిజెపి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, శాంతి కుమార్ , జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు మాట్లాడారు. జరగబోయే ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాల పై తగిన సూచనలు చేస్తూ, దిశానిర్దేశం చేశారు. నామినేషన్ కార్యక్రమంలో మాజీ టీచర్స్ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంత రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, నిజామా బాద్ జిల్లా మాజీ అధ్యక్షులు బసవ లక్ష్మీ నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శితాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నాంపల్లి శ్రీనివాస్, నరహరి లక్ష్మారెడ్డి , దండు కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# షేక్ సాబీర్ అలీ, కాటిపల్లి రాజు అరెస్ట్..

## - సామాజిక కార్యకర్త ముసుగులో పలు అక్రమాలు...

## - చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసినా శిక్ష తప్పదు..

**జమ్మికుంట ఫిబ్రవరి 6 (ది క్రైమ్ న్యూస్):** మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లికి చెందిన షేక్ సాబీర్ అలీ, కాటిపల్లి రాజు ని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వర గంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, ఎండి అరిఫుద్దీన్ అనే వ్యక్తి తనకు ఉండబడిన సర్వేనెంబర్ 464 లోని ప్లాట్ నెంబర్ 4 భూమి విషయంలో కాటిపల్లి రాజు కాటిపల్లి సంధ్య కాటిపల్లి లక్ష్మి అక్రమంగా ప్రవేశించి ఎలాంటి పత్రాలు లేకుండా అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి దొంగ డాక్యుమెంట్లు తయారుచేసి ఆ స్థలంలో టెంటు వేసుకొని నిరాహార దీక్ష చేస్తున్నారని ఫిర్యాదు చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరికి మద్దతుగా సామాజికవేత్త ముసుగులో షేక్ సాబీర్ అలీ కాటిపల్లి రాజు అనే వ్యక్తులు భూ యజమానిని భయభ్రాంతులకు గురి చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలే లక్ష్యంగా సామాజికవేత్త ముసుగులో ఎన్నో అక్రమాలు చేసిన షేక్ సాబీర్ అలీపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. సామాజికవేత్త ముసుగులో అక్రమాలకు పాల్పడుతూ న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న షేక్ సాబీర్ అలీ, తనది కాని భూమిపై కబ్జాకు ప్రయత్నించిన కాటిపల్లి రాజు పై పలు ఫిర్యాదులు రావడంతో కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ పేర్కొన్నారు. తనకు సంబంధం లేని ఒక భూ వివాదంలో తల దూర్చి భూ యజమానిని ఇబ్బందులకు గురి చేస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేయడంతో బాధితులు ఫిర్యాదు చేశారని గతంలో కూడా జమ్మికుంట పోలీస్ స్టేషన్లో షేక్ సాబీర్ అలీ, కాటిపల్లి రాజు ల పలు కేసులు ఉన్నాయని ఇలాంటి వారు సమాజంలో ఉండడం శ్రేయస్కరం కాదని సిఐ తెలిపారు. చట్ట వ్యతిరేక పనులు ఎవరు చేసిన చట్టం తన పని తాను చేసుకు పోతుందని ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఇలాంటివారిని ఉపేక్షించేది లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ద

# ఇలాంటి ఛాతీ నొప్పిని నమ్మితే డేంజర్..!

## అది ప్రాణాంతక గుండె జబ్బులకు సంకేతం కావొచ్చు..!

హార్ట్ ఎటాక్, గుండెపోటు ప్రస్తుతం ఇలాంటి ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ రోజుల్లో చాలా మంది గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. కానీ, మన శరీరంలో ఈ గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన కొన్ని సంకేతాలు ముందుగానే కనిపిస్తాయని, వాటిని మనం పెద్దగా పట్టించుకోకపోవటం వల్లే గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. కానీ, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాలకు ముందు కనిపించే లక్షణాలు, సంకేతాలలో ఛాతీ నొప్పి ఒకటి. అయితే, మనలో చాలా మందికి ఛాతీ నొప్పి అనిపిస్తుంది.. కానీ, కొన్ని రకాల చాతీ నొప్పి ప్రమాదం అంటున్నారు నిపుణులు. ఇలాంటి చాతి నొప్పి కొన్నిసార్లు అకస్మాత్తుగా చాలా తీవ్రంగా మారుతుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. అలాగే, కొన్నిసార్లు ఇది తక్కువ వ్యవధిలో జరుగుతుంది. తేలికపాటిగా వచ్చిపోతుంది.. నొప్పితో పాటు, కొందరికీ ఛాతీలో మంటగా అనిపిస్తుంది. అయితే, కొన్ని రకాల ఛాతీ నొప్పి గుండె జబ్బులకు సంకేతం కావచ్చు.. దానిని విస్మరిస్తే అది ప్రాణాలకే ప్రమాదం అవుతుంది. ప్రస్తుతం గుండె సంబంధిత వ్యాధుల కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గుండె జబ్బుల విషయంలో శరీరంలో కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. ఈ సంకేతాలను గుర్తించడం ద్వారా సమయానికి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.. అందులో భరించలేనంతగా వచ్చే ఛాతీ నొప్పి చిన్నదే. దీంతో పెద్దగా ముప్పు ఏమీ ఉండదు. కానీ కొన్ని సందర్భాల్లో నొప్పి మెడ, దవడకు, తరువాత వెనుకకు లేదా కిందకి, ఒకటి లేదా రెండు చేతులకు వ్యాపిస్తుంది. మీరు ఈ రకమైన నొప్పిని అనుభవిస్తున్నట్లయితే, దానిని అస్సలు విస్మరించకూడదని వైద్య ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఈ నొప్పి గుండె సంబంధిత సమస్యలకు ప్రత్యక్ష కారణం కావచ్చునని చెబుతున్నారు. వీటిని నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. అటువంటి పరిస్థితిలో, వివిధ రకాల ఛాతీ నొప్పి, దానితో సంబంధం ఉన్న వ్యాధుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. గుండె సంబంధిత ఛాతీ నొప్పి.. నిపుణుల ప్రకారం.. ఛాతీ నొప్పి సాధారణంగా గుండె జబ్బులతో ముడిపడి ఉంటుంది. అయితే గుండె జబ్బులు ఉన్న చాలా మంది వ్యక్తులు తేలికపాటి అసౌకర్యాన్ని అనుభవిస్తుంటారు. వారు వాస్తవానికి నొప్పిని వర్ణించలేరు. అటువంటి పరిస్థితిలో గుండెపోటు లేదా ఏదైనా ఇతర గుండె సమస్య కారణంగా ఛాతీ అసౌకర్యానికి గురవుతుంటారు. ఈ క్రింది లక్షణాలు ఉంటే విస్మరించకండి.. వికారం లేదా వాంతులు చల్లని చెమట శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది మైకము లేదా బలహీనత ఛాతీలో ఒత్తిడి, భారం, దహనం లేదా బిగుతు వెన్ను, మెడ, దవడ, భుజాలు, ఒకటి లేదా రెండు చేతులను నలిపివేస్తున్నట్టుగా, కత్తితో పొడిచేస్తున్నట్టుగా నొప్పి నొప్పి కొన్ని నిమిషాల కంటే ఎక్కువ ఉంటుంది. చర్యతో మరింత తీవ్రమవుతుంది, కొంతకాలం తర్వాత వెళ్లి తిరిగి వస్తుంది. ఇతర రకాల ఛాతీ నొప్పి.. ఛాతీలో నొప్పి గుండెకు సంబంధించినదా లేక మరేదైనా కారణమా అని చెప్పడం కష్టం. అటువంటి పరిస్థితిలో మీరు దానిని గుర్తించడం ద్వారా నొప్పిని గుర్తించవచ్చు. సాధారణంగా, మీరు ఈ క్రింది లక్షణాలను అనుభవిస్తే గుండె సమస్య కారణంగా ఛాతీ నొప్పి వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. మింగడానికి ఇబ్బందిగా ఉంటుంది. నొప్పి ఎక్కువ సమయం ఉంటుంది. మీరు మీ శరీర స్థితిని మార్చినప్పుడు తగ్గిపోవటం గానీ, లేదంటే మరింత తీవ్రంగా గానీ, మారుతుంది. పుల్లని రుచి లేదా ఆహారం నోటిలోకి తిరిగి రావడం గుండెల్లో మంట క్లాసిక్ లక్షణాలు రొమ్ము ఎముక వెనుక బాధాకరమైన, మండే అనుభూతి కలుగుతుంది. గుండె లేదా కడుపు సమస్యల వల్ల సంభవించవచ్చు.

# మాంసాహారం ఎక్కువగా తినేవారిలో ఈ క్యాన్సర్ ముప్పు ఎక్కువ!

మాంసం తినేవారికి కొలొరెక్టల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన సవాలు, వైద్య పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ జీర్ణవ్యవస్థలోని ప్రధాన అవయవాలను ప్రభావితం చేస్తుంది. ఇది పోషకాలను గ్రహించడంలో, కడుపు నుండి వ్యర్థాలను తొలగించడంలో జోక్యం చేసుకుంటుంది. కొన్ని ప్రమాద కారకాలు ఈ క్యాన్సర్‌తో సంబంధం కలిగి ఉంటాయి. మాంసాహారం ఎక్కువగా తినడం వల్ల పెద్దపేగు క్యాన్సర్ కూడా వస్తుంది. తగినంత వ్యాయామం చేయకపోవడం, స్థూలకాయంగా ఉండటం, ఆల్కహాల్ లేదా పొగాకు తాగడం, పండ్లు, కూరగాయలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ఫైబర్, కొవ్వు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వంటివి పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ముఖ్యంగా రెడ్ మీట్ లేదా ప్రాసెస్ చేసిన మాంసాన్ని దీర్ఘకాలికంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మాంసాలను అధిక ఉష్ణోగ్రతల వద్ద వండినప్పుడు, అవి క్యాన్సర్ కారక రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. సమతుల్య ఆహారం, వ్యాయామం, ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్‌ను నివారించవచ్చు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలు: మలబద్ధకం, విరేచనాలు, మలంలో రక్తం, మలవిసర్జన సమయంలో కడుపునొప్పి, రక్తహీనత, అలసట, బరువు తగ్గడం వంటివి పట్టించుకోవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెద్దప్రేగు క్యాన్సర్ లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా, వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చు.

# పుచ్చగింజల్ని వృద్ధాగా పారేస్తున్నారా? ఈ విషయం తెలిస్తే భద్రంగా దాచేస్తారు..

వేసవిలో పుచ్చకాయలు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి. రుచితోపాటు వేసవి తాపాన్ని నివారించడంలో పుచ్చకాయలు ఉపయోగపడతాయి. అయితే పుచ్చ కాయ విత్తనాలు వృద్ధాగా పారేస్తున్నారా? ఇకపై అలా చేయకండి. ఎందుకంటే పుచ్చకాయ మాదిరిగానే దాని గింజల్లో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. పుచ్చకాయ గింజలను బయటకు తీసి నీటితో బాగా శుభ్రం చేయాలి. తర్వాత వీటిని పొట్టు తీసి ఎండలో బాగా ఆరబెట్టాలి. ఒలిచిన పుచ్చకాయ గింజలు కూడా మార్కెట్‌లో దొరుకుతాయి. జర్నల్ ఆఫ్ ఫార్మాకోగ్నోసి అండ్ ఫైటోకెమిస్ట్రీలో ప్రచురించబడిన పరిశోధన ప్రకారం.. పుచ్చకాయ విత్తనాలను (క్షయవ్యాధి) చికిత్సలో ఉపయోగిస్తారు. ఊపిరితిత్తులలో బ్యాక్టీరియా చేరడం వల్ల దగ్గు సంభవిస్తుంది. మీకు కూడా దగ్గు ఉంటే ఈ గింజలు తీసుకోవచ్చు. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా పుచ్చ విత్తనాలు ఎంతో మేలు చేస్తాయి. పుచ్చకాయ గింజలు మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలోనూ సహాయపడతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కిడ్నీలలో ఏర్పడే రాళ్లను నియంత్రిస్తుంది. మూత్రపిండాలపై ఒత్తిడిని నివారిస్తుంది. పుచ్చకాయ గింజల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది నరాల, కండరాల సంకోచంలో సహాయపడుతుంది. ఈ పండు గింజలు గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి కూడా సహాయపడతాయి.


# బ్యూటీ

# డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టు పెట్టే సూపర్ ఫుడ్ !..



**రోజూ ఇలా ట్రై చేయండి.**

క్వినోవా అనేది పోషకాలను సమృద్ధిగా కలిగి ఉన్న శక్తివంతమైన ధాన్యం. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికా దేశాల్లో ఉత్పత్తి అవుతూ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్నేహితుల ఆహార జాబితాలో కీలకంగా మారింది. ఇది ప్రోటీన్లకు గొప్ప మూలంగా ఉండటమే కాకుండా, గ్లూటెన్-ఫ్రీ ఫుడ్ కావడం వల్ల చాలా మంది ఆరోగ్య పరంగా దీన్ని తమ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. దీన్ని ఆహారంగా చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్వినోవా యొక్క ప్రయోజనాలు: క్వినోవాలో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది శాకాహారులు మరియు శాఖాహారులకు ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది . మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. క్వినోవాలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ %దీ% వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ధాన్యంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. క్వినోవా గ్లూటెన్ రహితమైనది, కాబట్టి ఇది ఉదరకుహర వ్యాధి లేదా గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది మనకు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన మనం తక్కువ ఆహారం తీసుకుంటాము మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్వినోవాలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్వినోవాలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది , డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని అన్నం లాగా వండుకోవచ్చు లేదా సలాడ్లు, సూప్‌లు, స్మూతీలలో కూడా ఉపయోగించవచ్చు. దీనిని పిండిగా కూడా ఉపయోగించి రొట్టెలు, ఇతర బేక్ చేసిన వస్తువులను తయారు చేయవచ్చు. ఇది పోషకమైన ఆరోగ్యకరమైన ఆహారం. దీనిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## చెడు కొవ్వు కరిగించే ఈ కూరగాయలు తినండి... రిజల్ట్ మీరే చూడండి!

బరువు తగ్గాలని భావించేవారు బరువు తగ్గటం కోసం ఏం తినాలి? ఏం తినకూడదు అనేది కచ్చితంగా తెలుసుకోవాలి. ఇటీవల కాలంలో బరువు తగ్గటం కోసం చాలా మంది రకరకాల డైట్‌లను ఫాలో చేస్తున్నారు. అయితే బరువు తగ్గాలంటే, సులభంగా బరువు తగ్గించే ఆహారాలను తినాలని కొందరు డైటీషియన్స్ చెప్తున్నారు. అయితే బరువుకు చెక్ పెట్టటంలో కొన్ని కూరగాయల పాత్ర చాలా ఉంటుందని అంటున్నారు. దోసకాయ దోసకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. దోసకాయలలో ఫైబర్ అధికంగా ఉండటం కారణంగా ఇది బరువు తగ్గటానికి బాగా ఉపయోగపడుతుంది. దోసకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మన కడుపు నిండిన ఫీలింగ్ కలిగిస్తుంది. దోసకాయలు ఆకలిని తగ్గిస్తాయి. ఇవి మన బరువును నియంత్రణలో ఉంచుతాయి. సొరకాయ సొరకాయలో కూడా బరువును తగ్గించే బోలెడు పోషకాలు ఉంటాయి. సొరకాయలో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. సొరకాయను కూడా మనం ఆహారంలో భాగంగా చేసుకుంటే బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. సొరకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువ.. ఇది మన ఆకలిని తగ్గిస్తుంది. దీంతో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. పుచ్చకాయ పుచ్చకాయ బరువు తగ్గటానికి ఎంతగానో దోహదం చేస్తుంది. పుచ్చకాయలో కూడా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. పుచ్చకాయలో విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇది జీవక్రియను పెంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయ గింజల్లో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ తో పాటు బోలెడు పోషకాలు ఉంటాయి. ఇవి కడుపు నిండుగా ఉండేలా చేయడంతో, ఆకలిని తగ్గించడంలో సహాయపడతాయి. ఫలితంగా ఇవి మన బరువును తగ్గిస్తాయి. గుమ్మడికాయ గుమ్మడికాయలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి గుమ్మడికాయ మన బరువు తగ్గడానికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది ఇందులో ఫైబర్ నీరు అధికంగా ఉండడం వల్ల మన కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది గుమ్మడికాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ఇది మన బరువును తగ్గించడానికి దోహదం చేస్తుంది. వీటితో కూడా బరువు తగ్గొచ్చు ఇక ఇవి మాత్రమే కాదు బ్రోకలీ, క్యాబేజీ, క్యాలీ ఫ్లవర్, పాలకూర, పుట్ట గొడుగులు కూడా మన ఆకలిని తగ్గించి మనం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. కనుక పై ఆహారాలు మీ భోజనంలో భాగం చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది.

## పండ్లు తింటేే ఆరోగ్యమని అతిగా తింటున్నారా? అయితే జాగ్రత్త!



చాలామంది పండ్లను ఇష్టంగా తింటారు. పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటామని భావించి ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పండ్లను తమ ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. అయితే పండ్లు తింటే ఆరోగ్యం వస్తుందన్నమాట వాస్తవమే అయినప్పటికీ అతిగా పండ్లు తినడం మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. పండ్లను అతిగా తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పండ్లు ఎక్కువ తింటే ఏమవుతుంది పండ్లలో సహజంగానే చక్కెరలు, క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటామని భావించి వీటిని అతిగా తింటే బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు విపరీతంగా పండ్లు తింటే పండ్లలో ఉండే చక్కెర శరీరంలో డయాబెటిస్ ను పెంచుతుందని డయాబెటిస్ బాధితులుగా మారే ప్రమాదం ఉంటుందని కూడా హెచ్చరిస్తున్నారు. అతిగా పండ్లు తింటే ఈ అనారోగ్య సమస్యలు చాలామంది అన్నం తినడం మానేసి పండ్లను ఎక్కువగా ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. పండ్లలో చక్కెర, పీచు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా డయాబెటిస్ ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంటుందని జీర్ణ వ్యవస్థకు సంబంధించి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కడుపు ఉబ్బరం, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు అందుకే పండ్లు తినాలి అనుకునేవారు రోజుకు ఎన్ని పండ్లు తినాలనేది కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రతిరోజూ ఇన్ని పండ్లు మాత్రమే తినాలి పండ్లు ఇష్టంగా తినేవారు ప్రతిరోజు మూడు నుంచి నాలుగు మాత్రమే పండ్లు తినాలి. 500 గ్రాములలోపు పండ్లను మాత్రమే తినవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంతకంటే ఎక్కువ మొత్తంలో పండ్లను తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. కనుక పండ్లు తినాలి అని భావించేవారు మితంగానే పండ్లు తినాలని గుర్తుంచుకోవాలి. ఇక పండ్ల జ్యూస్ లను చేసుకుని ఎక్కువగా తాగే వారు కూడా డయాబెటిస్ బాధితులుగా మారతారని హెచ్చరిస్తున్నారు. పండ్ల జ్యూస్ లు ఎక్కువగా తాగితే మంచిది కాదు... జాగ్రత్త పోషకాల పరంగా చూస్తే పండ్లను జ్యూస్ గా చేసి తాగడం వల్ల వాటిలో 60 శాతం యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయని ఇక పండ్లను జ్యూస్ గా చేసుకుని తాగే కంటే నేరుగా తినడం మంచిదని చెబుతున్నారు. కనుక పండ్లు అతిగా తినేవారు తప్పక మీ ఆలోచన మార్చుకోవాల్సిందే. అలా కాకుండా విపరీతంగా పండ్లను తింటే మాత్రం అనవసరమైన అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

## ఆలివ్ ఆయిల్ వాడుతున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి!

ఆలివ్ ఆయిల్ అనేది ఆలివ్ పండ్ల నుండి తీయబడిన ఒక రకమైన వంట నూనె. ఇది మధ్యధరా ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను చేకూరుస్తుంది, కానీ కొన్ని సందర్భాల్లో ఇది దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుంది. ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా లేదా తప్పుగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు కలిగిస్తుంది. ప్రతి రోజూ ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుందాం.. 1. అలర్జీ ప్రతిచర్యలు: కొంతమందికి ఆలివ్ ఆయిల్‌కు అలర్జీ ఉండవచ్చు. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఒకవేళ మీకు ఆలివ్ ఆయిల్ తీసుకున్న తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే దానిని తీసుకోవడం ఆపేసి వైద్యుని సంప్రదించాలి. 2. జీర్ణ సమస్యలు: ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు కలుగుతాయి. ఆలివ్ ఆయిల్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, జీర్ణ సమస్యలు ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది. 3. చర్మ సమస్యలు: ఆలివ్ ఆయిల్ అన్ని రకాల చర్మాలకు సరిపోదు. ముఖ్యంగా జిడ్డు చర్మం కలిగినవారు ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా వాడటం వల్ల మొటిమలు వచ్చే అవకాశం ఉంది. ఆలివ్ ఆయిల్‌లో ఒలియిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మం యొక్క సహజ నూనెలను తొలగించగలదు, దీనివల్ల చర్మం పొడిబారవచ్చు. కాబట్టి, మీ చర్మ తత్వాన్ని బట్టి ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం మంచిది.



# మార్కెట్


## టెక్ మహీంద్రా సూపర్ జాబ్..

**హైదరాబాదీలకు రూ.15 లక్షల ప్యాకేజ్ ఆఫర్, డోన్ట్ మిస్..**




రెండు తెలుగు రాష్ట్రాల నుంచి యువత ఎక్కువగా ఐటీ ఉద్యోగం కోసమే బీటెక్ చేస్తున్నారు. ప్రధానంగా తెలుగు ప్రజలు మంచి ఆదాయవనరుగా భావించటంతో పాటు సమాజంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అధిక గౌరవం దక్కటం కూడా చాలా మందిని ఈ రంగంలో ఉపాధి పొందేందుకు ప్రేరేపిస్తోంది. ఐటీ బూమ్ ప్రధానంగా ఉపయోగించుకున్న వారిలో తెలుగు ప్రజలు కూడా ముందు వరుసలోనే ఉన్నారు. చాలా మంది విదేశాల్లో ఉద్యోగాలు సంపాదించి అక్కడే స్థిరపడగా.. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం హైదరాబాదు కూడా ఐటీ పరిశ్రమకు కేంద్ర బిందువుగా మారుతున్న వేళ ఇక్కడ కూడా మంచి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. "జెన్‌ఫ్యాక్ట్ లో జాబ్స్.. డిగ్రీ ఉంటే చాలు.. రెజ్యూమ్ రెడీ చేసుకోండి.. " తాజాగా టాప్ ఐటీ కంపెనీల్లో ఒకటిగా ఉన్న టెక్ మహీంద్రా హైదరాబాదులో డాట్‌నెట్, ఫుల్‌స్టాక్ లీడ్ కోసం నియామకాన్ని చేపడుతోంది. దీనికోసం కంపెనీ 7 నుంచి 10 సంవత్సరాలు వర్క్ అనుభవం కలిగి ఉండాలని వెల్లడించింది. ఎంపికైన ఉద్యోగికి రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల ఆఫర్ చేస్తోంది. అయితే ఉద్యోగి బాధ్యతల్లో భాగంగా దేశంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ల అభివృద్ధి, మెరుగుపరచటం, నిర్వహించాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. బాధ్యతలను పరిశీలిస్తే.. ప్రాజెక్ట్ అవసరాలను అర్థం చేసుకుని అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలుగా అనువదించడానికి క్రాస్-ఫంక్షనల్ బృందాలు, వ్యాపార వాటాదారులతో పనిచేయాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. అలాగే స్కేలబుల్, హై క్వాలిటీ సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను రూపొందించడానికి, అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు సాఫ్ట్‌వేర్ లోపాలను సకాలంలో పరిష్కరించాల్సి ఉంటుందని టెక్ మహీంద్రా వెల్లడించింది. టార్గెట్ కి అనుకూలంగా సకాలంలో పూర్తి చేసేందుకు ఉద్యోగి కట్టుబడి ఉండాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

## మిడిల్ క్లాస్ వాళ్ళకి రిలీఫ్ ఉంటుందా..? రేపే ఆర్‌బిఐ రెపో రేటు ప్రకటన..!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ సమావేశం ఈరోజు (ఫిబ్రవరి 6) రెండవ రోజుకు చేరుకుంది. అయితే కీలక వడ్డీ రేట్లపై కమిటీ సభ్యులు చర్చించారు, దేశీయ ద్రవ్య పరిస్థితులను పరిష్కరించడానికి అలాగే రూపాయి అస్థిరతను తగ్గించడానికి తీసుకునే చర్యలతో పాటు ఈ నెలలో 25 బేసిస్ పాయింట్ల కోతను ప్రకటించే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు తెలిపారు. ముఖ్యంగా కొత్తగా నియమితులైన గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ఇది మొదటి పాలసీ సమావేశం. డిసెంబర్ ప్రారంభంలో మాజీ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్థానంలో రాబోయే 3 సంవత్సరాలకు రిజర్వ్ బ్యాంకు 26వ గవర్నర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. "బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. " బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఫిబ్రవరి 7న జరుగనున్న ద్రవ్య విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వల్ల ఆర్బీఐ ఈ నిర్ణయాన్ని పరిగణించవచ్చని నివేదిక సూచించింది. ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గింపు గత కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణం స్థాయి తగ్గుముఖం పట్టాయని నివేదిక పేర్కొంది. టమోటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి ముఖ్యమైన కూరగాయల ధరలు తగ్గడం వల్ల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ స్థిరపడింది.దీంతో మెరుగైన సప్లయ్ కారణంగా ధరల అస్థిరత తగ్గింపుకు దారితీసింది, ఇది వడ్డీ రేట్లను తగ్గించడానికి అవకాశాన్ని అందిస్తుంది. అయితే, ఈ ప్రక్రియ దశలవారీగా జరుగుతుంది అలాగే ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచ %ఎ% దేశీయ అంశాల ప్రభావం ద్రవ్య విధానంపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆర్‌బిఐ అనేక ప్రపంచ, దేశీయ సవాళ్లను దృష్టిలో ఉంచుకోవాలి. నివేదిక ప్రకారం, ఇటీవలి కాలంలో ఆర్థిక మార్కెట్లలో అస్థిరత పెరిగింది, ఇది భారత రూపాయిని ప్రభావితం చేసింది. అమెరికా, కెనడా, మెక్సికో సహా చైనా వంటి దేశాలు విధించే సుంకాల పెంపుదల, వాణిజ్య విధానాల కారణంగా ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతోంది. అమెరికా డాలర్ బలపడటం భారత కరెన్సీపై ఒత్తిడి పెంచింది. "స్టాక్ షాపింగ్.." దేశీయ బ్యాంకింగ్ అండ్ ఆర్థిక పరిస్థితులు దేశీయ ద్రవ్యత పరిస్థితులు కూడా సవాలుగా ఉన్నాయి. బ్యాంకులు డిపాజిట్ వృద్ధి మందగమనం ఎదుర్కొంటున్నాయి, ఇది క్రెడిట్ ప్రవాహాన్ని ప్రభావితం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో కార్పొరేట్ ఫలితాలు మార్కెట్లో డిమాండ్ స్థిరంగా లేదని చూపిస్తున్నాయి, దీనితో పాటు తయారీ రంగం గ్రాస్ వాల్యూ యాడెడ్ లో కూడా మందగమనం కనిపిస్తుంది. ఆర్‌బిఐ వ్యూహం ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఆర్‌బిఐ బ్యాలెన్స్‌డ్ విధానాన్ని అవలంబించి రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని నివేదిక సూచిస్తుంది. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం దీని లక్ష్యం. భవిష్యత్తులో రిజర్వ్ బ్యాంకు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తగిన పాలసీ నిర్ణయాలు తీసుకునేలా జాగ్రత్తగా ఇంకా డేటా ఆధారిత విధానాన్ని అవలంబిస్తుంది.

## అమ్మకాల ఒత్తిడి స్టాక్ మార్కెట్ మళ్లీ ఢమాల్..

**కుప్పకూలిన స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ కంపెనీల స్టాక్స్..**

నేడు అమ్మకాల ఒత్తిడి కారణంగా స్టాక్ మార్కెట్ మరోసారి క్షీణతతో ముగిసింది. ట్రేడింగ్ సమయంలో స్మాల్ క్యాప్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 213.12 పాయింట్లు లేదా 0.27% తగ్గి 78,058.16 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ కూడా 69.60 పాయింట్లు లేదా 0.29% తగ్గి 23,626.70 పాయింట్లకు చేరుకుంది. పడిపోయిన భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్ షేర్లు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 30 షేర్ల సెన్సెక్స్‌లో 20 షేర్లు క్షీణతతో అలాగే 10 షేర్లు పెరుగుదలతో ముగిశాయి. ఇందులో భారతీ ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 2.47% తగ్గి ఒక్కో షేరు ధర రూ.1619.55కి చేరుకుంది. అయితే, అదానీ పోర్ట్స్ షేర్లు 1.72% పెరిగి ఒక్కో షేరు ధర రూ.1163.95 వద్ద ముగిశాయి. అదే సమయంలో %ఔ% నిఫ్టీలోని 50 షేర్ల ఆధారంగా 31 షేర్లు రెడ్ మార్కులో 20 షేర్లు గ్రీన్ మార్కులో ముగిశాయి. ఇందులో టాటా గ్రూప్ కంపెనీ ట్రెంట్ స్టాక్ అత్యధికంగా 8.36% తగ్గి ఒక్కో షేరుకు రూ.5269కి చేరుకోగా, ఫార్మాస్యూటికల్ కంపెనీ సిప్లా స్టాక్ 2.51% లాభంతో రూ.1472.80 వద్ద ముగిసింది. "బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. " ఇతర ఆసియా మార్కెట్లు ఆసియాలోని ఇతర ప్రధాన మార్కెట్ల గురించి మాట్లాడుకుంటే, జపాన్‌కు చెందిన నిక్కీ 225, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్, దక్షిణ కొరియాకు చెందిన కోస్పి, చైనాకు చెందిన షాంఘై కాంపోజిట్ లాభాలతో ముగిశాయి.

# కష్టాలు వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలి

### కావాలనే వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు

### లిక్కర్ కేసులో మిథున్‌రెడ్డికి ఏం సంబంధం

### విలేకరుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్



అమరావతి : కష్టాలు అందరికీ వస్తాయి, కానీ కష్టాలు తట్టుకుంటేనే ఇంకా రెట్టింపు మంచి రోజులు వస్తాయని ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. వైసీపీ రాజ్యసభ సభ్యులు పార్టీని వీడటం సహా.. పార్టీ నేతలు, కార్యకర్తలపై నమోదవుతున్న కేసులపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తమ పార్టీ నేతలపై చంద్రబాబు సర్కార్ తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. అంతేకాదు.. లిక్కర్ విషయంలో మిథున్ రెడ్డి పేరును తీసుకురావడంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. లిక్కర్ కేసులో మిథున్ రెడ్డికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. మిథున్ రెడ్డి తండ్రి ఏ శాఖ మంత్రి.. ఆయనకు మద్యానికి సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. ఎవరో ఒకరిని ఇరికించడం, కేసు పెట్టడం ద్వారా వైసీపీని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని జగన్ ఆరోపించారు. 'ఎవరైనా డబ్బులు ఎందుకు ఇస్తారు.. మద్యం రేట్లు మేము పెంచామా.. మద్యం బేసిక్ రేట్లు పెంచి.. సరఫరా తగ్గించినందుకు నాకు లంచాలు ఇస్తారా.. రేట్లు పెంచి సరఫరా పెంచిన చంద్రబాబుకు మామూళ్లు ఇస్తారా.. నాలాగా ఎందుకు చంద్రబాబు బటన్ నొక్కలేకపోతున్నారు.. నాకు డబ్బుపై వ్యామోహం లేదు.. అందుకే డీబీటీలో రెండున్నర లక్షల కోట్లు ఇచ్చాం.' అని వైఎస్ జగన్ తాను చేసిన పనులను చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో వైసీపీని వీడుతున్న రాజ్యసభ సభ్యుల అంశాన్ని జగన్ ప్రస్తావించారు. ముఖ్యంగా.. విజయసాయి రెడ్డి అంశాన్ని పేర్కొన్నారు. 'వైసీపీ నుంచి బయటకు వెళ్లే ప్రతి రాజ్యసభ సభ్యుడికి విశ్వసనీయత ఉండాలి. ప్రలోభాలకు లొంగో.. భయపడో లేక రాజీపడో అటు పోతే.. విశ్వసనీయత సంగతేంటి.. రాజకీయాల్లో కష్టాలు ఉంటాయి. ఐదేళ్లు కష్టపడితే మన టైమ్ వస్తుంది. విశ్వసనీయత ముఖ్యం. ఇది విజయసాయిరెడ్డికైనా మిగతా వారికైనా వర్తిస్తుంది.' అని జగన్ అన్నారు. ఇక అసెంబ్లీకి రావడంపైనా జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి వస్తే తమకు మాట్లాడే సమయం ఇస్తారా? అని జగన్ ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎంకు ఎంత సమయం ఇస్తారో తమకూ అంతే సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి వెళ్లేది లేదని తేల్చి చెప్పారు జగన్. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తరువాత జగన్ అసెంబ్లీ ముఖం చేసింది లేదు. వైసీపీ తరఫున 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే గెలుపొందడం.. అసెంబ్లీలో అధికారపక్షాన్ని ఎదుర్కోలేమోననే భయంతో.. జగన్ అసెంబ్లీకి రావడం లేదు. అసెంబ్లీకి రాకుండా ఉండేందుకు.. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగు పెడతామంటూ మెలిక పెట్టి కూర్చున్నారు జగన్. వాస్తవానికి ఆయన పార్టీ గెలిచిన ఎమ్మెల్యేల లెక్క ప్రచారం అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా రాదు. అయినప్పటికీ తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని జగన్ కోరడం.. రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

## ఏపీ ప్రబలుతున్న వింత వ్యాధి

అమరావతి : తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కోళ్లలో ప్రస్తుతం ఒక వింత వ్యాధి వ్యాపిస్తోంది. దాదాపు 4 లక్షల కోళ్లు ప్రభావితమయ్యాయి. సమాచారం అందుకున్న పశువైద్య శాఖ అధికారులు కోళ్ల ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. కోళ్ల నుండి రక్త నమూనాలను సేకరించి విజయవాడ, భోపాల్‌లోని పరీక్షా కేంద్రాలకు పంపారు. గత మూడు వారాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి ప్రాంతంలో తెలియని వైరస్ కారణంగా లక్షకు పైగా కోళ్లు చనిపోయాయి. మరణానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియలేదు. అధికారులు ఇది వైరస్ అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. టీకాలు లేకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. గుడ్లు పెట్టిన నిమిషాల్లోనే కొన్ని కోళ్లు చనిపోయాయని రైతులు తెలిపారు. ఈ వైరస్ ఇతర కోళ్లలో వేగంగా వ్యాపించి, కోళ్ల పెంపకందారులకు పెద్ద నష్టాన్ని కలిగించింది. ఈ విషయంపై ఏలూరు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి. గోవింద రాజు మాట్లాడుతూ, గత మూడు వారాలలో ఒకే ప్రాంతంలో 35,000 కోళ్లు చనిపోయాయన్నారు. చనిపోయిన కోళ్లను సురక్షితంగా పూడ్చిపెట్టడానికి పశువైద్య అధికారులను వెంటనే పంపించినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లోని నివాసితులు కోళ్ల మాంసం తినకూడదని సూచించారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహకాలు విడుదల

### నగదు ప్రోత్సాహకాలు ప్రకటించిన ఎపి ప్రభుత్వం

### శాప్ ఛైర్మన్ రవి నాయుడు వెల్లడి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డితోపాటు శాప్ ఛైర్మన్ రవినాయుడు విజ్ఞప్తితో క్రీడా ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంపై శాప్ ఛైర్మన్ రవి నాయుడు గురువారం అమరావతిలో విలేకర్లతో మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో రూ.11,68,62,288 క్రీడా ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ ప్రోత్సాహకాలు అందక దాదాపు 224 మంది రాష్ట్రంలోని క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. 189 మంది క్రీడాకారులకు రూ.7,96,62,289 నగదును కూటమి ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసిందన్నారు. క్రీడాకారులకు ప్రోత్సహకాలు విడుదల చేయడంతో సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేష్‌కు శాప్ ఛైర్మన్ రవినాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు..ప్రోత్సహకాలు విడుదల చేయడంపై క్రీడాకారులతో పాటు క్రీడా సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలోని క్రీడాకారుల సమస్యలను ఇటీవల సీఎం చంద్రబాబు దృష్టికి రవి నాయుడు తీసుకు వెళ్లిన విషయం విదితమే. గత వైసీపీ ప్రభుత్వంలో క్రీడాకారులకు ఎటువంటి ప్రోత్సహకాలు అందజేయలేదు. దీంతో వందలాది మంది క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ?న్నారు. ఇక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆడుదాం ఆంధ్ర పేరుతో అట్టహసంగా క్రీడలను ఏర్పాటు చేశారు. క్రీడాకారుల కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అందుకోసం భారీగా నిధులు సైతం కేటాయించారు. కానీ ఇది సైతం అంతగా సక్సెస్ కాలేదు. అంతేకాదు.. ఇందులో భారీ కుంభకోణం చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

## జగన్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు

### 30 ఏళ్లు అధికారం అంటూ పగటి కలలు

### మండిపడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది

కడప : మళ్లీ అధికారంలోకి వస్తాం.. జగన్ 2.0 వేరుగా ఉంటుంది.. ఈసారి అధికారంలోకి వస్తే 30 ఏళ్లు మనదే పాలన ఉంటుందంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఎదురుదాడి చేశారు. వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదా కోల్పోయారు. 30 ఏళ్ల నా పాలన, 175 /175 ఎమ్మెల్యే, 25/25 ఎంపీలు అనే వారు అంటూ ఎద్దేశా చేశారు.. ఇక, ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోబోతోంది.. ఇక, ఏపీలో వికసిత భారత్ ద్వారా నీకు రాజకీయం లేకుండా చేస్తాం అంటూ హెచ్చరించారు.. నా వెంట్రుక కూడా పికలేరు అనుకుంటున్నారు.. అయితే, అభివృద్ధి ద్వారా నీకు భవిష్యత్ లేకుండా చేస్తాం అన్నారు.. నేను బటన్ నొక్కా.. బటన్ నొక్కా అని చెబుతున్న జగన్.. బటన్ నొక్కి ప్రజలకు బటర్ మిల్క్ ఇచ్చాడు అంటూ సెటైర్లు వేశారు. ఇక, వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో గుండెపోటు అన్నారు.. వైఎస్ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి పోలీసులు వెళ్తే అడ్డుకున్నారు.. వైఎస్ జగన్ రెప్పకు దెబ్బతగిలితే అది హత్య, మీ చిన్నాను హత్య చేస్తే కనపడదా..? అంటూ నిలదీశారు ఆదినారాయణరెడ్డి.. జమ్మలమడుగులో మా గ్రామానికి చెందిన వ్యక్తి ఏదో చేస్తే అది నేను చేశాను అట? అసాంఘిక కార్యకలాపాలు చేయించే వ్యక్తిని చెప్పుతో కొడతా.. అంటూ హెచ్చరించారు.. నేనే పోలీసులులను అదేశించా? అసాంఘిక కార్యకలాపాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరాను అన్నారు.. నా కార్యకర్తలకు ఉద్యోగాలు కోసం పోరాడుతున్నాను.. అంతే తప్ప నేను పరిశ్రమలకు పెట్టే వారికి వ్యతిరేకంగా పని చేయలేదని స్పష్టం చేశారు.. వాల్తేరు డివిజన్ కాదని, విశాఖ కు రైల్వే డివిజన్ ఇచ్చాం.. దవోస్ లో చర్చలు జరిగాయి.. 10 వేల కోట్లతో కడపకు స్టీల్ ఎ÷-లాంట్ రాబోతోంది.. జగన్ ను ఏకాకిని చేస్తాం అని ఆదినారాయణరెడ్డి అన్నారు. జలజీవన్ మిషన్ కు భారీగా నిదులు తెచ్చాం? జగన్ సార్ ది పెద్ద అంగడి, అవినాష్, పెద్దిరెడ్డి, విజయ సాయి రెడ్డి వీళ్లది సూపర్ మార్కెట్, మిగిన వైసీపీ వారిది చిల్లర అంగడి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## తలసేమియా బాధితుల కోసం 15న మ్యూజికల్ నైట్

అమరావతి : తలసేమియా బాధితుల సహాయం కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 15న విజయవాడలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాల వివరాలను నారా భువనేశ్వరి, తమన్ మీడియాకు వివరించారు. విజయవాడలో జరగనున్న మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు ఈ షో తాను చేయడం చాలా సంతోషంగా ఉందని మ్యూజిక్ డైరెక్టర్ తమన్ అన్నారు. నారా భువనేశ్వరి ఈ కార్యక్రమం చేయాలి అని తనను అడిగారని.. తలసేమియా భాదితులకు సహాయం కోసం అని చెప్పగానే తాను వెంటనే ఈ కార్యక్రమంకి వస్తా అని చెప్పానన్నారు. నారా భువనేశ్వరి తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద కార్యక్రమం తనకు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం పగలు రాత్రి పని చేస్తున్నారని, ఈ షో ద్వారా వచ్చే ప్రతి రూపాయి తలసేమియా భాదితులకు వెళ్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో ఈనెల 15 న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో యుఫోరియా మ్యూజికల్ నైట్ జరుగుతుందని నారా భువనేశ్వరి తెలిపారు. తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరవుతున్నారని చెప్పారు. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అని ఎన్టీఆర్ నమ్మారని, ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ ట్రస్టు ఏర్పాటు జరిగిందని ఆమె అన్నారు. రక్తదానం చాలా మంది జీవితాలను నిలబెడుతుందని.. రక్తదానం కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని ఆమె పిలుపిచ్చారు. తలసేమియా బాధితులు శ్వాస తీసుకోడానికి కూడా ఇబ్బంది పడతారని నారా భువనేశ్వరి అన్నారు. వారి కోసమే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె మరొకసారి స్పష్టం చేశారు.

## కీలక నిర్ణయాలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం

అమరావతి : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆసక్తి కర నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈఏపి ప్రాజెక్టులు మినహా ఏపి సీఆర్డీఏ చేపట్టే పనులకు టెండ ర్ల పరిమితి పెంపు కోసం నిభందనల సవరణ కోసం కేబినెట్ లో చర్చించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ఇకపై 34 శాతం రిజర్వేషన్‌కు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో బీసీలకు కీలక పదవులు దక్కే అవకాశం ఉంది. మొత్తం 21 అంశాలు ఏజెండాగా ఏపీ కేబినెట్ సమావేశం కొనసాగుతోంది. ఏపీ మంత్రివర్గ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీ ఎస్సి ఎస్టీ, మైనారిటీ లకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2019 లో చేసిన చట్టాన్ని వెనక్కు తీసుకుంటూ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సమయంలో ఆ చట్టంలో లోటుపాట్లు సవరించేలా కొత్తం చట్టం తెచ్చే ప్రతిపాదన పై కేబినెట్ లో చర్చించి ఆమోదం తెలిపారు. టిటిడిలో పోటు లో పని చేసే వర్కర్ లను సూపర్ వైజర్ లుగా అప్గ్రేడ్ చేస్తూ కేబినెట్ లో చర్చించారు. వీరిని సీనియ ర్ అసిస్టెంట్ కేడర్ కు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. స్టాంపు లు రిజిస్ట్రేషన్ల శాఖ లో డాక్యుమెంట్ ల రిజిస్ట్రేషన్ కు డైనమిక్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ ప్రవేశ పెట్టే ప్రతిపాదన పై కేబినెట్ చర్చించింది. తిరుపతి జిల్లా లోని చెన్నై – బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ లో భూములు కోల్పోయిన వారికి పరిహారం గా ఎకరానికి 8 లక్షల చొప్పున ఇచ్చేందుకు కేబినెట్ లో ప్రతిపాదించారు. భారత్ లో తయారైన విదేశీ మద్యం , బీర్, ఎఫ్ ఎల్ స్పిరిట్ ల పై అదనపు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ సవరణ కు కేబినెట్ లో ఆమోదం తెలిపినట్లు సమాచారం. విశాఖ గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి గజాల వరకు అభ్యంతరం లేని భూముల నిర్మాణానికి క్రమబద్ధీకరణకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. గాజువాకను ప్రత్యేకంగా తీసుకుని ఈ ప్రాంతంలో వెయ్యి గజాల వరకు కూడా సవరణ చేయలని నిర్ణయం తీసుకున్నారు. కొంత కాలంగా చర్చగా ఉన్న పట్టాదారు పుస్తకం విషయంలో కూడా చట్టసవరణకు వచ్చిన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ఏపీ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ 2025కు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎమ్ఎస్ఎంఈ పాలసీని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు సంబంధించి వారికి మరిన్ని ప్రోత్సహకాలు అందించే విధంగా కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకు న్నారు. పరిశ్రమలను రాష్ట్రానికి రప్పించడంతో పాటు.. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామికవేత్త లను ప్రోత్సహించాలని నిర్ణయించారు. మరోవైపు పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించే అంశం పైన కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. సంక్షేమ పథకాల అమలు.. ఎమ్మెల్సీ ఎన్నికల తో పాటుగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ పైన మంత్రివర్గంలో చర్చించినట్లు తెలుస్తోంది.

## విలాస జీవితం కోసం నకిలీ దందా

### నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తూ పట్టుబడ్డ యువకులు

హైదరాబాద్ : విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడ్డ పలువురు యువకులు నకిలీ విద్యార్హత పత్రాలను సృష్టిస్తూ అమాయకులను మోసగిస్తున్నారని సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ స్వామి తెలిపారు. శాలిబండ ప్రాంత వాసి అబ్దుల్ ఖదిర్ (47) చిన్నచిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని గురువారం మీడియాతో చెప్పారు. ప్రైవేట్ కంపెనీల్లో సంపాదిస్తున్న నెలవారీ వేతనంతో విలాసవంతమైన జీవితం గడపలేకున్నాడన్నారు. నగరంలో ఉద్యోగ రీత్యా, విదేశాలకు వెళ్లాలనుకునే నిరుద్యోగులకు నకిలీ విద్యార్హత పత్రాలను అంటగట్టి సులువుగా డబ్బులు సంపాదించాలని పథకం వేశాడు. ఇందుకోసం అతని స్నేహితుడైన మహమ్మద్ షకీల్ (37)కు తన ప్లాన్ వివరించి డబ్బులు సంపాదించడానికి సులువైన మార్గమని సూచించాడు. కాన్పూర్ నివాసి సంజయ్ శర్మ అలియాస్ సాహిల్ శర్మతో నిందితులు సంప్రదింపులు జరిపారు. హైదరాబాద్ నగరంలో నిందితులు అమాయకులను గుర్తిస్తూ వారికి దేశంలోని విశ్వవిద్యాలయాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని చెప్పి, భాదితుల అవసరాల మేరకు నగదును డిమాండ్ చేసే వారు. బాధితుల నుండి నగదు తీసుకున్న నిందితులు సాహిల్ శర్మకు వివరాలు అందించేవారు. సాహిల్ శర్మ బాధితుల వివరాలతో నకిలీ విద్యార్హత పత్రాలను తయారు చేసి వాటిని అబ్దుల్ ఖదిర్‌కు కొరియర్‌లో పంపేవాడు. వాటిని నిందితులు అమాయకులకు అంటగట్టేవారు. నిందితుల గురించి.. నకిలీ విద్యార్హత పత్రాల తయారీ గురించి విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు డబీర్ పుర పోలీసులతో కలసి బుధవారం చంచల్‌గూడ న్యూ రోడ్‌లోని డైమండ్ హోటల్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై హైదరాబాద్‌లోని కంచన్ బాగ్, చంద్రయణ గుట్ట, హుస్సేని ఆలం పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితుల వద్ద నుండి కాకతీయ విశ్వవిద్యాలయనికి చెందిన నకిలీ సర్టిఫికెట్లు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ఎనిమిది నకిలీ సర్టిఫికెట్లు, నేషనల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ / సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్ కు చెందిన (10) నకిలీ సర్టిఫికెట్లు,న్యూఢిల్లీ, అన్నామలై విశ్వవిద్యాలయం నకిలీ సర్టిఫికెట్లతోపాటు ఓ ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని అదనపు డీసీపీ స్వామి తెలిపారు.నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో మలక్ పేట్ ఏసీపీ శ్యాంసుందర్‌తోపాటు ఇన్స్పెక్టర్ నాను నాయక్, ఎస్ఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

ములుగు : గోవిందరావుపేట మండలం ప్రసాలో నివాసం ఉంటున్న ఏఆర్ ఎస్ఐ సుర్ణపాక లక్ష్మీనర్సు (36) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో గురువారం కలకలం సృష్టించింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని 15వ బెటాలియన్‌కు చెందిన లక్ష్మీనర్సు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఏఆర్ ఎస్ఐగా పని చేస్తున్నారు. కుటుంబంతో ములుగు జిల్లా గోవిందరావుపేట పస్రాలో నివాసం ఉంటున్నారు. ఆయన స్వస్థలం కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు మండలం మాణిక్యారం. ఆయన నివాసంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పస్రా ఎస్ఐ కమలాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం కోసం ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలతోనే ఆయన ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇదిలా ఉండగా.. మృతుడి భార్య సునీత గోవిందరావుపేట మండలంలోనే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నది. వీరిద్దరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, భార్యాభర్తల మధ్య బుధవారం గొడవ జరిగిందని.. దాంతో భార్యను ఇంటి నుంచి ఎస్ఐ గెంటి వేశారని.. దాంతో ఆమె హన్మకొండలోని బంధువుల ఇంటికి పిల్లలతో కలిసి వెళ్లినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## మస్తాన్ సాయిని కస్టడీకి ఇవ్వాలని కోరిన నార్సింగి పోలీసులు




హైదరాబాద్ : మస్తాన్ సాయి కేసులో పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. దీనిలో భాగంగా మస్తాన్ సాయిని కస్టడీకి ఇవ్వాలని నార్సింగ్ పోలీసులు కోరారు. ఇందులో లోతైన దర్యాప్తు చేయాలని భావిస్తున్న పోలీసులు.. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో వందలాది వీడియోస్‌ను గుర్తించిన పోలీసులు.. మొబైల్‌ను సీజ్ చేశారు. మస్తాన్ సాయి స్నేహితుడు కాజాను అరెస్ట్ చేసి 41 నోటీసులు జారీ చేశారు. డ్రగ్స్ టెస్ట్‌లోనూ మస్తాన్ సాయికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. మస్తాన్ సాయి మొబైల్‌లో వేలాదిమంది అమ్మాయిల కాంటాక్ట్ లిస్ట్ ఉన్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారని ఆరా పోలీసులు ఆరా తీయనున్నారు. నగ్న వీడియోలు, డ్రగ్స్ వ్యవహారంపై నార్సింగి పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా.. మస్తాన్ సాయి కొంతమంది యువతులను ట్రాప్ చేసి నగ్న వీడియోలు చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ పాల్పడ్డాడని అభియోగాలు, ఆరోపణలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు పోలీసులు. మరోవైపు మస్తాన్ సాయి డ్రగ్స్ వ్యవహారం కూడా బయటపడింది. వీకెండ్స్‌లో తన ఫ్లాట్‌లో డ్రగ్స్ పార్టీలు చేసేవాడని.. దీనికి సంబంధించిన వీడియోలను కూడా పోలీసులు సేకరించారు. డ్రగ్స్, నగ్న వీడియోలకు సంబంధించి పూర్తి స్థాయిలో నార్సింగ్ పోలీసులు విచారణ జరిపే అవకాశం ఉంది. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు.. మస్తాన్ సాయిని అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు కూడా తరలించారు. అయితే జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించే క్రమంలో మస్తాన్ సాయికి కాజా అనే యువకుడికి డ్రగ్ టెస్ట్ చేయడంతో ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది. ఈ క్రమంలో డ్రగ్ కోణాలపై కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని పోలీసులు భావిస్తున్నారు. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్, మొబైల్‌ను సీజ్ చేసిన పోలీసులు... వాటిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించారు. వచ్చే వారంలో ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వచ్చే అవకాశం ఉంది. ఈ రిపోర్టుపై, వారంతరాల్లో డ్రగ్స్ పార్టీలపై మస్తాన్‌ను కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపే అవకాశం ఉంది. నార్సింగ్ పోలీసులు వారం రోజుల పాటు కస్టడీకి కోరినప్పటికీ కోర్టు ఎన్నిరోజుల పాటు కస్టడీకి అనుమతిస్తుంది అనేది మరికాసేపట్లో తెలియనుంది.

## ఫైళ్ల క్లీయరెన్స్‌లో మంత్రి ఫరూఖ్ ఫస్ట్

### ఆరోస్థానంలో సిఎం చంద్రబాబు

### పదోస్థానంలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి : డిసెంబరు వరకు దస్త్రాల క్లియరెన్స్‌లో మంత్రుల పనితీరును ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్టు సీఎం చెప్పారు. దస్త్రాలు వేగంగా క్లియర్ చేయాలని మంత్రులకు సూచించారు. దస్త్రాల క్లియరెన్స్‌లో మొదటి స్థానంలో ఎన్ఎండీ ఫరూఖ్ నిలిచారు. రెండో స్థానంలో కందుల దుర్గేశ్, మూడో స్థానంలో కొండపల్లి శ్రీనివాస్, నాలుగో స్థానంలో నాదెండ్ల మనోహర్, ఐదో స్థానంలో డోలా బాలవీరాంజనేయస్వామి, ఆరోస్థానంలో సీఎం చంద్రబాబు, ఏడో స్థానంలో సత్యకుమార్, ఎనిమిదో స్థానంలో నారా లోకేశ్, తొమ్మిదో స్థానంలో బీసీ జనార్ధన్‌రెడ్డి, పదో స్థానంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పదకొండో స్థానంలో సవిత, 12వ స్థానంలో కొల్లు రవీంద్ర 13 వస్థానంలో గొట్టిపాటి రవికుమార్, 14వ స్థానంలో నారాయణ, 15వ స్థానంలో టీజీ భరత్, 16వ స్థానంలో ఆనం రామనారాయణరెడ్డి, 17వ స్థానంలో అచ్చెన్నాయుడు, 18వ స్థానంలో రాంప్రసాద్‌రెడ్డి, 19వ స్థానంలో గుమ్మడి సంధ్యారాణి కొనసాగుతున్నారు.20వ స్థానంలో వంగలపూడి అనిత, 21వ స్థానంలో అనగాని సత్యప్రసాద్, 22వ స్థానంలో నిమ్మల రామానాయుడు, 23వ స్థానంలో కొలుసు పార్థసారథి, 24వ స్థానంలో పయ్యావుల కేశవ్, చివరి స్థానంలో వాసంశెట్టి సుభాష్ ఉన్నారు.

## కేంద్ర కేబిన్ ముందుకు కొత్త ఆదాయచట్టం

### నేటి కేబినేట్ ఆమోదం అనంతరం పార్లమెంట్‌కు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో త్వరలో కొత్త చట్టం రాబోతోంది. దీనికి సంబంధించిన బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. పాత చట్టంతో పోలిస్తే ఇందులోని నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఉండబోతున్నాయని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఈ బిల్లుపై శుక్రవారం కేబినెట్‌లో చర్చించి ఆమోద ముద్ర వేయనున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆరు దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం, 1961 స్థానంలో కొత్త బిల్లు తీసుకు రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల బడ్జెట్‌లో వెల్లడించిన సంగతి తెలిసిందే. కొత్త బిల్లులో ఆదాయపు పన్ను రేట్లు, శ్లాబులు, బడ్జెట్‌లో ప్రతిపాదించిన టీడీఎస్ నిబంధనలు సైతం పొందుపరచనున్నారు. ఈ బిల్లులో సుదీర్ఘ వాక్యాలు ఎక్కడా ఉండబోవని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే తెలిపారు. కొత్తగా ఎలాంటి పన్నులు గానీ, అదనపు భారాలు గానీ ఉండబోవన్నారు. కేవలం న్యాయ కోవిదులకే కాకుండా సామాన్యులు సైతం సులువుగా అర్థం చేసుకునే విధంగా ఉండాలన్న సంకల్పంతో ఈ బిల్లును రూపొందిచినట్లు తెలిపారు.




# ఫిబ్రవరి 6న తెలుగు సినిమా దినోత్సవం

### ఏటా పండుగలా నిర్వహించాలని ఛాంబర్ నిర్ణయం

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 6వ తేదీని తెలుగు సినిమా దినోత్సవంగా సెలబ్రేట్ చేయాలని, అలాగే ఛాంబర్ తరఫున ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాలు, నటీనటులకు అవార్డులు, పద్మ ఇంకా ఇతర అవార్డులు పొందిన వారందరినీ సన్మానించాలనేలా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6ను తెలుగు సినిమా పుట్టిన రోజుగా ఇకపై గ్రాండ్‌గా సెలబ్రేట్ చేయనున్నట్లుగా తెలుపుతూ.. ఆ రోజున ప్రతి నటీనటుడి ఇంటిపైన, అలాగే రాష్ట్రంలోని థియేటర్లపైనా జెండా ఎగురవేయాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. ఈ మేరకు తెలుగు సినిమా పుట్టినరోజుకు సంబంధించిన జెండా రూపకల్పన బాధ్యతను సీనియర్ సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణకు అప్పగించినట్లు ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది. గురువారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖులు పాల్గొని.. ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఈ ఏడాది సింపుల్‌గా ప్రారంభించి, ప్రతి ఏడాది ఘనంగా చేయదలిచాము. తెలుగు సినిమా పుట్టుకను రాబోయే తరాలకు కూడా గుర్తుండేలా చేయాలన్నదే మా ప్రయత్నం. తెలుగు సినిమా చరిత్ర రాబోయే తరాలకు తెలియాలనే తెలుగు సినిమా దినోత్సవం జరపుతున్నాము. వచ్చే ఏడాది నుంచి గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేయటంతో పాటు.. ఆ ఏడాది ప్రతిభావంతులకు, పద్మ అవార్డ్ గ్రహీతలను సన్మానించే పరిశీలన చేస్తున్నాము. గద్దర్ అవార్డ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా ఉంది. సినిమా ఇండస్ట్రీ గురించి, వ్యక్తుల గురించి తక్కువ చేసి మాట్లాడే వారిని ఎప్పటికప్పుడు ఛాంబర్ కట్టడి చేస్తూనే ఉంది. వివాదాస్పద కామెంట్స్ చేసే వారు తామెంటో కూడా చూసుకోవాలని సూచించారు. 'భక్త ప్రహ్లాద' విడుదలైన ఫిబ్రవరి 6 తెలుగు సినిమా పుట్టిన రోజు. తమిళ వాళ్లు మాది అని చెప్పుకునే 'కాళిదాసు' మన తెలుగు సినిమానే. హిందీ తొలి సినిమా 'ఆలం ఆరా', తెలుగు వారి 'భక్త ప్రహ్లాద', తమిళ వారి 'కాళిదాసు' ఇలా అన్నీ సినిమాల్లో ఎల్ వి ప్రసాద్ యాక్ట్ చేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ ఇండస్ట్రీకి రెండు కళ్లలా తెలుగు సినిమా పరిశ్రమలో చరిత్ర సృష్టించారు. సినిమా వారంతా గర్వపడే రోజు ఇదని పేర్కొన్నారు. ఫిబ్రవరి 6ను ప్రతి ఏడాది తెలుగు సినిమా దినోత్సవంగా గ్రాండ్‌గా జరపనున్నాం. 1973లో నన్ను అట్లూరి పూర్ణచంద్రరావు పరిచయం చేశారు. వారు సినిమా రిప్రజంటేటివ్‌గా కెరీర్ ప్రారంభించి నిర్మాతగా మారి ఎన్నో గొప్ప సినిమాలు చేశారు. ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు అని నటుడు మురళీమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# లవ్‌యాపా అంటూ వస్తోన్న ఖుషీ కపూర్

'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం 7 నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. ఎందుకంటే ఎమోషనల్ సీన్స్‌లలో నా ఖుషీ ఏడవడం బిగ్‌స్క్రీన్‌పై చూసినప్పుడు తట్టుకోలేను' అని రాసుకొచ్చారు. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్ . ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'లవ్‌యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే' . నేటితరం యువతీ యువకుల ప్రేమకథతో దీనిని రూపొందించారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్‌యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

## అందరూ దయతో ఉండండి

### రష్మిక ఇంట్రెస్టింగ్ పోస్ట్

ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తన సినిమా విశేషాలు పంచుకునే ఆమె తాజాగా దయగా ఉండండి అంటూ పోస్ట్ పెట్టారు. 'ఈ రోజుల్లో అందరిలో దయ తగ్గిపోతోంది. నేను మాత్రం అందరినీ ఒకేలా చూస్తాను. మీరంతా కూడా అలానే ఉండండి. ఒకరిపై ఒకరు దయతో ఉండండి' అని రాసుకొచ్చారు. తాను ధరించిన టీ షర్ట్ మీద కూడా దయ అనే రాసి ఉంది. దీంతో ఈ పోస్ట్‌పై నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా రష్మిక, విజయ్ దేవరకొండ జిమ్‌లో కలిసి కనిపించిన వీడియో వైరలైన విషయం తెలిసిందే. అయితే, జిమ్‌లో నుంచి బయటకు వచ్చిన విజయ్ కారులో కూర్చోగా.. రష్మిక కాలికి ఉన్న గాయం కారణంగా ఇబ్బందిపడుతూ కారు ఎక్కారు. ఈ వీడియోపై కొందరు విజయ్‌ను విమర్శిస్తున్నారు. రష్మికకు సాయం చేయొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్ వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రష్మిక నటించిన ఛావా విడుదలకు సిద్ధమైంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్'లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఇది రానుంది. అలాగే వీటితో పాటు 'థామ', 'కుబేర', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతోనూ రష్మిక బిజీగా ఉన్నారు.





# బలగం వేణు..ఎల్లమ్మకు సర్వం సిద్ధం

బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టి బలగం వేణుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2023 లో విడుదలైన ఈ సినిమా ప్రశంసలతో పాటు కాసుల వర్షం కురిపించింది . వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి చాలా కాలం అవుతున్నా కూడా మరో సినిమాను పట్టాలెక్కించలేదు ఈ దర్శకుడు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే తన రెండవ సినిమా చేయాల్సి ఉంది.అయితే ఈ కథ అందరి చుట్టూ తిరిగ్గి ÷నైల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. పలు మార్పులతో మొత్తానికి ఈ సినిమా అక్కడ ఓకే అయింది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు. ప్రస్తుతం నితిన్ చేస్తున్నరాబిన్ హుడ్, తమ్ముడు సినిమాలు చివరి దశ షూట్ లో ఉన్నాయి. ఇక ఇప్పుడు వేణు దర్శకత్వంలో ఎల్లమ్మ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు నితిన్. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి ఎండింగ్ లేదా మార్చ్ లో ముహూర్తం పూజ ఉండనుందట. ఏప్రిల్ లేదా మే నుండి షూటింగ్ మొదలు కానుంది. నితిన్ ను సరికొత్తగా చూపించేందుకు కొత్త మెకోవర్ ట్రై చేస్తున్నాడు దర్శకుడు వేణు యెల్దండి. దాదాపు రెండేళ్లుగా ఈ కథ మీద కసరత్తులు చేస్తున్న వేణు ఈ సినిమాతో నితిన్ కు ఎంత పెద్ద హిట్ ఇస్తాడో చూడాలి.




# సాయిపల్లవి న్యాయం చేయగలదనే నమ్మకం

### అందుకే తండేల్‌లో ఆమెను ఎంపిక చేశా: అల్లు అరవింద్

నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి తెరకెక్కిస్తున్న చిత్రం 'తండేల్' ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రిలీజైన ట్రైలర్ కు మంచి స్పందన లభిస్తోంది. దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన 'బుజ్జి తల్లి, శివ శక్తి, హైలెస్సో హైలెస్సా' పాటలు మ్యూజిక్ చార్టులలో టాప్ ప్లేస్‌లో, అలాగే యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలిచాయి. ఈ నేపథ్యంలో నిర్మాత అల్లు అరవింద్ హీరోయిన్ సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అల్లు అరవింద్ మాట్లాడుతూ..'ఈ చిత్రంలో సాయి పల్లవి ఎంపిక నా నిర్ణయమే. ఇది కమర్షియల్ నిర్ణయమని చెప్పాలి. ఈ పాత్ర కోసం నేను ముంబయి వెళ్లి ఎవరినీ తీసుకురాలేదు. ముంబయి నుంచి వచ్చిన వైట్ స్కిన్ అమ్మాయిలు ఈ పాత్రకు జీవం తీసుకు రాలేరనిపించింది. ఇది ఎన్నో భావోద్వేగాలతో కూడిన పాత్ర. ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఇలాంటి గొప్ప పాత్రను నిజాయతీగా చేయాలి. సాయిపల్లవి అయితే వందశాతం న్యాయం చేయగలదని నాకు అనిపించింది. ఆమె అసాధారణమైన నటి. అందుకే ఆమెను ఎంపిక చేశాం. మేము అనుకున్నట్లుగానే సాయిపల్లవి వందశాతం న్యాయం చేసింది' అన్నారు. ఇటీవల సాయిపల్లవికి విశ్రాంతి కావాలని వైద్యులు సూచించారు. ఆమె అనారోగ్యానికి గురయ్యారని దర్శకుడు చందు మొండేటి ముంబయిలో జరిగిన 'తండేల్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో చెప్పాడు. అందుకే ఆమె ఈవెంట్‌కి హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'సాయిపల్లవి కొన్ని రోజుల నుంచి జ్వరం, జలుబుతో బాధ పడుతున్నారు. అయినా సినిమాకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో ఆమె మరింత నీరసించారు. వైద్యులు ఆమెకు కనీసం రెండు రోజులు బెడ్ రెస్ట్ అవసరమని సూచించారు. అందుకే ఆమె ముంబయి వేదికగా జరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో పాల్గొనలేకపోయారు' అని అన్నారు. కాగా, ఇప్పుడు ఆమె పూర్తిగా కోలుకొని తండేల్ ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com